ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 215 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 4 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: ₹3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం।
దక్షిణాయణం, హేమంత ఋతువు,
పుష్యమాసం, కృష్ణపక్షం; తిథి: శుద్ధ తదియ
రా.12.10; నక్షత్రం: పుష్యమి ఉ.10.15;
వర్జ్యం: రా.10.19 నుండి 11.49 వరకు;
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48
వరకు, తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు;
రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు



సంక్రాంతి బిజీకి స్పెషల్ రవాణా

- 3262 బస్సులు తిప్పుతాం: టీఎస్ఆర్టీసీ
- 84 ప్రత్యేక రైళ్లు నడుపుతాం: ద.మ. రైల్వే

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 3: రానున్న సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని టీఎస్ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక బస్సులు, రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించాయి. హైదరాబాద్ నగరం నుంచి రెండు రాష్ట్రాలకు పండుగకు తరలి వెళ్లే వారి సంఖ్య భారీగా ఉంటుంది. దీన్ని గమనించి టీఎస్ఆర్టీసీ 3262 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విజయనగరం, తెనాలి, గుంటూరు, గుడివాడ, రాజమండ్రి, కాకినాడ, రాజోలు, మచిలీపట్నం, ఏలూరు, తాడేపల్లి గూడెం, తణుకు, విశాఖ, శ్రీకాకుళం, భీమవరం, నర్సాపురం, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, ఉదయగిరి, కనిగిరి, కందుకూరు తదితర ప్రాంతాలకు 1352 బస్సులను ఈనెల 10నుంచి 13 వరకు నడుపుతున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. అలాగే తెలంగాణలోని పలు ప్రాంతాలకు 1910 ఆర్టీసి సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించింది. అదనపు బస్సులకు అడ్వాన్స్ టిక్కెట్ రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపింది.

వివిధ గమ్యస్థానాలకు 84 ప్రత్యేక రైళ్లు

దక్షిణ మధ్య రైల్వే వివిధ గమ్యస్థానాలకు 84 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. జనవరి 7, 14, 21, 28, ఫిబ్రవరి 4, 11, 18, 25 తేదీల్లో తిరుపతి నుంచి ఏసీ ప్రత్యేక రైలు బయలుదేరి తర్వాతి రోజు విశాఖపట్నం చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో జనవరి 8, 15, 22, 29, ఫిబ్రవరి 5, 12, 19, 26 తేదీల్లో తిరుపతి నుంచి ప్రత్యేక ఏసీ రైలు బయలుదేరుతుంది. కాగా కాచిగూడ- విశాఖ మధ్య నాలుగు, విశాఖ- తిరుపతి మధ్య 4, తిరుపతి- కాచిగూడ మధ్య 4 ప్రత్యేక రైళ్లను నడపనుంది. హైదరాబాద్- విశాఖ- హైదరాబాద్ మధ్య 4 రైళ్లను జనవరి 10, 12, తిరుగు ప్రయాణంలో 11, 13 తేదీల్లో నడుపుతున్నట్లు తెలిపింది. సికింద్రాబాద్- దర్భంగా మధ్య, దర్భంగా -సికింద్రాబాద్ మధ్య 34 సర్వీసులు, హైదరాబాద్- రక్సల్ మధ్య, రక్సల్ హైదరాబాద్ మధ్య 18 సర్వీసులు నడపనున్నట్లు రైల్వే ప్రకటించింది.

ప్రాజెక్టులే నా లక్ష్యం

పెండింగ్ పథకాల పూర్తికి రూ.50 వేల కోట్లు

కుప్పంకన్నా ముందే పులివెందులకు నీళ్లిచ్చాం • జన్మభూమి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఖాజీపేట (కడప), జనవరి 3: రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రూ.50 వేల కోట్లు కేటాయించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానించామని, తద్వారా శ్రీశైలంలో మిగులు జలాలను రాయలసీమకు తరలించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కడప జిల్లా పులివెందులలో బుధవారం నిర్వహించిన జన్మభూమి- మాఊరు సభలో సీఎం మాట్లాడుతూ నీళ్లు తరలించేందుకు ఎంత ఖర్చయినా భరిస్తామన్నారు. వాణిజ్య పంటలకు రాయలసీమ కేంద్రబిందువన్నారు. అందుకే సీమను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని ప్రకటించారు. గాలేరు -నగరి ద్వారా కుప్పంకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే అంతకుముందే పులివెందులకు నీరిస్తామని మాట ఇచ్చామని, అదేక్రమంలో మాట నిలుపుకున్నామన్నారు. గండికోట నుంచి చిత్రావతికి నీరు రావడం ద్వారా పంటలు పుష్కలంగా పండించుకోవచ్చునన్నారు. జిల్లాలో రైల్వేకోడూరు మామిడిపండ్లకు, లింగాల చీనీ, దానిమ్మ పండ్లకు మంచి డిమాండ్ ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 19 లక్షల ఇళ్లు నిర్మించామన్నారు. మూడున్నరేళ్లలో 15 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. 9 లక్షల ఫారం పాండ్స్ తవ్వించడం వల్ల భూగర్భజలాలు పెరిగాయన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 50 లక్షల మందికి పెన్షన్లు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో పక్కాఇళ్ల అవసరం లేదని కొన్ని నివేదికలు కేంద్రానికి పంపడంతో కేంద్రం నిధులు ఆగిపోయాయన్నారు. 21 లక్షల ఇళ్ల కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కొంత ఆర్థిక

- మిగతా 7వ పేజీలో



పులివెందులలో జరిగిన జన్మభూమి-మాఊరు సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కరవు భయమిక లేనే లేదు

సీబీఆర్ నుంచి జలాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబు

పులివెందుల, జనవరి 3: పులివెందులకు నీళ్లిచ్చాం. ఇక కరవు ఈ ఛాయలకు కూడా రాదని సీఎం చంద్రబాబు అన్నారు. కడప జిల్లా లింగాల మండలం పార్నపల్లిలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను బుధవారం సందర్శించిన సీఎం, సీబీఆర్ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం పీబీఆర్ బ్రాంచ్ కెనాల్ ద్వారా ఎత్తిపోతల పథకంతో పులివెందులకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రైతులనుద్దేశించిన మాట్లాడుతూ రాయలసీమ దేశానికి మణిహారమన్నారు. రైతుల కష్టం తనకు తెలుసునన్నారు. తానూ రైతుబిడ్డనేనని వారి కోసం ఎన్నో పథకాలను

- మిగతా 7వ పేజీలో



ఆర్డీఎస్ రైతుకు ఊరట

- తుంగభద్ర నుంచి రాజోలిబండకు జలాలు
- ఏపీ మంత్రి దేవినేనితో చర్చించిన హరీశ్‌రావు
- రెండు మూడు రోజుల్లో నీటి విడుదల

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 3: రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆయకట్టు రైతులకు శుభవార్త. ఆర్డీఎస్ ఆయకట్టుకు తుంగభద్ర డ్యామ్‌నుంచి నీటి విడుదలకు మార్గం సుగమమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రస్తుత జోగులాంబ గద్వాల జిల్లాలోని ఆర్డీఎస్‌కు తుంగభద్ర డ్యామ్ నుంచి నీటి విడుదలకు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం బోర్డుకు ఇండెంట్ సమర్పించింది. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇండెంట్ సమర్పించకపోవడంతో తుంగభద్ర బోర్డు నిర్ణయం తీసుకోలేకపోయింది. ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ నీటిపారుదలశాఖ మంత్రి దేవినేని ఉమమహేశ్వరరావుతో బుధవారం తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఫోన్లో చర్చించారు. తుంగభద్ర డ్యామ్ నుంచి కెసి కెనాల్‌కు అవసరమైన నీటి విడుదల కోసం వెంటనే ఇండెంట్ ఇవ్వడానికి మంత్రి దేవినేని ఉమ అంగీకరించారు. దీంతో ఇరు రాష్ట్రాల నుంచి ఇండెంట్ అందగానే నీటి విడుదలకు తుంగభద్ర బోర్డు సిద్ధంగా ఉన్నట్టు అక్కడి అధికారులు స్పష్టం చేసారు. తుంగభద్ర డ్యామ్ నుంచి

- మిగతా 7వ పేజీలో



కర్నూలు జిల్లాలో టిప్పర్ తిరగబడి బియ్యం బస్తాల కింద నలిగిన కూలీలు

ఉసురుతీసిన రహదారులు

రాష్ట్రంలో 10మంది దుర్మరణం

కర్నూలులో ఏడుగురు.. • అశ్వాపురంలో ముగ్గురు..

ఆదోని/ అశ్వాపురం, జనవరి 3: రాష్ట్రంలో రెండు రోడ్డు ప్రమాదాలు పదిమంది ప్రాణాలు బలితీసుకున్నాయి. కర్నూలు జిల్లా చిన్నహోత్తూరు వద్ద టిప్పర్ బోల్తా పడటంతో ఏడుగురు వలస కూలీలు మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంట వద్ద కేబుల్ పనులకు వచ్చిన వారిని భారీ వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. కర్నూలు జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు వలసకూలీలు మృతి చెందారు. మరో పది మందికి గాయాలయ్యాయి. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఆస్పరి మండలం చిన్నహోత్తూరు గ్రామం సమీపంలో టిప్పర్ బోల్తా పడడంతో అందులో ఉన్న వలసకూలీలు శేషమ్మ, హనుమంతమ్మ, గోవిందమ్మ, నర్సమ్మ, ఈరమ్మ, చిన్న మంగమ్మ, నారాయణ మృతి చెందారు. వీరంతా హాళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన వారు. తెలంగాణ రాష్ట్రం నల్లగొండలో పత్తి కోతలకు వెళ్లిన కూలీలు స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ప్రమాదంలో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేటకు చెందిన వలస కూలీలు 20 మంది నల్లగొండ నుంచి టిప్పర్‌లో మంగళవారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న టిప్పర్ ఆస్పరి మండలం చిన్నహోత్తూరు గ్రామం వద్దకు చేరుకోగానే ముందు టైర్ పేలిపోయింది. దీంతో డిస్క్ ఊడిపోయి టిప్పర్ అదుపుతప్పి బోల్తా

- మిగతా 7వ పేజీలో

బాబు మారడు.. మారలేడు!

రాజన్న ప్రాజెక్టులన్నీ తనవని చెప్పుకునే ఘనుడు: జగన్ విమర్శ

కలికిరి/ వాల్మీకిపురం, జనవరి 3: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మోసగాడు అని వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా పీలేరు నియోజకవర్గంలోని కలికిరిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలోని ప్రజలు ఏమాత్రం సంతోషంగా లేరన్నారు. చంద్రబాబు నాయుడు మోసగాడని ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలన్ని మరచిపోయాడని విమర్శించారు. గత ఎన్నికల ముందు చంద్రబాబు రైతు రుణాలు, డ్వాక్రారుణాలు మాఫిచేస్తానని రైతులను, మహిళలను మోసం చేశాడని ఆయన మాటలు నమ్మిన రైతులు, డ్వాక్రామహిళలు అప్పులకు వడ్డీలు కట్టలేక బ్యాంకులలో బంగారు నగలు వేలం వేసుకుంటున్నారని అరోపించారు. ప్రతి పేదవాడికి ఇండ్లు కట్టిస్తాం అని హామి ఇచ్చిన బాబు మాట తప్పారని అన్నారు. ప్రత్యేక హోదావస్తేనే రాష్ట్రం అభివృద్ధిచెందుతుందని ట్యాక్సులు, జిఎస్‌టి వంటివి లేకుంటేనే ఫ్యాక్టరీలు, కంపెనీలు వచ్చి మన రాష్ట్రంలో పెట్టుబడులు పెడతాయని అలాంటిది చంద్రబాబు ప్రత్యేక హోదాను కేంద్రం వద్ద తాకట్టు పెట్టాడని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఆ పదవికి రాజీనామాచేసి వెళ్లిపోతేనే మంచి రాజకీయ వ్యవస్థ మన రాష్ట్రంలో వుంటుందన్నారు. వైకాపాను అధికారంలోకి తెస్తే నీతివంతమైన రాజకీయం చేస్తామని ఆయన ప్రజలకు హామి ఇచ్చారు. బుధవారం చంద్రబాబునాయుడు పులివెందులకు వెళ్లి ప్రాజెక్టులన్ని తానే కట్టినట్లు వాటిని తానే ప్రారంభిస్తున్నట్లు ప్రగల్భాలు పలుకుతున్నాడని అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు పులివెందులలోని పగిడిపాల ప్రాజెక్టుకోసం 763 ఖర్చుపెట్టగా చంద్రబాబు కేవలం 23 కోట్లు ఖర్చుపెట్టి దానిని తానే నిర్మించినట్లుగా ప్రజలను మభ్యపెడుతున్నడని అన్నారు. చిత్రావతి ప్రాజెక్టుకోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 312కోట్లు ఖర్చుపెడితే చంద్రబాబు కేవలం నాలుగేళ్ల పాలనలో 20కోట్లు ఖర్చుపెట్టి అంతా తానే నిర్మించినట్లు చెప్పుకుంటున్నాడని అన్నారు. చిత్తూరు జిల్లాలోని పాలడైరిని రైతుల సంక్షేమంకోసం రాజశేఖర్ రెడ్డి తెరిపిస్తే చంద్రబాబు తన హెరిటేజ్ డైరికోసం రైతులను మోసం చేసి దానిని మూసివేయించారని అరోపించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే చిత్తూరు పాలడైరి తెరిపిస్తానన్నారు. గడచిన నాలుగేళ్ల పాలనలో ప్రజలకు ఏమీ చెయ్యని చంద్రబాబు ఇప్పుడు ఓట్లుకోసం వస్తే ప్రజలను చూసి సిగ్గుపడాలని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

విజయవాడ సమీపంలోని పోరంకి వద్ద నిర్వహించిన జన్మభూమి సభకు గ్రామీణాభివృద్ధి మంత్రి నారా లోకేశ్ ఎడ్లబండిపై ఊరేగింపుగా వచ్చారు. అదీ బాహుబలి చలన చిత్రంలోని యుద్ధ సన్నివేశంలో వినియోగించిన ఎద్దులు కట్టిన బండిపై రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఫన్‌గామా



ఈ గడ్డం కూడా తీసేస్తే...
ఇక అనుమానమే ఉండదు సార్!!

తెగని ట్రిపుల్ తలాక్

- బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలన్న కాంగ్రెస్ • కోర్టు ఆదేశాల మేరకే పెట్టామన్న అరుణ్ జైట్లీ
- సవరణలైనా చేయాలని పట్టుబట్టిన ఆజాద్ • ఓటింగ్ పెట్టాలని తృణమూల్ సభ్యుడి సూచన
- అధికార విపక్షాల రభసతో రాజ్యసభ వాయిదా



ట్రిపుల్ తలాక్ బిల్లుపై రాజ్యసభలో మాట్లాడుతున్న అరుణ్ జైట్లీ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 3: ముస్లిం మహిళలకు 'ట్రిపుల్ తలాక్' నుండి విముక్తి కలిగించేందుకు ఉద్దేశించిన బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలా, వద్దా? అనే అంశంపై అధికార, ప్రతిపక్షాలు బుధవారం రాజ్యసభలో హోరాహోరీకి దిగాయి. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలనే పట్టుదలతో ఉన్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు పెద్దఎత్తున గొడవ చేయటంతో రాజ్యసభ ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే రేపటికి వాయిదా పడింది. బిల్లుపై వెంటనే చర్చ జరిపి ఆమోదించాలని అధికార పక్షం డిమాండ్ చేయగా ప్రతిపక్షం మాత్రం బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించవలసిందేనని పట్టుపట్టటంతో రాజ్యసన దద్దరిల్లిపోయింది. న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ బిల్లును బుధవారం సాయంత్రం రాజ్యసభలో ప్రతిపాదించారు. ఈ బిల్లుపై చర్చ జరిపి ఆమోదించాలని ఆయన విజప్తి చేశారు. అయితే తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుఖేందురాయ్, కాంగ్రెస్ ప్రతిపక్షం ఉపనాయకుడు ఆనంద్ శర్మ దీనిని వ్యతిరేకించారు. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ ఆనంద్ శర్మ ఒక తీర్మానాన్ని సభలో ప్రతిపాదించటంతో పాటు ప్రతిపక్షం తరపున కమిటీలో ఉండవలసిన సభ్యుల పేర్లను కూడా ప్రతిపాదించారు. ప్రభుత్వం తమ సభ్యుల పేర్లను కూడా దీనికి జోడించాలని ఆయన సూచించారు. సభానాయకుడు, ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ దీనిని గట్టిగా వ్యతిరేకించారు. ఆనంద్ శర్మ ప్రతిపాదించిన తీర్మానం రాజ్యసభ నియమావళికి విరుద్ధమని ఆయన గట్టిగా వాదించారు. ట్రిపుల్ తలాక్ బిల్లు చట్టరూపం దాల్చకుండా చూసేందుకే కాంగ్రెస్ ఈ విధంగా వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం తెలిపి, రాజ్యసభలో వ్యతిరేకించటం వెనక కాంగ్రెస్ ఉద్దేశం

- మిగతా 7వ పేజీలో

మారిన కాంగ్రెస్ వైఖరి
కోరిన ముస్లిం మహిళకు కోతమిగుల్చున్
సిరిరా మోకాలొడ్డిన
తీరై వ్యథనే మిగిల్చితీరునా ఏమో!




విజయవాడ శివారు పోరంకిలో బుధవారం జన్మభూమి సభలో మాట్లాడుతున్న లోకేష్ ★ గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

కాల్ సెంటర్ ఓ బ్రహ్మాస్త్రం

● 2014కు ముందు గ్రామాల్లో చీకటి ● నేడు నిరంతర వెలుగులు
● నదుల అనుసంధానం బాబు ఘనతే ● జన్మభూమి సభలో మంత్రి నారా లోకేష్

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 3: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు జనం అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు కాల్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రజల చేతుల్లో ఒక బ్రహ్మాస్త్రాన్ని పెట్టారని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని పోరంకి గ్రామంలో జెడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన ఐదవ విడత జన్మభూమి-మావూరు కార్యక్రమంలో తొలిసారి మంత్రి హోదాలో లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా రియల్ టైమ్ గవర్నెన్స్‌కు సాంకేతికతను జోడించిన చంద్రబాబుప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నారని తెలిపారు. 2014కు మందు రాష్ట్రంలోని అన్ని గ్రామాలు చీకట్లో ఉండేవన్న ఆయన తెదేపా ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత నేడు నిరంతరం గ్రామాల్లో వెలుగులు ఉన్నాయన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంలో భాగంగా అంటువ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్న ఆయన ఇందుకోసం నిధులను పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మిషన్ అంత్యోదయలో దేశ వ్యాప్తంగా 83 ఉత్తమ గ్రామాల్లో మన రాష్ట్రం నుండి 33 గ్రామాలు ఎంపికయ్యాయని లోకేష్ తెలిపారు. ప్రభుత్వం చుట్టూ ప్రజలు తిరగాల్సిన రోజులు పోయి, నేడు ప్రజల వద్దకే ప్రభుత్వం వచ్చే రోజులు తెదేపా పాలనలో వచ్చాయన్నారు. రియల్ టైం గవర్నెన్స్‌తో పాటు కాల్ సెంటర్ ద్వారా మీ సమస్య గురించి మీరు ఫిర్యాదు చెయ్యక ముందే తెలుసుకొని పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. లోటు బడ్జెట్‌తో ప్రారంభమైన రాష్ట్రంలో కనీసం తనకు వసతి కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్, పింఛన్ ఐదు రెట్లు పెంచి వెయ్యి రూపాయలు, రైతు, డ్వాక్రా రుణమాఫీ చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. నదుల అనుసంధానం చేసిన బాబు ముందు చూపుతో పట్టిసీమ ద్వారా 105 టీఎంసీల నీరు కృష్ణాలోనికి తీసుకు వచ్చి కృష్ణా డెల్టాలోని పంటలను కాపాడారన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలో 1044 వ్యాధులకు వైద్యసేవలనందిస్తున్నామన్న లోకేష్ వైద్య సేవలో రెండు లక్షల సీలింగ్ నుండి 2.50 లక్షలకు పెంచి, ప్రజాఆరోగ్యాన్ని కాపాడుతున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చంద్రన్న బీమా ద్వారా మరణించిన వ్యక్తికి ఐదు లక్షల రూపాయలు అందిస్నున్నట్లు తెలిపారు. క్లోరినేషన్‌తో సురక్షిత నీరు అందించడంతో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్స్ శుభ్రం చేయడం, మరమ్మత్తులకు నిధులు కేటాయించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చడం ద్వారా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2019 నాటికి ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నీటి శుద్ధి కోసం ఇంకా మెరుగైన విధానాల కోసం ప్రయత్నిస్తున్నామన్న ఆయన కొన్ని విధానాలను పైలెట్ ప్రాజెక్టుగా చేస్తున్నామన్నారు. గ్రామాల్లో డ్రైనేజి సమస్యలను అధిగమించడంతో పాటు పట్టణాల్లో కూడా లేని అండర్ డ్రైనేజి వ్యవస్థను రాష్ట్రంలోని 157 గ్రామాల్లో నిర్మిస్తున్నామన్నారు. గ్రామాలకు అభివృద్ధిని ప్రోత్సహించేందుకు పది అంశాల ప్రాతిపదికన స్టార్ రేటింగ్స్ ఇస్తామని ప్రకటించారు.

చంద్రబాబు కష్టానికి ఓటు వెయ్యాలి

రాష్ట్రం కోసం అహర్నిశలు కష్టపడుతున్న సీఎం చంద్రబాబు కష్టాన్ని చూసైనా రాష్ట్ర ప్రజలు కచ్చితంగా ఓటు వేసి బాబుకు కృతజ్ఞతలు తెలపాలన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందరి సంక్షేమం, అభివృద్ధి కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం తన మనువడిని కూడా వదులుకుని శ్రమిస్తున్న చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు మరోసారి భారీ మెజారిటీతో టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సంపాదన, ఆనందంలో మన రాష్ట్రమే ముందుండాలంటున్న చంద్రబాబుకు ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలన్నారు.

ఎడ్లబండిపై లోకేష్ ఊరేగింపు

బాహుబలి చలన చిత్రంలో ఒక యుద్ధ సన్నివేశంలో వినియోగించిన ఎద్దుల బండిపైనే బుధవారం పోరంకిలో మంత్రి నారా లోకేష్‌ను ఊరేగించారు. మహారాష్ట్ర బ్రీడ్‌కు చెందిన ఈ గిత్తలను పోరంకి గ్రామానికి చెందిన దాసరి హరినీడు అనే రైతు సంరక్షిస్తున్నాడు. ఇదే గిత్తలతో ప్రత్యేకంగా అలంకించిన బండిపై మొదటి సారిగా పెనమలూరు నియోజకవర్గానికి వచ్చిన మంత్రి లోకేష్‌ను ర్యాలీగా జన్మభూమి వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. పెనమలూరు శాసన సభ్యుడు బోడే ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్సీలు బాబూ రాజేంద్రప్రసాద్, బచ్చుల అర్జునుడు, పంచాయితీరాజ్ కమిషనర్ రామాంజనేయులు, జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, టీడీపీ నేతలు పంచుమర్తి అనూరాధ, దేవినేని చందు, జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతంతో పాటు సర్పంచ్ వేమూరి స్వరూపారాణి, ఇతర శాఖల అధికారులు, మహిళలు, విద్యార్థులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్మభూమిలో ‘పుష్కర’ స్ఫూర్తి!

● గ్రామాలకు రోజువారీ గ్రేడింగ్‌లు
● తూర్పు, గుంటూరు, కడప జిల్లాలకు ఏ గ్రేడ్‌లు
● అంకితభావంతోనే ప్రజల్లో సానుకూలత సాధ్యం
● టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 3: ‘ ఐదో విడత జన్మభూమి - మా ఊరు తొలి రోజు విజయవంతమయ్యింది. ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం స్ఫూర్తిదాయకం. గ్రామ, వార్డు సభల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలి, కృష్ణా పుష్కరాల్లో 90 శాతం సంతృప్తి సాధించాం, జన్మభూమిలో కూడా అదే స్ఫూర్తి కనిపించాలి, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా, సమర్ధంగా పని చేయాలి, మన అంకితభావంతోనే ప్రజల్లో సానుకూలత సాధ్యం’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం తన నివాసం నుంచి రెండవరోజు జన్మభూమిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జన్మభూమి నిర్వహణపై గ్రామాలు, వార్డులకు రోజువారీ గ్రేడింగ్‌లు ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రజాసేవలో పోటీతత్వం పెంచేందుకే జన్మభూమి గ్రేడింగ్‌లు ఇస్తున్నామన్నారు. రోజువారీ నివేదికలు వెంటనే పంపించాలని ఆదేశించారు. నివేదికలు సకాలంలో పంపినందుకు 40 శాతం, గ్రామ స్థాయిలో సర్వేకు 40 శాతం, జిల్లా స్థాయిలో సెంటిమెంట్ అనాలిసిస్‌కు 20 శాతం మార్కులు ఇస్తున్నట్లు తెలిపారు. తొలి రోజున విజయనగరం, కడప, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాలు ఏ గ్రేడ్ సాధించినట్లు వెల్లడించారు. నెల్లూరు, విశాఖ, కర్నూలు, ప్రకాశం, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జిల్లాలు బి గ్రేడ్ వచ్చిందన్నారు. అన్ని జిల్లాలు ఏ గ్రేడ్ వచ్చేలా పోటీపడాలని దిశానిర్దేశం చేశారు. నకరికల్లు, తిక్కవోలు, కొత్తపల్లి, అమలాపురం, పెందుర్తి తదితర మండలాలు ఏ గ్రేడ్ సాధించాయంటూ, అదే విధంగా కొత్తపల్లి, అశ్వాపురం, నక్కపల్లి, ఎగువ తంబళ్లపల్లి గ్రామాలు ఏ గ్రేడ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన మండలాలు, గ్రామాలు కూడా ఏ గ్రేడ్ సాధించాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. గ్రామ, వార్డు సభలు ప్రశాంతంగా, పూర్తి క్రమశిక్షణతో జరపాలన్నారు. ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్థికేతర ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని, ఆర్థికపరమైనవి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. జమాబందీ తరహాలో ఫిర్యాదుల పరిష్కారం శరవేగంగా జరగాలన్నారు. ‘గ్రామాలు, వార్డులు అత్యుత్తమంగా రూపొందాలి, అత్యున్నత సమాజం ఏర్పడాలి. 16వేల గ్రామాలు, వార్డుల్లో జరిగే అతి పెద్ద సామూహిక ప్రజా సేవా కార్యక్రమం జన్మభూమి. ప్రజా సంతృప్తే అభివృద్ధి, సంక్షేమం, అధికారుల పనితీరుకు కొలమానం. 80 శాతం సంతృప్తే లక్ష్యంగా పని చేయాలి. ప్రజల్లో అవగాహన, పోటీతత్వం పెంచడం మనందరి బాధ్యత. అత్యున్నత జీవన ప్రమాణాలున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందాలి’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. అర్హులు అందరికీ పింఛన్లు సకాలంలో అందుతున్నాయా? రేషన్ సకాలంలో అందుతోందా? అర్జీల పరిష్కారం బాగుందా, లేదా? చంద్రన్న బీమా మీ గ్రామంలో అమలు అవుతుందా, లేదా? ఉచిత వైద్య శిబిరాలు, పశు వైద్య శిబిరాల్లో సేవలు బాగున్నాయా, లేదా? వివిధ అంశాలపై జన్మభూమి అధికారులు అవగాహన కల్పిస్తున్నారా, లేదా? అనే అంశాలపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్నట్లుగా ముఖ్యమంత్రి తెలిపారు. గుంటూరు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కృష్ణా, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో తొలిరోజున ప్రజల్లో 70 నుండి 80 శాతం సంతృప్తి వచ్చిందని, అనంతపురం, విశాఖపట్నం, కడప, కర్నూలు జిల్లాల్లో 60 నుండి 70 శాతం సంతృప్తి వ్యక్తమైందని చెప్పారు. 80 శాతం సంతృప్తే లక్ష్యంగా పని చేయాలని మార్గదర్శకం చేశారు. సాధికారమిత్రులు, జన్మభూమి కమిటీలు, స్థానిక సంస్థల ప్రతినిధుర అభిప్రాయాలు కూడా తీసుకోవాలని సూచించారు. సాధికార మిత్రలను విలేజ్ రిసోర్స్ పర్సన్స్‌గా వినియోగించుకోవాలన్నారు. సాధికార మిత్రుల పనితీరును ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నామన్నారు. తినే తిండి, తాగేనీరు, పరిసరాల పరిశుభ్రత, జీవన విధానంపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా మందుజాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆహారంలో పోషక విలువలు పెంచుతున్నామన్నారు. శారీరక వ్యాధులు చాలా వరకు నియంత్రిస్తున్నామంటూ మానసిక వ్యాధులను ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే అధిగమించగలమని తెలిపారు. టెలికాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, సంక్షేమ, ప్రణాళికా శాఖ, రియల్ టైం గవర్నెన్స్, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలనా సంస్థల అధికారులు ఎస్ఎస్ రావత్, సంజయ్ గుప్తా, అహ్మద్ బాబు, రామాంజనేయులు, కృష్ణమోహన్ తదితరులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీకి ‘పశ్చిమ’ పరేషానీ!

● మంత్రిపైనే తమ్ముళ్ల కేసు ● పీతలకు సొంత నేతల సెగ
● కర్నూలులో కొత్త పంచాయితీ ● ‘అనంత’లోనూ అవే దృశ్యాలు
● చంద్రబాబుకు పెరుగుతున్న శిరోభారం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 3: పార్టీకి పెట్టనికోట వంటి జిల్లాల్లో నేతల మధ్య పెరుగుతున్న అంతర్గత కలహాలు తెలుగుదేశం పార్టీ నాయకత్వానికి శిరోభారంగా పరిణమించాయి. ముఖ్యంగా ప్రతిపక్షానికి ఒక్క సీటు కూడా దక్కనివ్వకుండా, పార్టీకి తిరుగులేని మెజారిటీ అందించిన పశ్చిమ గోదావరి జిల్లాలో పెరుగుతున్న ముఠా తగాదాలు పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు తలనొప్పిలా మారాయి. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడం పార్టీకి ఇబ్బందిగా మారింది. టీడీపీ నాయకత్వానికి ముఠా తగాదాల ముప్పు ఏర్పడింది. అంతా కలసికట్టుగా పనిచేయాలని, వర్గ విభేధాలు పక్కకుపెట్టి మళ్లీ ఆయా జిల్లాల్లో పార్టీ గెలిచేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్న అధినేత ఆదేశాలు అమలవుతున్నట్లు కనిపించడం లేదు. ప్రధానంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు తమ పాత అలవాట్లు మార్చుకోకపోవడం పార్టీకి తలనొప్పిలా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. టీడీపీ చరిత్రలో తొలిసారి మంత్రిపై సొంత పార్టీ నేతలే పోలీసు కేసు పెట్టడం సంచలనం సృష్టించింది. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కొత్తగా తొలి సారి మంత్రివర్గంలో చేరిన జవహర్, ఇటీవలి కాలంలో వివాదాలకు కేంద్ర బిందువవుతున్నారు. చాగల్లు జడ్పీటీసీ విక్రమాదిత్య వర్గానికి, జవహర్ వర్గానికి జరుగుతున్న అధిపత్యపోరు పార్టీని రోడ్డున పడేయడం పార్టీ శ్రేణులను కలచివేసింది. జవహర్ వర్గీయులు మరో వర్గానికి చెందిన పార్టీ సహచరులపై చేయి చేసుకోవడం, అది చివరకు మంత్రిపైనే పోలీసులకు ఫిర్యాదు చేసే వరకూ వెళ్లడం సంచలనం సృష్టించింది. రెండు వర్గాలు ఒకరికొకరు అనుకూల-వ్యతిరేక నినాదాలతో ర్యాలీలు నిర్వహించడం నాయకత్వానికి ఆగ్రహం తెప్పించింది. అయితే దీనిపై ఇప్పటివరకూ ఎలాంటి చర్య తీసుకోకపోవడంపై శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మాజీ మంత్రి, సీనియర్ నేత పీతల సుజాతకు మళ్లీ సొంత నియోజకవర్గంలో సమస్యలు మొదలయ్యాయి. మంత్రి పదవి పోయినా ఎలాంటి అసంతృప్తి వ్యక్తం చేయకుండా, నియోజకవర్గానికే పరిమితమయి పార్టీ అభివృద్ధిపై దృష్టి పెట్టిన పీతలకు ఎంపీ వర్గీయుల నుంచి అవమానాలు ఎదురవడంపై దళితుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మంత్రిగా ఉన్నప్పటి నుంచీ ఆమెను పనిచేసుకోనీయకుండా, ఆమె నియోజకవర్గంలో జోక్యం చేసుకుంటున్న ఎంపీ మాగంటి బాబు తీరుపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, నాయకత్వం పట్టించుకోవడం లేదన్న అసంతృప్తి పీతల అనుచరుల్లో ఉంది. తాజాగా సుజాతకు సమాచారం లేకుండానే ఎంపీ కామవరపుకోటలో జరిగిన జన్మభూమి గ్రామసభకు హాజరవడంపై పీతల మనస్తాపం చెందారు. దీనిపై ఆమె ఇన్చార్జి మంత్రి పుల్లారావు, జిల్లా మంత్రి పీతాని సత్యనారాయణ, పార్టీ కార్యాలయ కార్యదర్శి, సమన్వయకర్త టిడి జనార్దన్‌రావుకు ఫిర్యాదు చేసి, తనకు విలువ ఇవ్వకుండా అవమానించిన వైనాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లి ఒక దళిత మహిళకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆవేదన ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. పీతల ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గంతో పాటు, పశ్చిమ గోదావరి జిల్లాలోని మరో మూడు నియోజకవర్గాల్లో పార్టీకి చెందిన కమ్మ సామాజికవర్గ నేతలే గత మూడేళ్ల నుంచీ జోక్యం చేసుకుంటున్న వైనం మిగిలిన వర్గాలకు ఆగ్రహం కలిగిస్తోంది. ముఖ్యంగా ఎస్సీ నియోజకవర్గాల్లో కమ్మ సామాజికవర్గ ప్రభావం ఎక్కువగా ఉండటంతో, ఆ వర్గ నేతలు ఎమ్మెల్యేలయినా, మంత్రులనయినా లెక్కచేయకుండా సమాంతర అధికారాలు చెలాయిస్తున్నారన్న ఆరోపణలున్నా, నాయకత్వం ఇప్పటివరకూ దానిపై దృష్టి సారించకపోవడం అసంతృప్తికి గురిచేస్తోంది. దీనిపై ఇన్చార్జి మంత్రి పత్తిపాటి పుల్లారావు అంటీ ముట్టనట్లు వ్యవహరించడమే కాకుండా, ఒక వర్గాన్ని ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు మిగిలిన సామాజికవర్గాల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, అటు కర్నూలులో ఇద్దరు నేతల మధ్య ఇప్పటినుంచే కర్నూలు ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రచ్ఛన్న యుద్ధానికి తెరలేచింది. వచ్చే ఎన్నికల్లో ఆ సీటు వంద శాతం తనకే వస్తుందని ఎంపి టి.జి.వెంకటేష్ తనయుడు భరత్ బహిరంగంగా మీడియాకే చెబుతున్నారు. అయిత తాను ఏ నియోజకవర్గానికి మారే ప్రసక్తి లేదని, మళ్లీ ఇక్కడ నుంచే పోటీ చేస్తానని సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ఎదురుదాడి చేస్తున్నారు. వీరిద్దరి మాటల యుద్ధానికి ప్రభుత్వ కార్యక్రమాలో, మీడియా భేటీలో వేదిక అవుతున్నాయి. ఇక తొలి నుంచీ పార్టీకి తలనొప్పిలా మారిన అనంతపురం జిల్లా వ్యవహారంలో.. తాజాగా తాడిపత్రి ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యాలు మితిమీరుతున్నాయంటూ సొంత పార్టీ నేతలే బుధవారం రోడ్డెక్కి ధర్నా చేయడం సంచలనం సృష్టించింది. పార్టీ కార్యకర్త శేఖర్‌కు చెందిన అన్నా ట్రాన్స్‌పోర్టులో జెసి వర్గీయులు విధ్వంసం సృష్టించిన ఫలితంగా కారు, లారీ అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం అయిన వైనం పార్టీలో రచ్చకు కారణమయింది. జెసి వర్గీయుల దాడికి నిరసనగా టీడీపీ కార్యకర్తలతో కలసి స్థానిక నేతలు కాకర్ల రంగనాథ్, జయరామిరెడ్డి పోలీసుస్టేషన్ వద్ద బైఠాయించి, జెసిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో పార్టీ పరువు రోడ్డెక్కినట్టయింది. ఇప్పటికే జెసి-ప్రభాకర్‌చౌదరి మధ్య విబేధాలు రచ్చకెక్కగా, తాజాగా తాడిపత్రి కేంద్రంగా తలెత్తిన ఈ గొడవ నాయకత్వానికి ఇబ్బందిగా మారింది. ‘ఇలాంటి పరిస్థితికి కారకులైన వారిపై చర్యలు తీసుకోకుండా వదిలేసిన నాయకత్వానిదే ఈ తప్పంతా. ఒకసారి ఒకరిపై చర్యలు తీసుకుంటే మిగిలినవారు దారికొస్తారు. నంద్యాల-కాకినాడ ఎన్నికల విజయం తర్వాత పార్టీ తిరిగి కచ్చితంగా అధికారంలోకి వస్తుందన్న ధీమా, నమ్మకాన్ని ఇలాంటి చర్యలు దెబ్బతింటాయి. ఒకరిని చూసి మరొకరు రోడ్డెక్కితే అది వైసీపీకి లాభం కలిగిస్తుంది. మా సార్ కూడా ఇక చర్యల విషయంలో మాటలు కాకుండా చేతల్లో చూపిస్తేనే పార్టీ పేరు నిలుస్తుంద’ని ఓ మాజీ మంత్రి వ్యాఖ్యానించారు.

అమరావతి ఔటర్‌లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లు!

● 30 రోజుల్లో ప్రతిపాదనలు ● రూ. 17,761 కోట్ల అంచనాలు
● అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవేతో తగ్గనున్న దూరం
● సీఆర్‌డీఏ సమీక్షలో సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 3: రాజధాని బాహ్య వలయ రహదారి మార్గంలో రెండు, మూడు ఇండస్ట్రియల్ టౌన్‌షిప్పుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో, నీటి వనరులు పుష్కలంగా ఉన్న చోట్ల ఈ టౌన్‌షిప్పులను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇండస్ట్రియల్ జోన్ల ఏర్పాటు ద్వారా ఆ ప్రాంతం వాణిజ్యపరంగా త్వరత్వరగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. దీనిపై 30 రోజుల లోపు ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. బుధవారం రాత్రి విజయవాడ క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి అమరావతిలో చేపట్టిన వివిధ రహదారి ప్రాజెక్టుల పనుల పురోగతిని సమీక్షించారు. బాహ్య, అంతర్ వలయ రహదారుల్లో శీఘ్రగతిన అభివృద్ధి ఎలా జరపాలన్న అంశంపై ఇప్పటి నుంచే తగిన వ్యూహ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే మార్గంలో కూడా పలు జిల్లాల పరిధిలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్పులను ఏర్పాటు చేయాలని, తమ ప్రాంతం అభివృద్ధి చెందుతోందంటే సంబంధిత భూముల యజమానులు భూ సమీకరణకు ముందుకు వస్తారని అన్నారు. 3, 4 ఏళ్లలో ఏర్పాటు చేయబోయే అంతర్జాతీయ విమానాశ్రయం అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే భూ సమీకరణకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని మొత్తం 30 గ్రామాల మీదుగా సాగే అమరావతి అంతర్ వలయ రహదారిని మొదటి విడతగా 97.5 కి.మీటర్ల మేర నిర్మిస్తున్నట్టు అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. ఇందులో తాటికొండ, రావెల తదితర 5 గ్రామాల రైతాంగం భూసమీకరణ విధానంలో తమ భూములను అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని సీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ గ్రామాలతో పాటు బాహ్య, అంతర వలయ రహదారుల పరిధిలోని ఇతర గ్రామాల్లో కూడా భూ సమీకరణకు ప్రతిపాదనలు తయారు చేసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. హైబ్రిడ్ నమూనాలో ఈ ప్రాజెక్టును చేపట్టాలని అధికారులను కోరారు. బాహ్య వలయ రహదారిని మొత్తం 189 కి.మీటర్ల మేర నిర్మితం కానున్నదని, ఎన్‌హెచ్ఏఐ దీనికి అవసరమైన అనుమతులను మంజూరు చేసిందని అధికారులు చెప్పారు. మొత్తం రూ. 17,761 కోట్ల వ్యయం అంచనాతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్టు వివరించారు. 150 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్ల రహదారిగా ఇది ఏర్పాటవుతుందని తెలిపారు. దీని కోసం మొత్తం 3,404 హెక్టార్ల మేర భూమి అవసరం పడుతుందని చెప్పారు. రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 87 గ్రామాల్లో ప్రధాన జిల్లా రహదారులు, రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులను కలుపుకుంటూ బాహ్య వలయ రహదారి ఏర్పాటు కానున్నదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ రహదారి పూర్తయితే 13 జిల్లాల మధ్య ప్రయాణ భారం తగ్గిపోతుందని, ముఖ్యంగా రాయలసీమ రాజధానికి బాగా దగ్గర అవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. 200 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఈ రహదారికి సమాంతరంగా రైల్వే లైన్ కూడా రానుండటంతో దారి పొడవునా ఉన్న జిల్లాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ రహదారికి భూ సేకరణ నిమిత్తం ఈ బడ్జెట్ తొలి త్రైమాసికంలోనే రూ. 2500 కోట్లు కేటాయిచాలని అధికారులు ముఖ్యమంత్రిని కోరారు. కడప, కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల మీదుగా సాగే 393.6 కి.మీటర్ల గ్రీన్‌ఫిల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రాష్ట్ర అభివృద్ధిలో కీలకం కానున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి సంబంధించిన భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రపంచ శ్రేణి ప్రమాణాలతో నిర్మించాల్సిన ఈ రహదారి రాష్ట్రంలో ముఖ్యమైన ఇండస్ట్రియల్ కారిడార్ అవుతుందని చెప్పారు. అనంతపురం జిల్లా పరిధిలో 75కి.మీ మేర నిర్మించే నాలుగు వరసల రహదారికి పెగ్ మార్కింగ్, ఫీల్డ్ మెజర్‌మెంట్ తీసుకోవడం పూర్తయిందని అధికారులు చెప్పారు. కర్నూలు జిల్లాలో నిర్మించే 4 లేన్ల రహదారికి సంబంధించి 80.8 కి.మీ మేర ప్రతిపాదిత రహదారిలో అటవీ ప్రాంతం మినహా 67.25 కి. మీటర్ల మేర పెగ్ మార్కింగ్, ఫీల్డు మెజర్‌మెంట్ పూర్తి చేశారు. ప్రకాశం జిల్లాలో నిర్మించే 6 వరుసల రహదారికి 146.5 కి. మీటర్ల పరిధిలో మొత్తం పెగ్ మార్కింగ్ నూరుశాతం, ఫీల్డు మెజర్‌మెంట్ 85 శాతం పూర్తయ్యింది. గుంటూరు జిల్లాలో ఆరు వరుసల రహదారికి సంబంధించి 91.2 కి.మీ మేర పనుల్లో 42 శాతం పెగ్ మార్కింగ్, 24 శాతం ఫీల్డు మెజర్‌మెంట్ పనులు పూర్తి చేశారు. కృష్ణా నదిపై నిర్మించబోయే వారధుల కోసం ప్రపంచంలోని అత్యుత్తమ నిర్మాణాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో అధికారులకు సూచించారు. ఐకానిక్ వారధులతో కూడిన నగరంగా అమరావతి భాసిల్లాలని ముఖ్యమంత్రి అభిలషించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేయాల్సిన కనకదుర్గమ్మ, ఫ్లయ్‌వోవర్ నిర్మాణ పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. సమావేశంలో పురపాలక మంత్రి పీ నారాయణ, రవాణా, రహదారుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేఠా, సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, కమిషనర్ శ్రీధర్ చెరుకూరి, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీపార్థసారథి పాల్గొన్నారు.



సీఆర్‌డీఏపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

‘జన్మభూమిలో పర్యాటక, సాంస్కృతిక శాఖ పోటీలకు విశేష స్పందన’

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 3: జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా పర్యాటక సాంస్కృతిక శాఖ నిర్వహిస్తున్న జన్మభూమి నేపథ్య అధారిత సాంస్కృతిక పోటీలకు విశేష స్పందన లభిస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. విద్యాశాఖ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తుండగా ప్రతి చోట విద్యార్థులు, యువత నుండి స్పందన లభిస్తోందన్నారు. సంగీతం, నృత్యం, ముకాభినయం, కథలు చెప్పటం, పద్యాలు, శ్లోకాల పఠనం, చర్చ, వ్యాసరచన, పాటల రచన, కథా రచన, నినాదాల కూర్పు, కవిత్వం, చిత్ర లేఖనం అంశాలలో తొలుత గ్రామ, వార్డు స్థాయిలో పోటీలు జరుగుతున్నాయని మీనా పేర్కొన్నారు. మూడు కేటగిరీలుగా విద్యార్థులను విభజించామన్నారు. ఐదు నుండి ఎనిమిదవ తరగతి వరకు విభాగం ఒకటిగా, తొమ్మిది నుండి ఇంటర్మీడియెట్ వరకు విభాగం రెండుగా, డిగ్రీ విద్యార్థులకు విభాగం మూడుగా ఉన్నాయన్నారు. విద్యాశాఖ నేతృత్వంలో కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. తొమ్మిదో తేదీతో గ్రామ స్థాయి పోటీలు ముగియనుండగా విజేతలకు పదో తేదీన మండల స్థాయి పోటీలు నిర్వహిస్తారని ఇక్కడ కూడా ప్రతిభ చూపిన వారికి 11వ తేదీన మండల స్థాయిలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ పరంగా ధృవీకరణ పత్రాలు అందజేస్తామని ముఖేష్ కుమార్ మీనా వివరించారు. మండల స్థాయి విజేతలకు, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల నిర్వహణ క్యాలెండర్‌ను త్వరలో విడుదల చేస్తామని, అయితే ఉగాది వేళ వీరికి బహుమతుల పంపిణీ ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి విజేతలకు అక్కడి ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర స్థాయి విజేతలకు స్వయంగా ముఖ్యమంత్రి పురస్కారాలు అందిస్తారన్నారు. మరోవైపు బహుమతులు పొందిన అంశాలపై ప్రత్యేకంగా పత్రం తయారు చేసే బాధ్యతలను భాషా సాంస్కృతిక శాఖ తీసుకుంటుందని, ఆ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు వీటిని ఈ విభాగానికి పంపవలసి ఉంటుందన్నారు.

రిజర్వేషన్ టికెట్ రద్దు చేసుకుంటే మరొకరికి వెసులుబాటు

విజయవాడ (రైల్వేస్టేషన్), జనవరి 3: రైలులో టికెట్‌ను రిజర్వు చేయించుకున్న ప్రయాణికుడి బదులు మరో వ్యక్తి ప్రయాణించేందుకు వీలుగా రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రిజర్వేషన్ చేయించుకున్న వ్యక్తి ప్రయాణాన్ని రద్దు చేసుకుంటే వారి కుటుంబంలోని వ్యక్తి ప్రయాణించే విధంగా వీలు కల్పించింది. ప్రయాణించే వ్యక్తి ఎవరైనా తన రిజర్వేషన్ టికెట్ తన రక్తసంబంధీకులకు బదిలీ చేయవచ్చు. ప్రయాణికుడు ధృవీకరించిన టికెట్ కలిగి ఉంటే అతను, ఆమె ప్రయాణాన్ని రద్దు చేసుకున్న పక్షంలో టికెట్‌ని ప్రయాణికుడి తల్లి, సోదరుడు, సోదరి, కొడుకు, కుమార్తె, భర్త లేదా భార్యతో సహా అతని, ఆమె కుటుంబ సభ్యులకు టికెట్‌ని బదిలీ చేయవచ్చు. టికెట్ బదిలీ కోసం ప్రయాణికుడు ఒక దరఖాస్తు ఫారాన్ని తప్పనిసరిగా రైలు బయలుదేరే సమయానికి 24 గంటల ముందు తన గుర్తింపుకార్డుతో ప్రధాన రిజర్వేషన్ సూపర్‌వైజరుకు సమర్పించాల్సి ఉంటుంది. అదే ప్రభుత్వ అధికారులు వారి ప్రయాణాన్ని రద్దు చేసుకుంటే ఇతర అధికారికి బదిలీ చేయవచ్చు. అలాగే విద్యార్థులకు చెందిన రిజర్వేషన్ టిక్కెట్‌ని ఇతర విద్యార్థులకు బదిలీ చేయవచ్చు. అయితే విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు వారి టికెట్‌ను బదిలీ చేయాలనుకుంటే వారికి చెందిన గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డుల వంటివి తప్పనిసరిగా పొందుపరచవలసి ఉంటుంది.

దుర్గగుడి ఈవో పై బదిలీ వేటు?

ఇన్‌చార్జ్ ఈవోగా రామచంద్రమోహన్ ◆ తాంత్రిక పూజలపై శాఖాపరమైన విచారణ ప్రారంభం

విజయవాడ(ఇంద్రకీలాద్రి), జనవరి 3: తాంత్రిక పూజల ఆరోపణల నేపథ్యంలో దుర్గగుడి ఈవో సూర్యకుమారిపై బదిలీ వేటు వేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం సింహాచలం దేవస్థానం ఈవోగా ఉన్న రామచంద్ర మోహన్‌ను దుర్గగుడికి ఇన్‌చార్జ్ ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరిగినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో దుర్గగుడి ఇవో ఎ సూర్యకుమారిని బదిలీ చేసినట్లు తెలిసింది. కాగా ఈరెండు అంశాలకు సంబంధించి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల కార్యాలయానికి ఎటువంటి ఉత్తర్వులు అందలేదు. మరోపక్క గుడిలో తాంత్రిక పూజలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై శాఖా పరమైన విచారణను దుర్గగుడి ఈఈ వేంకటేశ్వరరాజు బుధవారం ప్రారంభించారు. ఇందులోభాగంగా మధ్యాహ్నం నుంచే గత నెల 26న తేదీన సంఘటన జరిగిన సమయంలో దుర్గగుడి విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులను రప్పించి వారితో ఈసంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వేంకటేశ్వరరాజు సేకరించారు. ఈ సంఘటనలో అత్యంత కీలకమైన వ్యక్తి అయిన ఆలయ ప్రధాన అర్చకుడు కె బద్రీనాథ్‌బాబును సైతం రప్పించి విచారించారు. ఆ రోజు సంఘటన జరిగిన సమయంలో ఉన్న ఉద్యోగులు అందరినీ విచారించి ఒక నివేదిక తయారు చేసి వేంకటేశ్వరరాజు దుర్గగుడి ఈవో ఎ సూర్యకుమారి అందచేయనున్నారు. బుధవారం రాత్రి 8గంటల సమయానికి సుమారు 10 మంది ఉద్యోగులను విచారించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా గత నెల 26వ తేదీన విధి నిర్వహణలోఉన్న ఆలయ ఉద్యోగులకు కొంత మంది షోకాజ్ నోటీస్‌లు జారీ చేయగా క్యూలైన్ల ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా లభించిన కీలక సమాచారం.

ఈవో కోసమే తాంత్రిక పూజలు ?

దుర్గ గుడి ఈవోఎ సూర్యకుమారి తన సొంత ప్రతిష్ఠను పెంచుకోనేందుకే దుర్గగుడిలో తాంత్రిక పూజలను చేయించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. రోజు రోజుకు తగ్గిపోతున్న ప్రతిష్ఠను పెంచుకోనేందుకే ఈవో ఎ సూర్యకుమారి ఆలయ ప్రధాన అర్చకుడు బద్రీనాథ్‌బాబు పై ఒత్తిడి చేసిన కారణంగానే విధిలేని పరిస్థితుల్లో ఆలయ ప్రధాన అర్చకుడు ఈ తంతు చేసినట్లు దుర్గగుడిలో ఒక వర్గం తాజాగా ప్రచారం చేస్తోంది. గతంలో కూడా ఈవో అందరికి ఒక పూజ పేరు చెప్పి లోపల మరొక పూజ చేయించారన్న ఈవిషయాన్ని సైతం ఈ సందర్భంగా వీరు గుర్తు చేస్తున్నారు. తగ్గిపోతున్న ప్రతిష్ఠను పెంచుకోనేందుకు ఆమెకు ఒక వ్యక్తి సలహా ఇచ్చిన కారణంగానే ఆమె ఈ బాధ్యతను బద్రీనాథ్‌బాబుకు అప్పగించినట్లు విమర్శలు చోటు చేసుకున్నాయి. దుర్గగుడికి ఆమె సర్వాధికారిణి కావటం వల్లే ఉద్యోగులు కొన్ని పనులు చేయటం ఇష్టం లేకపోయినప్పటికీ ఆమె చెప్పిన విధంగా చేస్తున్నట్లు వినికిడి.

సీసీ టీవీ ఫుటేజ్ చూపించలేదు: గౌరంగబాబు

ఇంద్రకీలాద్రి: విజయవాడ దుర్గగుళ్లో తాంత్రిక పూజలు జరిగినట్లు ఆరోపణల నేపథ్యంలో తమకు సీసీ టీవీ ఫుటేజ్ చూపించలేదని దుర్గగుడి ట్రస్టు బోర్డు చైర్మన్ వై.గౌరంగ బాబు స్పష్టం చేశారు. గత నెల 28న జరిగిన బోర్డు సమావేశంలో సీసీ టీవీ ఫుటేజ్‌ను బోర్డు సభ్యులకు చూపించినట్లు ఈవో సూర్యకుమారి తెలిపిన నేపథ్యంలో చైర్మన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తాంత్రిక పూజలు, ఇతర వ్యవహారాలకు సంబంధించి దుర్గగుడి ఈవో ఎ సూర్యకుమారి తీరును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ట్రస్ట్ బోర్డు సమావేశంలో గత నెల 26వ తేదీన జరిగిన సంఘటనపై ముందుగా తానే వివరణ కోరగా ఆరోజు అంతరాలయం శుద్ధి మాత్రమే చేసినట్లు ఈవో వివరణ ఇచ్చారు తప్ప ఇప్పటి వరకు 26 రాత్రి జరిగిన సంఘటనకు సంబంధించిన ఎటువంటి సీసీ టీవీ ఫుటేజ్‌లను చూపించలేదని స్పష్టం చేశారు..

సీఎం దృష్టికి దుర్గగుడి వ్యవహారం

దుర్గగుడిలో తాంత్రిక పూజల వ్యవహారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు చేరింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావుతో సీఎం సమావేశమయ్యారు. విచారణకు ఉన్నత స్థాయి కమిటీని నియమించేందుకు, 48 గంటల్లో నివేదిక ఇచ్చేలా అధికారులను సీఎం ఆదేశించారు. దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరిగాయన్న ఆరోపణలు గత కొద్ది రోజులుగా వెల్లువెత్తుతుండటంతో సీఎం దీనిపై దృష్టి సారించారు. కడప జిల్లాలో జన్మభూమి పర్యటన ముగించుకుని బుధవారం విజయవాడకు చేరుకున్న సీఎం, మంత్రి మాణిక్యాలరావుతో సమావేశమయ్యారు. దుర్గగుడి వ్యవహారంపై చర్చించారు. దుర్గగుడిలో జరిగిన వ్యవహారాలపై విజయవాడ నగర సీపీ గౌతమ్ సవాంగ్ ప్రాథమిక నివేదికను అందచేశారు. ఎల్లుండి సాయంత్రంలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విచారణకు ఉన్నత స్థాయి కమిటీని నియమించారు. పోలీస్, దేవాదాయ శాఖ విచారణ వేర్వేరుగా జరిపేందుకు నిర్ణయించారు. ఆగమ శాస్త్రాలకు విరుద్ధంగా ఎలాంటి వ్యవహారాలు జరగడానికి వీల్లేదని సీఎం స్పష్టం చేశారు.

తప్పులు జరిగిన మాట వాస్తవమే: మంత్రి

దుర్గగుడిలో తప్పులు జరగడం వాస్తవమేనని మంత్రి మాణిక్యాలరావు అంగీకరించారు. సీఎంతో భేటీకి ముందుకు ఆయన మీడియతో మాట్లాడారు. 48 గంటల్లో నివేదిక వస్తుందని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. వీటి వెనుక ఏ స్థాయి వ్యక్తి ఉన్నా, ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ, పోలీస్ శాఖ కూడా నివేదికను 48 గంటల్లో వస్తుందన్నారు. తనకు తెలిసి, అమ్మవారి ఆలయంలో ఎలాంటి క్షుద్ర పూజ జరుగలేదన్నారు. అనుమతి లేని వ్యక్తులు ఆలయంలోకి రావడం మాత్రం అభ్యంతరకరమన్నారు. కేవలం తనకు సహాయంగా ఉంటాడని మాత్రమే ప్రధాన పూజారి బద్రీనాథ్ కొత్త వ్యక్తిని తీసుకువెళ్లాడన్నారు. రాష్ట్రపతి సతీమణి దేవాలయానికి వస్తున్న సందర్భంగా ఆలయాన్ని మరింత సుందరంగా అలంకరించేందుకు, ప్రధాన పూజారి ఆ సమయంలో ఆలయానికి వెళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. అయినప్పటికీ, అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారితో విచారణ జరుపనున్నట్లు వెల్లడించారు.

తాంత్రిక పూజలు జరిగితే తప్పే: సూర్యకుమారి



విజయవాడ (ఇంద్రకీలాద్రి) జనవరి 3: దుర్గగుడిలో గతనెల 26న రాత్రి సమయంలో కేవలం ఆలయ శుద్ధి మాత్రమే జరిగింది తప్ప ఎటువంటి ప్రత్యేక పూజలు జరగ లేదని దుర్గగుడి ఈవో ఎ సూర్యకుమారి స్పష్టం చేశారు. బుధవారం ఆమె విలేఖరులతో ఆమె మాట్లాడుతూ గత రెండు రోజులుగా మీడియాలో వస్తున్న విధంగా దుర్గగుడిలో తాంత్రిక పూజలు నిజంగా జరిగితే తప్పేనన్నారు. 28వ తేదీన జరిగిన దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు సమావేశంలో చైర్మన్‌తోపాటు ధర్మకర్తలకు అందరికి 26న సంఘటనకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించటంతోపాటు సీసీ టీవీ ఫుటేజ్‌లను సైతం చూపించగా దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు సభ్యులు కొందరు వారికి అవసరమైన ఫొటోలు సైతం తీసుకున్నట్లు ఈవో ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. ఈ వివాదానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని ఇప్పటికే దేవాదాయ శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, తదితరులకు దృష్టికి తీసుకువెళ్ళినట్లు చెప్పారు. తాంత్రిక పూజలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై దుర్గగుడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)తో విచారణ జరిపిస్తున్నట్లు ప్రకటించారు. తన బదిలీకి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు అందలేదని వివరణ ఇచ్చారు. దుర్గగుడిలో చేపట్టిన అన్ని అంశాలను దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు సభ్యుల దృష్టికి తీసుకువెళ్ళి వారి అనుమతితోనే కొన్ని పనులను చేపట్టినట్లు ఆమె స్పష్టం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు బద్రీనాథ్ బాబు, సహాయకునిగా వచ్చిన అర్చకుడి ఫొటో పత్రికలకు లీక్ చేసిన అంశంపై ఈవో మాట్లాడుతూ ఈఅంశంపై కూడ పూర్తి స్థాయిలో విచారణ ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. సాంకేతిక పరమైన కారణాల వలన మీడియాకు టీవీ ఫుటేజ్‌లను ఇవ్వటంలో జాప్యం జరిగింది తప్ప ఈవ్యవహారంలో ఎటువంటి దాపరికం లేదని, ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నట్లు ఆమె మరో సారి స్పష్టం చేశారు.




ఎంపీ వైఎస్ అవినాష్‌ను వారిస్తున్న సిఎం చంద్రబాబు

జన్మభూమిలో అవినాష్ కలకలం!

పులివెందుల సభలో వైఎస్‌పై పొగడ్తలు ఎంపీని వారించిన ముఖ్యమంత్రి బాబు

ఖాజీపేట(కడప), జనవరి 3: 'ఏయ్ వినవయ్యా.. ఇదేం మీ పార్టీ సభ కాదు ఇష్టమొచ్చినట్టు మాట్లాడేందుకు.. ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయం చేయద్దు' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప ఎంపీ అవినాష్‌రెడ్డిని వారించారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా బుధవారం కడప జిల్లా పులివెందులలో జరిగిన సభలో ప్రసంగించిన ఎంపీ అవినాష్‌రెడ్డి దివంగత నేత వైఎస్ ప్రస్తావన తేవడంతో జనం కేరింతలు కొట్టారు. కడప జిల్లాలోని ప్రాజెక్టుల పూర్తికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి రూ.1100 కోట్లు కేటాయించి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. దీంతో సభకు హాజరైన వైసీపీ నాయకులు, కార్యకర్తలు కేరింతలు, చప్పట్లతో జై కొట్టారు. ప్రధానంగా గండికోట జలాశయం, సీబీఆర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి నిధులు కేటాయించి 85 శాతం పనులు పూర్తిచేశారని ఎంపీ ప్రస్తావించగా పులివెందుల నాయకులు అడ్డుకున్నారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగచేసుకుంటూ ఇది రాజకీయసభ కాదు.. తమ్ముడూ మీ గొప్పలు చెప్పుకునేందుకు వేరే సభ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వపరమైన సమావేశంలో రాజకీయ గొప్పలు చెప్పుకోవడం మీకు ఆనవాయితీగా మారిందని, అలాంటి వాటిని సహించబోమని అన్నారు. తాను ముఖ్యమంత్రిగా వచ్చానని ప్రభుత్వపరమైన అంశాలనే ప్రస్తావించానని, ఎక్కడా రాజకీయ ప్రస్తావన చేయలేదన్నారు. ఓట్లు కావాలనే ప్రస్తావన చేయలేదన్నారు. ఇంతలోనే పక్కనే ఉన్న నాయకులు ఎంపీ చేతిలోని మైక్ లాక్కునే ప్రయత్నం చేయగా సీఎం కల్పించుకుని మైక్ తీసేసుకోవద్దని సూచించారు. సమస్యలు ఏవైనా ఉంటే లిఖిత పూర్వకంగాఇస్తే రాజకీయాలకు అతీతంగా పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఎంపీ సభ నుంచి వెళ్లిపోయారు.



తిరుమలలో శ్రీవారి ప్రణయకలహోత్సవంలో జీయ్యంగార్లు

వైభవంగా శ్రీవారి ప్రణయ కలహోత్సవం

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 3: తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ప్రణయ కలహోత్సవం వేడుకగా జరిగింది. ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి ఆరోరోజు, అధ్యనోత్సవంలో 17వ రోజు తిరుమలలో ప్రణయ కలహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4గంటలకు శ్రీ మలయప్ప స్వామివారు పల్లకి ఎక్కి ప్రదక్షిణ మార్గంలో స్వామి పుష్కరణి వద్దకు వచ్చారు. ఇంతలో అమ్మవార్లు చెరొక పల్లకిపై అప్రదక్షిణంగా స్వామివారికి ఎదరుగా వచ్చి నిలుచున్నారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరపున జియ్యంగారు పూలచెండ్లతో వేటకు వెళ్లి వచ్చిన స్వామివారిని మూడుసార్లు తాడించారు. స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడతారు. అనంతరం అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా చేరి కర్పూర హారతులు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత ఆస్థానం నిర్వహించారు. ఈ ఉత్సవంలో శ్రీ నమ్మాళ్వార్ రచించిన ఆళ్వార్ దివ్య ప్రబంధంలోని పాసురాలను నిందస్తుతి శైలిలో అర్చకులు పారాయణం చేయడం ప్రత్యేకత. ఈ సందర్భంగా ఆలయంలో వసంతోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది. ఈకార్యక్రమంలో పెద్దజీయర్, చిన్నజీయర్, టీటీడీ ఈ ఓ అనిల్‌కుమార్ సింఘాల్, ఆలయ డిప్యూటి ఈ ఓ కోదండరామారావు, పేష్కార్ రమేష్ బాబు పాల్గొన్నారు.

హైకోర్టుకెళ్తాం: స్వరూపానంద



పెందుర్తి జనవరి 3: రాష్ట్రంలో దేవాలయ వ్యవస్థను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి స్వలాభం కోసం ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని స్థానిక శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆరోపించారు. బుధవారం ఆయన ఇక్కడి విలేఖర్లతో మాట్లాడుతూ కొత్త రాజధాని అమరావతిలో అత్యంత ప్రాధాన్యత గల ఆలయం విజయవాడ కనకదుర్గ ఆలయమన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో జరిగిన తాంత్రిక పూజలపై ముఖ్యమంత్రి చంద్రాబుకు లేఖ పంపనున్నట్లు స్వామీజీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పీఠాధి పతుల సమావేశం నిర్వహించి ప్రభుత్వాల తీరుపై కోర్టులో కేసులు వేస్తామన్నారు. హిందూ దేవాలయాల మీద ఉన్న మక్కువ దేవుడి మీద లేదని, ఆయన దయ లేకపోతే మంచి జరగదని అభిప్రాయం వ్యక్తం చేశారు. విజయవాడ దుర్గ గుడిలో రెండేళ్ళుగా అనేక అపచారాలు జరుగుతున్నాయన్నారు. ఇది చాలా దురదృష్టకరమని, దేశానికి అరిష్టమన్నారు. భక్తులకు ప్రమాదం కలిగించే తాంత్రిక పూజలు జరగడం శోచనీయమన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిజనిర్ధారణకు ఎందుకు ఆదేశించలేదన్నారు. అక్కడి ఈవోపై ఎన్నో ఆరోపణలు వస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోలేన్నారు. ఈ పరిణామాలను పీఠాధి పతులు చూస్తూ ఊరుకోరన్నారు. దేవాలయాల ఆదాయం పక్కకు మళ్ళుతోందని, అనవసర ఖర్చులతో సొమ్ము దుర్వినియోగం అవుతోందని అన్నారు. అర్ధరాత్రి క్షుద్రపూజలు ఎంత వరకు సబబు అంటూనే అధికారుల హస్తం లేకుండా లోపలికి పూజారి ఎలా వెళ్తాడన్నారు. అర్చకుల్ని కస్టడీలోకి తీసుకోవటమే కాకుండా ఏ అధికారి హస్తం ఉందో నిగ్గుతేల్చాలన్నారు.

ఈశ్వరిని నిలదీసిన గిరిజనం

రోడ్డు కోసం ఎమ్మెల్యేపై వత్తిడి



గిరిజనులు, ఎమ్మెల్యే మధ్య వాగ్వివాదం జరుగుతున్న దృశ్యం

పాడేరు, జనవరి 3: రహదారి నిర్మించాలన్న డిమాండ్‌తో గిరిజనులు పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరీని బుధవారం అడ్డుకోగా పెద్దఎత్తున వాగ్వివాదం జరిగింది. చివరకు ఎమ్మెల్యే తన కారును అక్కడే విడిచిపెట్టి ఆటోలో జన్మభూమి నిర్వహించే ప్రాంతానికి వెళ్లారు. పాడేరు మండలం వనుగుపల్లిలో బుధవారం నిర్వహించే జన్మభూమి గ్రామ సభకు ఎమ్మెల్యే ఈశ్వరి వెళ్లాల్సి ఉంది. అయితే రహదారి సౌకర్యం లేని గిరిజనులు కాంగ్రెస్ ఆధ్వర్యంలో కంద మామిడి జంక్షన్ వద్ద ఎమ్మెల్యే ఈశ్వరి వాహనాన్ని అటకాయించి తమ గ్రామాలకు రహదారి నిర్మించాలని డిమాండ్ చేసారు. దీనిపై స్పందించిన ఈశ్వరి వనుగుపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాదించామని, ఆ ప్రతిపాదనల ప్రతులు చూపిస్తూ త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. అయినా శాంతించని ఆందోళనకారులు లిఖిత పూర్వకంగా రాసివ్వాలని పట్టుబట్టారు. దీంతో ఆగ్రహించిన ఈశ్వరి 15 రోజులలో రోడ్డు నిర్మాణం ఏలా అవుతుందని ప్రశ్నించారు. ఎంత నచ్చజెప్పినా వారు వినకపోవడంతో ఎమ్మెల్యే ఆటోలో జన్మభూమి గ్రామ సభకు వెళ్లిపోయారు. ఈశ్వరి విలేఖరులతో మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశ్యంతో అర్ధంపర్థం లేని డిమాండ్లు చేస్తున్నారని చెప్పారు.

పొగమంచు కారణంగా ల్యాండ్ కాని విమానం

రేణిగుంట, జనవరి 3: రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సిన విమానం పొగమంచు కారణంగా చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్ అయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రేణిగుంట విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల మేరకు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి రావాల్సిన స్పైస్‌జెట్ విమానం ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరింది. ఎప్పుడూ లేని విధంగా తిరుమలలో ఉన్న వాతావరణం రేణిగుంట విమానాశ్రయంలో పొగమంచు విపరీతంగా ఏర్పడింది. దీంతో రేణిగుంటలో దిగాల్సిన స్పైస్ జెట్ విమానం పొగమంచు కారణంతో రేణిగుంటకు చేరుకునే సమయంలో మంచుకారణంగా సిగ్నల్ ఇవ్వకపోవడంతో అటునుంచి అటే చెన్నై విమానాశ్రయంలో ల్యాండింగ్ అయింది.

చోరీ కోసం వచ్చి హత్య

మౌజన్ హత్య కేసులో నిందితుడు అరెస్టు

రాజమహేంద్రవరం, జనవరి 3: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాజమహేంద్రవరం బత్తిననగర్‌లోని నురానీ మసీదు మౌజన్ ఎండి ఫరూక్ హత్య కేసు మిస్టరీ వీడింది. అనంతపురం జిల్లా గుంతకల్లులోని శ్రీలంక కాలనీకి చెందిన ఆర్ముగం మణిరత్నం అలియాస్ మణి, అలియాస్ రాజు మౌజన్‌ను హత్య చేసినట్లు రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్పీ బి రాజకుమారి తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. మణిని అనంతపురం జిల్లా ఉరవకొండ బస్టాండ్‌లో అరెస్టుచేశామని ఎస్పీ తెలిపారు. మసీదులో చోరీకి ప్రయత్నించిన మణి తనకు అడ్డువస్తాడన్న ఉద్దేశంతో మౌజన్‌ను హత్యచేశాడన్నారు. సంఘటనా స్థలంలో లభించిన వేలిముద్రలు, సమీపంలోని మద్యం దుకాణంలో లభించిన సీసీ పుటేజీల ఆధారంగా మణిని నిందితుడిగా నిర్ధారించామన్నారు. చిల్లర కోసం కూడా మణి హత్యలకు పాల్పడే కిరాతకుడని చెప్పారు. గతంలో తన స్నేహితుడ్ని రూ.600 కోసం, మరో సహచరుడు రాంబాబును వాచీ, సెల్‌ఫోన్ల కోసం హత్య చేశాడని వివరించారు. గత నవంబర్ 22వ తేదీన విద్యుత్‌కాలనీలోని వినాయకుడి గుడిలో హుండీ పగులగొట్టి నగదును, గర్భగుడిలోని వెండి వస్తువులను చోరీ చేశాడన్నారు. వాటిని తీసుకునేందుకు గతనెల 28న రాజమహేంద్రవరం వచ్చిన మణి 29వ తేదీ రాత్రి సమీపంలోని మద్యం షాపులో మద్యం తాగి బత్తిన నగర్‌లో నడుచుకుంటూ వెళుతూ చోరీ కోసం నురానీ మసీదులోకి చొరబడ్డాడన్నారు. సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనంలోని సర్వేక్రను తీసుకుని, గోడ దూకి మసీదులోకి జొరబడ్డాడని, వరండాలో నిద్రిస్తున్న మౌజన్ తలపై క్రరతో కొట్టి, జేబులోని మసీదు తాళాలు తీసుకుని లోపలికి ప్రవేశించాడని ఎస్పీ తెలిపారు. హుండీ పగులగొట్టి డబ్బులు దొంగిలించాడన్నారు. ఆధారాలు లభించకూడదన్న ఉద్దేశంతో మసీదులోని తివాచీని తగులబెట్టాడన్నారు. బయటకు వచ్చిన మణి తీవ్రగాయంతో ఉన్న మౌజన్‌ను చూసి మరోసారి క్రరతో కొట్టి వెళ్లిపోయాడన్నారు. ఆ తరువాత తూర్పు రైల్వేస్టేషన్ వైపు వెళ్లి రక్తపుమరకలు ఉన్న దుస్తులు మార్చుకుని గుంతకల్లు వెళ్లిపోయాడన్నారు. ఈహత్య కేసును చేధించడానికి ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఎస్పీ వివరించారు. సీఐలు బాజీలాల్, కనకారావును బీహార్‌లోని మౌజన్ స్వస్థలానికి పంపామన్నారు. అలాగే రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఉత్తమ ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి, విశ్లేషించారన్నారు. గత నెల 30న పాతనేరస్తుడైన మణిని మౌజన్‌ను హత్య చేసినట్లు గుర్తించామన్నారు. తన సోదరుడు సెంథిల్‌కుమార్ అత్తారిల్లు రాజమహేంద్రవరంలోని బర్మాకాలనీ కావడంతో తరుచూ ఇక్కడి వచ్చేవాడన్నారు. ఈకేసును చేధించిన పోలీసు అధికారులు, సిబ్బందికి రివార్డులు ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు. విలేఖర్ల సమావేశంలో అడిషినల్ ఎస్పీలు ఎం రజనీకాంత్‌రెడ్డి, నయీం ఆస్మీ, తూర్పుమండలం డిఎస్పీ నాగరాజు పాల్గొన్నారు.

ఒకరి కోటలో మరొకరు!

పులివెందులలో చంద్రబాబు

చిత్తూరులో ప్రవేశించిన జగన్ పాదయాత్ర

పులివెందులకు చరిత్రలో తొలిసారి నీళ్లు

సభకు పోటెత్తిన జనం

జగన్‌కు మహిళల బ్రహ్మరథం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 3: రాష్ట్ర రాజకీయాల్లో ఉప్పు-నిప్పులా వ్యవహరిస్తున్న రెండు పార్టీల అధినేతలు ఒకరి జిల్లాలో మరొకరు అడుగుపెట్టిన తీరు రాష్ట్ర ప్రజలను ఆకట్టుకుంది. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైసీపీ అధినేత జగన్ సొంత పులివెందుల నియోజకవర్గంలో, చంద్రబాబు సొంత చిత్తూరు జిల్లాలో వైసీపీ అధ్యక్షుడు జగన్ పాదయాత్ర ఒకే రోజు జరగడం అటు మీడియా, ఇటు రాష్ట్ర ప్రజలను ఆకర్షించింది. జన్మభూమి కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లా పులివెందులలో జరిగిన గండికోట-చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ప్రజలకు అంకితం చేశారు. ఇది కడపతోపాటు అనంతపురం జిల్లాకూ ఉపయోగపడనుంది. ఐదు దశల్లో 8.3 టీఎంసీల నీటిని గండికోట రిజర్వాయరు నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు 1.400 క్యూసెక్కుల చొప్పున తీసుకువచ్చి వాటిని 45 రోజులపాటు నిల్వచేస్తారు.

నిజానికి ఈ కార్యక్రమాన్ని గతంలోనే భారీ ఎత్తున నిర్వహించి జగన్‌కు ఝలక్ ఇద్దామని టీడీపీ జిల్లా నేతలు భావించారు. ఆ మేరకు తేదీలు నిర్ణయించినప్పటికీ, కుదరలేదు. ఇప్పుడు జన్మభూమి వేదికగా పులివెందుల నియోజకవర్గంలో తమ్ముళ్లు భారీ బహిరంగసభ నిర్వహించి, తమ సత్తా చాటి, ముఖ్యమంత్రి మెప్పు పొందారు. ఇన్నేళ్ల కడప జిల్లా చరిత్రలో, ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గ చరిత్రలో తొలిసారిగా నీళ్లిచ్చిన ఘనతను సాధించిన టీడీపీ దానిని ఓ పండుగలా నిర్వహించి, వైసీపీ అధినేత జగన్‌కు సవాలు విసిరింది. నిజానికి ఈ ప్రాజెక్టు కోసం శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్ రెడ్డి చాలా కృషి చేశారు


. పులివెందులకు నీళ్లు వచ్చిన తర్వాతనే గడ్డం తీస్తానని శపథం చేసి, చివరకు బాబు కరుణించి నీళ్లివడంతో, సతీష్‌రెడ్డి తన గడ్డం తీసేసి శపథం నెరవేర్చుకున్నారు. వైఎస్ కుటుంబం దశాబ్దాల నుంచి పులివెందులను శాసిస్తూ కడప జిల్లా ఎంపీ, పులివెందుల ఎమ్మెల్యే పదవులను ఏకబిగిన అనుభవిస్తున్నా, ఇప్పటివరకూ సొంత పులివెందులకు నీళ్లు తీసుకురాలేకపోయారన్న అప్రపదను మూటకట్టుకున్నారు. తెలుగుదేశం పార్టీ దీనిని సద్వినియోగం చేసుకుని, కష్టసాధ్యమైనప్పటికీ పులివెందులకు నీరిచ్చి ఆ నియోజకవర్గ రైతాంగానికి చేరువయింది. బుధవారం జరిగిన బహిరంగసభ జనం పోటెత్తడం బట్టి, పులివెందుల ప్రజల్లో నీరిచ్చిన కృతజ్ఞత ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. తాను అనుకుంటే ఏదీ విడిచిపెట్టనని పులివెందుల సభలో చెప్పిన బాబు, పులివెందులకు నీళ్లు ఇస్తానన్న మాట నిలబెట్టుకున్నానని ప్రజలకు గుర్తు చేయడం ద్వారా తనపై విశ్వసనీయతను పెంచుకున్నారు.

దానితోపాటు పులివెందుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని, తాను వెళుతున్న అభివృద్ధి బాటలో పులివెందుల ప్రజలు కలసి నడవాలని పిలుపునివ్వడం ద్వారా, ప్రజలలో కొత్త ఆలోచనకు తెరలేపారు. తొలిసారి పులివెందులకు నీళ్లిచ్చిన బాబును స్వాగతిస్తూ, అక్కడ ఏర్పాటుచేసిన సభకు 30 వేల మందిని సమీకరించడం ద్వారా కడప జిల్లా నేతలు తమ కృతజ్ఞత ప్రకటించుకున్నారు. నిజానికి కడప జిల్లాకు ఇచ్చిన పదవులతో పోల్చితే తక్కువ సంఖ్య అయినప్పటికీ, పులివెందులలో టీడీపీ ఈ స్థాయిలో బలప్రదర్శన చేయడం ఇదే తొలిసారి. కాగా అటు వైసీపీ అధినేత జగన్ పాదయాత్ర చిత్తూరు జిల్లాలో అడుగు పెట్టింది. కలికిరిలో ఏర్పాటు చేసిన బహిరంగసభకు జనం పోటెత్తారు. ప్రధానంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రోజా ఆధ్వర్యాన చిత్తూరు జిల్లాకు వచ్చిన జగన్‌కు మహిళలు మంగళహారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్ తాను అధికారంలోకి వస్తే చిత్తూరు డైరీని పునరిద్ధరిస్తానని, లీటరుకు 4 రూపాయల ప్రోత్సాహకం అందిస్తానని, రైతుకు జీరో వడ్డీ రుణాలిస్తానని హామీ ఇచ్చారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తోన్న చిత్తూరు జిల్లాలో జగన్ పాదయాత్ర విజయవంతం చేయడాన్ని మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, భారీ స్థాయిలో జనసమీకరణ చేసి తమ అధినేతను మెప్పించారు.

'గజల్'పై కుట్ర

మంత్రి మాణిక్యాలరావు

ఆంధ్రభూమి బ్యూరో



విజయవాడ, జనవరి 3: గజల్ శ్రీనివాస్‌పై ఉద్దేశ్యపూర్వకంగా కుట్ర జరిగిందన్న అభిప్రాయాన్ని మంత్రి మాణిక్యాలరావు వ్యక్తం చేశారు. వెలగపూడి సచివాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆయనపై కావాలని కుట్ర చేశారని, పథకం ప్రకారం చేయకపోతే ఆ వీడియోలు ఏలా వస్తాయని ప్రశ్నించారు. ఆయన తనకు చిన్నప్పటి నుంచి తెలుసునని, ఆయన ఏ తప్పూ చేయలేదని అనుకుంటున్నానని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను చూస్తే, హిందుత్వంపై కుట్ర జరుగుతోందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
గురువారం, 4 జనవరి 2018

చైనా గాలిపటం..

పతంగ్‌లు - గాలిపటాలు - చైనా నుంచి దిగబడిపోతుండడం మరో చర్చా వైపరీత్యం! కొండనాలుకకు మందేయమంటే ఉన్న నాలుకను ఊడబెరికాడు - అన్నది సామెత! ఈ సామెత చైనాతో మన వాణిజ్య సంబంధాలకు చక్కగా అన్వయమౌతోంది. చైనా నుండి దిగుమతి అవుతున్న 'ప్లాస్టిక్' దారం - మాంజా - వల్ల జరుగుతున్న అనర్థాల గురించి గత నాలుగేళ్లుగా ప్రచారమైంది. ఈ 'మాంజా'ను వాడరాదన్న ప్రభుత్వపు ఉత్తరువులు అమలు జరగడం లేదన్నది బహిరంగ రహస్యం. 'దారం' వాడకాన్ని నిషేధించడం వల్ల సమస్య సమసిపోదు, దారం చైనానుండి దిగుమతి కాకుండా నిరోధించాలి - అన్నది జరిగిన ప్రచారం! కానీ 'దారం' పెద్ద సమస్య కాదని ఇప్పుడు తేలిపోయింది. ఎందుకంటె లక్షల సంఖ్యలో గాలిపటాలే చైనా నుంచి దిగుమతి అవుతున్నాయట! వీటి పోటీకి తట్టుకోవడం స్వదేశీయ ఉత్పత్తిదారులకు అసాధ్యమైపోయింది. అందువల్ల ఈ కుటీర పరిశ్రమలు ఒకటి తరువాత ఒకటిగా మూతపడిపోతున్నాయి. ఈ విపరిణామం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రప్రభుత్వానికి ఆందోళన కలిగించి ఉండాలి. కానీ ప్రభుత్వాలు ఆందోళకు గురి అవుతున్న జాడ లేదు! కేంద్రప్రభుత్వం 'భారత్‌లో నిర్మించండి' - మేక్ ఇన్ ఇండియా - అన్న స్వదేశీయ పారిశ్రామిక స్ఫూర్తిని మూడేళ్లుగా ప్రచారం చేస్తోంది. కానీ దేశవ్యాప్తంగా గాలిపటాల - పతంగ్‌ల -ను తయారు చేస్తున్న వేలాది కుటీర పరిశ్రమల వారు దివాలా తీస్తుండడం ఈ స్ఫూర్తికి పొంతన కుదరని కఠోర వాస్తవం. ప్రపంచీకరణ మాయాజాలంలో రెండు దశాబ్దులుగా తగుల్కొని ఉన్న ప్రభుత్వాలను విదేశీయుల 'పెట్టుబడి' బంగారు జింక వలె మురిపిస్తోంది. ఈ మైమరపునకు గురి అయి ఉన్న ప్రభుత్వాలు నిరంతరం విదేశాల నుంచి పెట్టుబడులను, బహుళ జాతీయ సంస్థలను మన దేశానికి తరలించుకొని రావడంలో తలమునకలై ఉన్నాయి. అందువల్ల పాలకులకు చిన్న పరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, కుటుంబ పరిశ్రమలు మూతపడుతున్న సంగతి పట్టడం లేదు. ఆహారశుద్ధి - ఫుడ్ ప్రాసెసింగ్ - పేరుతో 'బహుళ జాతీయ సంస్థల' కోసం ఏర్పడుతున్న వాణిజ్య ప్రాంగణాలు 'కేంద్రీకరణ'ను వ్యవస్థీకరిస్తున్నాయి. అప్పడాలు, వడియాలు, మసాలా దినుసులు, ఆవకాయలు, పళ్ల గుజ్జులు 'శుద్ధి పద్ధతి' ద్వారా తయారు చేసి పంపిణీ చేస్తున్న కుటుంబాలు దీనివల్ల ఉపాధిని కోల్పోయాయి, కోల్పోతున్నాయి. చిన్న ఉత్పత్తిదారులు అట్టడుగు వర్గాల వారు ఈ 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థల'తో పోటీ పడలేరు.. దీనికి తోడు చైనాలో తయారయి మన దేశాన్ని ముంచెత్తుతున్న అనవసరమైన వస్తువులు మన ఆర్థిక వ్యవస్థను కుదేలుమనిపిస్తున్నాయి! గాలిపటాలు, గాలిపటాలను ఎగురవేయడానికి అవసరమైన దారం తయారు చేస్తున్న లక్షలమంది చిన్న ఉత్పత్తిదారులు, శ్రామికులు ఉపాధికి దూరమైపోతుండడానికి చైనా వాణిజ్య దురాక్రమణ దోహదం చేస్తోంది. గాలిపటాల వైపరీత్యం ఒక ఉదాహరణ మాత్రమే! మనదేశంలో సంప్రదాయసిద్ధంగా తయారవుతున్న వందల వస్తువులకు పోటీగా చైనా వస్తువులు వెల్లువెత్తుతున్నాయి! వినాయక ప్రతిమలు, దీపావళి ప్రమిదలు కూడ చైనా నుంచి వచ్చేశాయి..

చైనా నుంచి వచ్చిన ప్లాస్టిక్ దారాన్ని గాలిపటాలను ఎగురవేయడానికి వాడడం వల్ల వాతావరణం కాలుష్యగ్రస్తమౌతోందన్న నిర్ధారణ జరిగి ఏళ్లయింది. ఈ దారాన్ని పట్టుకున్న చిన్నపిల్లల చేతులకు పుండ్లు ఏర్పడ్డాయి. ఈ దారం గొంతులకు తగిలి అనేకమందికి గాయాలయ్యాయి. ఆకాశంలో విహరిస్తున్న పక్షులు ఈ దారం తగిలి గాయపడి మరణించాయి! దేశంలో ఈ చైనీయ 'మాంజా'ను ఉపయోగించడం తాత్కాలికంగా నిలిపివేయాలని 'జాతీయ హరిత న్యాయమండలి' - నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ - ఎన్‌జిటి - 2016 డిసెంబర్‌లో ఆదేశించింది. గత ఏడాది జనవరిలో తెలంగాణ ప్రభుత్వం ఈ ప్లాస్టిక్ దారాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిషేధించింది. గత జూలైలో 'హరిత న్యాయ మండలి' తుది తీర్పు చెప్పింది, దేశవ్యాప్తంగా చైనా 'మాంజా'ను నిషేధించింది! ఈ నిషేధం తరువాత చైనా 'దారం' ధరలు మరింత పెరిగాయట! నిషిద్ధ వస్తువు కాబట్టి పోలీసులు, అధికారులు తమను పట్టుకునే ప్రమాదం ఉంది కాబట్టి వ్యాపారులు ఈ ప్రమాదానికి తెగించి 'ధైర్యంగా అమ్మాలి కాబట్టి ధరలు పెరిగిపోయాయట! కానీ కేంద్రప్రభుత్వం ఈ 'మాంజా' దిగుమతిని ఎందుకని ఆపించడం లేదు?? కేవలం వాడకాన్ని నిషేధించడంవల్ల చైనా దారం, యథావిధిగా వచ్చిపడుతున్నది..

పత్తితో, నూలుతో తయారవుతున్న దారం పర్యావరణ సంతులనాన్ని పరిరక్షిస్తోంది. కానీ నూలుదారం ధరలు ప్లాస్టిక్ దారం ధరలకంటె నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటున్నాయట! అందువల్ల 'తక్కువ ధరల' మాయాజాలంలో తగుల్కొన్న వినియోగదారులు ఈ చైనా దారాన్ని కొనేస్తున్నారు. దేశవ్యాప్తంగా తయారవుతున్న 'నూలు దారం' అమ్మకాలు తగ్గిపోయాయి. వందలాది కుటీర పరిశ్రమలు మూతపడినాయి. హైదరాబాద్‌లోనే ఇలా నూలు దారం తయారు చేస్తున్న దాదాపు యాబయి దుకాణాలు మూతపడుతున్నాయట! ఇప్పుడు ''పులిమీద పుట్ర''వలె లక్షలకొలదీ 'పతంగ్'లు చైనా నుండి వస్తున్నాయి. ఈ 'ప్లాస్టిక్' గాలి పటాల పోటీని మనదేశంలోని 'కాగితం' గాలిపటాలు తట్టుకోలేవన్నది జరిగిన నిర్ధారణ. అందువల్ల 'కాగితం' పతంగ్‌లను తయారు చేస్తున్న చిన్న యజమానులు, కార్మికులు దుకాణాలు మూసివేసి ఇతర ఉపాధులను వెతుక్కోవలసి వస్తోంది! 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తి ఏమయినట్టు?? హైదరాబాద్ ధూల్‌పేట తదితర ప్రాంతాలలో తరతరాలుగా కాగితం 'పతంగ్'లను తయారు చేస్తున్నవారు గత రెండేళ్లుగా ఉత్పత్తులను సగానికి సగం తగ్గించివేశారట! 'పతంగ్'లు ఈ వాణిజ్య వైపరీత్యానికి, చైనా వ్యూహాత్మక దురాక్రమణకు, ప్రపంచీకరణ విష ఫలితాలకు 'ప్రతీక' మాత్రమే. అసలు వైపరీత్యం చైనాతో మన వ్యాపారం.. 1962లో మన దేశాన్ని దురాక్రమించిన చైనా మనకు శత్రుదేశం! దురాక్రమించిన మన భూభాగాలను చైనా తిరిగి మనకు అప్పగించేవరకూ ఈ శత్రుదేశంతో మనకు స్నేహ సంబంధాలు అవసరం లేదన్నది 1988 వరకూ మన ప్రభుత్వ విధానం. అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ఈ విధానాన్ని భగ్నం చేశాడు! సరిహద్దు వివాదంతో నిమిత్తం లేకుండా చైనాతో మనం సకలవిధ సంబంధాలను పెంపొందించుకోవాలన్నది రాజీవ్‌గాంధీ ప్రభుత్వం మొదలుపెట్టిన 'పథ భగ్న దౌత్యం - పాత్‌బ్రేకింగ్ డిప్లమసీ-!!

ఈ పథభగ్న విధానం కారణంగా చైనా వస్తువులు మన దేశంలోకి చొరబడిపోయాయి. చైనా వస్తువులు అత్యధికంగా దిగుమతి అవుతున్న దేశం మనది. కానీ మన వస్తువులను అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశం మాత్రం చైనాకాదు. ఫలితంగా చైనాతో జరుగుతున్న వాణిజ్యంలో మనకు ప్రతి ఏటా భారీగా లోటు ఏర్పడుతోంది. 'లోటు' ఏర్పడటమంటే మన 'విదేశీయ వినిమయ ద్రవ్యం - ఫారిన్ ఎక్స్ఛేంజ్ కరెన్సీ - చైనాకు తరలిపోవడమన్నమాట! ఇలా ప్రతి ఏటా సగటున రెండున్నర లక్షల కోట్ల రూపాయలు భారతీయుల శ్రమార్జిత 'విదేశీయ ద్రవ్యం' చైనాకు తరలిపోతోంది. ప్రభుత్వం ఆలోచించాలి... జనం యోచించాలి! చైనా వస్తువులు కొంటారా??

మతశకం.. సర్వమత సమభావం!

విశ్లేషణ

క్రీస్తుశకాన్ని 'సాధారణ' శకమని, 'సామాన్యశక'మని, 'వ్యవహార' శకమని భావించాలన్న ప్రచారం జరుగుతోంది! ఈ ప్రచారం చారిత్రక 'అనభిజ్ఞత'కు నిదర్శనం. ఈ 'తెలియనితనం' - అనభిజ్ఞత- మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా పరిఢవిల్లుతోంది! మొత్తం ప్రపంచానికి మాత్రమేకాక విశ్వ వ్యవస్థకు వర్తించే 'కాలగణన' మాత్రమే 'సాధారణ'- జనరల్ - లేదా 'సామాన్య'- కామన్- కాలగణ కాగలదు! రెండువేల సంవత్సరాల క్రితం పుట్టిన 'క్రైస్తవశకం' ప్రకారం 'కాలగణన' ఆరంభం కావడానికి ముందు కోట్ల ఏళ్లుగా 'విశ్వవ్యవస్థ' ఉంది, భూమి ఉంది, ప్రజలున్నారు! మరి క్రీస్తుశకం పుట్టకపూర్వం కాలాన్ని ఎలా లెక్కించారు?? క్రీస్తుశకం ఒక మతానికి చెందిన మహాపురుషుని జన్మతోను జీవితంతోను ముడివడిన మతశకం.. ఆ మతం వారు పాటించాలి! కాని మిగిలిన మతాలు కూడా ఎందుకు పాటించాలి?? ఒక మతానికి చెందిన 'కాలగణన' సంప్రదాయం లేదా 'శకం' ఇతర మతాలవారికి 'సామాన్యం' కాని 'సాధారణం'కాని జీవన 'వ్యవహారం' కాని ఎలా కాగలదు?? **బ్రిటన్ దురాక్రమణదారులు మన దేశానికి రాకపూర్వం నుంచి మన దేశంలో మొత్తం 'విశ్వవ్యవస్థ'కు వర్తించే 'కాలగణన' అమలులో ఉంది! ఇది ఏదో ఒక మతానికి చెందిన 'శకం' కాదు, మత ప్రవక్తల పేరుతో మొదలైన 'శకం' కాదు. అన్ని మతాలకు వర్తించే సర్వమత సమభావ శకం ఇది!** ఇలా అన్ని మతాలకు వర్తించగల, విశ్వవ్యవస్థలో సహజంగా నిహితమై ఉన్న 'కాలగణన' సాధారణ శకం రావడం న్యాయం, సామాన్య శకం కావడం తర్కం, వ్యవహార శకం కావడం జీవన వాస్తవం! దీని పేరు 'యుగం'! నాలుగు యుగాలుగా విశ్వం వ్యవస్థీకృతమై ఉంది. దీన్ని భారతీయులు తయారు చేయలేదు, విశ్వవ్యవస్థ ఇలా ఉందని గ్రహించారు!

ప్రస్తుతం అంటే ఈ 'హేమలంబి'- చంద్రమాన సంవత్సరం. కలియుగంలోని ఐదువేల నూట పంతొమ్మిదవది. మరి కలియుగం పుట్టక పూర్వం కాలాన్ని ఏ ప్రాతిపదికగా లెక్కపెట్టేవారు?? 'ద్వాపర యుగం' ప్రాతిపదికగా లెక్కపెట్టేవారు. 'ద్వాపరం' పుట్టక పూర్వం 'త్రేతాయుగం' ప్రాతిపదికగాను, 'త్రేత'కు ముందు 'కృతయుగం' ప్రాతిపదికగాను కాలగణన జరిగింది! ఆ కృతయుగానికి పూర్వం కలియుగం ఉండేది.. వసంత ఋతువునకు పూర్వం శిశిర ఋతువు, పగటికి పూర్వం రాత్రి ఉన్నట్టు! అందువల్ల 'నాలుగు యుగాలు' నిరంతరం పునరావృత్తం అవుతుండడం చరిత్ర.. నాలుగు యుగాలు కలసి 'మహాయుగం', డెబ్బై ఒకటి లేదా డెబ్బై రెండు మహాయుగాలు కలసి ఒక మన్వంతరం. పదునాలుగు మన్వంతరాలు కలిసి ఒక 'కల్పం' ఏర్పడుతున్నాయి. ఒక ఉదయ 'కల్పం' పూర్తి అయ్యేసరికి 432 కోట్ల సంవత్సరాలు గడుస్తున్నాయి. అప్పుడు 'ఉదయ కల్పం' లయమైపోయి, క్షయకల్పం మొదలు అవుతోంది! ఈ క్షయకల్పంలో 'శూన్యం' ఏర్పడి ఉంటుంది! **ఉదయ కల్పం లేదా సృష్టికల్పం విశ్వవ్యవస్థకు పగలు, సృష్టి కనిపిస్తోంది. క్షయకల్పం లేదా ప్రలయకల్పం విశ్వవ్యవస్థలో రాత్రి వంటిది!** ఈ రాత్రి - క్షయకల్పం- కూడా 432 కోట్ల సంవత్సరాలు కొనసాగుతోంది! రాత్రి పగలు 'ప్రలయ' కల్పం, 'ఉదయ' కల్పం నిరంతరం 'పునరావృత్తం' అవుతున్నాయి. అందువల్లనే విశ్వవ్యవస్థకు తుది, మొదలు లేవు. విశ్వవ్యవస్థ నిరంతర పునరావృత్తి మాత్రమే! అందువల్ల 'కలియుగ' కాలగణన సర్వమత సమ్మతమైంది! ఇదీ సాధారణ శకం, సామాన్య శకం.. వ్యవహారశకం!

మన దేశాన్ని దురాక్రమించిన డేరియస్ సైరస్ అన్న 'శక'రాజు కలియుగం 2552వ సంవత్సరంలో తన పేరుతో 'సైరస్' శకాన్ని ప్రారంభించాడు. ఈ సైరస్ శకం దాదాపు ఐదు వందల ఏళ్ల పాటు మన నెత్తికెక్కింది. ఈ విదేశీయ 'శకాన్ని' భావదాస్యాన్ని తొలగించడం కోసం సమ్రాట్ విక్రముడు కలియుగం 3044వ సంవత్సరంలో 'సంవత్' అన్న కొత్త 'కాలగణన' పద్ధతిని ఆరంభించాడు! బ్రిటన్ దురాక్రమణదారులు ఈ విక్రమ 'సంవత్'ను మరో జాతీయ వ్యవహార శకమైన 'శాలివాహన శకాన్ని' తొలగించారు. పరిపాలనకు తమ మత శకమైన క్రీస్తు శకాన్ని ప్రవేశపెట్టారు! ఇది 'సర్వమత' శకం కాదు..

అందువల్ల క్రీస్తుశకాన్ని 'క్రీస్తుశకం' అని పిలవడం న్యాయం! మన దేశంలోను అనేక ఇతర దేశాలలోను ఇది 'ఆంగ్ల'కాలమానంగా రూఢ్యమై ఉంది. ఇందుకు కారణం ఆంగ్ల భాషను మాట్లాడిన 'ఇంగ్లాండు' వారు వివిధ దేశాలను శతాబ్దుల పాటు దురాక్రమించడం! ఇలా దురాక్రమించడం మొదలైన సమయానికి 'ఇంగ్లండు'లో మాత్రమేకాక మొత్తం ఐరోపాలో 'క్రైస్తవశకం' వ్యాపించి ఉంది. అందువల్ల ఇంగ్లాండు ప్రజలు క్రైస్తవులయ్యారు! ఇంగ్లాండు వేల్స్, స్కాట్‌లాండ్ దేశాలు పరస్పరం కలహించాయి! ఆ తరువాత బలవంతంగా కొన్నాళ్లు, స్వచ్ఛందంగా కొన్నాళ్లు కలిసిపోయాయి. ఇలా కలిసిన మూడు దేశాలు 'బ్రిటన్'గా మారాయి. ఈ 'బ్రిటన్'తో 'ఐర్లాండు'లోని ఉత్తర ప్రాంతం విలీనమైంది. ఈ 'విలీనం' తరువాత బ్రిటన్- ఐక్యరాజ్యం- యునైటెడ్ కింగ్‌డమ్- యు.కెగా మారింది! కానీ మన దేశాన్ని దురాక్రమించిన సమయంలో 'ఇవన్నీ' కలిసిన ఇప్పటి దేశం ఇంగ్లాండుగానే ప్రసిద్ధి! 'ఇంగ్లాండు' తాను దురాక్రమించిన దేశాలన్నింటిలోను

> ***మానవ జీవన ప్రస్థానక్రమానికి ప్రాతిపదిక కాలాన్ని లెక్కపెట్టడం! ఇది సృష్టి నిహితమైన వాస్తవం! మన దేశంలో అనాదిగా కాలాన్ని లెక్కపెట్టడం సర్వ సమగ్రంగా వ్యవస్థీకృతమై ఉంది! 'ఉదయాత్ ఉదయాత్ వారమ్'- ఒక సూర్యోదయం నుంచి మరో సూర్యోదయం వరకు దినము- అన్నది భారత జాతీయులు అనాదిగా పాటించిన ప్రాతిపదిక!***

ఆయా దేశాల సంప్రదాయాలను, భాషలను, మతాలను, వేషభాషలను, సంస్కృతిని ధ్వంసం చేసింది. తన భాషను, సంప్రదాయాలను, మతాన్ని, వేషభాషలను 'నాగరికత'ను ఆయా దేశాల ప్రజలపై రుద్దింది! అమెరికాలోను, ఆఫ్రికాలోను 'ఇంగ్లాండు' మాత్రమే కాక ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్ వంటి ఇతర ఐరోపా దేశాలు కూడా ఈ పనిచేశాయి! ఫలితంగా ఆయా దేశాల పూర్వపు మతాలు ధ్వంసమైపోయి 'క్రైస్తవమతం' వ్యాపించింది! క్రైస్తవ మతంతోపాటు క్రైస్తవ మత'శకం' కూడా ఈ దేశాలకు విస్తరించింది. ఈ 'వ్యాప్తి' ఈ 'విస్తరణ' ఐరోపావారు తమ రాజకీయ బీభత్సకాండ ద్వారా బలవంతంగా జరిపించారు! ఆ దేశాలవారు స్వచ్ఛందంగా స్వీకరించలేదు. మతంలోని 'మంచి'ని ఇతర మతాలవారు స్వచ్ఛందంగా పాటించడం సర్వమత సమభావ లక్షణం! ఈ సర్వమత సమభావం అనాదిగా భారతీయుల స్వభావం! ''ఆనో భద్రాః క్రతవోయన్తు విశ్వతః''- ''విశ్వంలోని అన్ని మంగళకర భావాలు వచ్చుగాక''- అన్నది భారత జాతీయతత్త్వం! కానీ క్రైస్తవ శకాన్ని విదేశీయులు, బ్రిటన్‌వారు, స్వజాతీయులపై బలవంతంగా రుద్దిపోయారు! ఇలా రుద్దుడుకు గురైనవారు క్రీస్తుశకాన్ని వ్యవహార శకం గాని, సామాన్య శకంగాని అంగీకరించజాలరు! అందువల్లనే అరవై ఏళ్లకు పూర్వం, బ్రిటన్ విముక్త భారత దేశం 'శాలివాహన శకాన్ని' జాతీయ శకంగా ప్రకటించుకొంది. 1938 ఏళ్ల క్రితం సమ్రాట్ శాలివాహనుడు- విక్రముని మనుమడు- శాలివాహన శకాన్ని ఆరంభించాడు. ప్రస్తుతం 1939వ సంవత్సరం!!

మానవ జీవన ప్రస్థానక్రమానికి ప్రాతిపదిక కాలాన్ని లెక్కపెట్టడం! ఇది సృష్టి నిహితమైన వాస్తవం! మన దేశంలో అనాదిగా కాలాన్ని లెక్కపెట్టడం సర్వ సమగ్రంగా వ్యవస్థీకృతమై ఉంది! 'ఉదయాత్ ఉదయాత్ వారమ్'- ఒక సూర్యోదయం నుంచి మరో సూర్యోదయం వరకు దినము- అన్నది భారత జాతీయులు అనాదిగా పాటించిన ప్రాతిపదిక! వెలుగుతో ప్రారంభమైన దినం చీకటి అంతమై మళ్లీ సూర్యుడు కన్పించడంతో ముగుస్తోంది! వెలుగునుంచి వెలుగు వరకు- అన్నది విశ్వవ్యవస్థలో నిబిడీకృతమై ఉన్న సత్యం! భూమి తన చుట్టు తాను తిరగడం ఒక ఉదాహరణ మాత్రమే! వెలుగునుంచి బయలుదేరిన భ్రమణం మళ్లీ వెలుగును చేరి ఒక 'ఆవృత్తి'ని పూర్తిచేస్తోంది! నిరంతరం ఇది పునరావృత్తి! అందువల్ల భూగోళంలోని ప్రతి బిందువువద్ద సూర్యుడు కన్పించినపుడు కొత్తదినం ఆరంభమైందన్నది మానవ జీవన సత్యం. ఇది ప్రత్యక్ష ప్రమాణం. తొలి మానవుడు, తొలి మానవీయ సంస్కారం పుట్టిన భారతదేశంలో ఇది - ఈ కాలగణన పద్ధతి ఆరంభమైంది! ప్రపంచమంతటా వ్యాపించింది! కానీ యుగాలు, తరాలు, సహస్రాబ్దులు, శతాబ్దులు జరిగిన తరువాత ప్రస్తుత భారతదేశం వెలుపల ఉన్న ప్రాంతంలోని మానవులు భారతీయతకు క్రమంగా దూరం కావడం చరిత్ర. ఇలా దూరమైనవారు 'భారతీయత'కు దూరమయ్యారు, భూమి తల్లిగా, ఆకాశం తండ్రిగా, మానవులు, జీవజాలం బిడ్డలుగా రూపొందిన 'జాతీయత'కు దూరమయ్యారు! మానవీయ సంస్కృతికి దూరమైపోయి, పశువులవలె జీవించారు. చారిత్రక పునరావృత్తిలో భాగంగా మరోసారి భారతీయ సంస్కార స్పర్శతో ఆ ప్రాంతాలవారు మళ్లీ మానవులయ్యారు! మళ్లీ మానవులైన పాశ్చాత్య దేశాలవారు తమకు తెలిసింది సర్వస్వమని, తమకు తెలియడం ఆరంభమైనప్పటినుంచి మాత్రమే మానవ చరిత్ర మొదలైందని 'భావించారు', భ్రమించారు... బావిలోని కప్పలు! కానీ కలియుగంలో దాదాపు రెండువేల సంవత్సరాలు గడిచేవరకు ఈ పాశ్చాత్య దేశాలవారికి వ్యవస్థీకృత జీవనం లేదు.. అందువల్ల జాతీయ, సంస్కృతి వంటివి వారికి తెలియదు. కలియుగం ఇరవై ఆరవ శతాబ్ది తరువాత అంటే క్రీస్తుశకం పూర్వం ఆరవ శతాబ్ది నుండి ఈ పాశ్చాత్య 'జన సముదాయాలు' తమ జీవన వ్యవస్థలకు 'నాగరికత'లు అని పేరు పెట్టుకున్నారు! 'సహిష్ణుత' అన్నది ఈ 'నాగరికత'కు తెలియని అంశం! అందువల్ల గ్రీకు 'నాగరికత' ఐరోపాలో ప్రబలిన సమయంలో ఈ 'గ్రీకు నాగరికత' తన పరిధికి సమీపంలోని సరిహద్దులలోని భూభాగాలపై పరిఢవిల్లిన హిబ్రూ 'నాగరికత'ను ధ్వంసం చేయ యత్నించింది. ఆ తరువాత 'రోము' నాగరికత గ్రీసు నాగరికతను ధ్వంసం చేసింది, వ్యాపించి దురాక్రమించి 'హిబ్రూ' ముందు నాగరికతను ధ్వంసం చేసింది! ఆ తరువాత విలసిల్లిన 'క్రైస్తవం' రోము 'నాగరికత'ను ధ్వంసం చేసింది! 'క్రైస్తవం', 'ఇస్లాం' తలపడినచోటల్లా ఏదో 'ఒకటి' మాత్రమే మిగలడం, రెండవది ధ్వంసం కావడం చరిత్ర! మతం మాత్రమే పరమావధి అయింది! ఏకమత వ్యవస్థలున్న దేశాలు ఏర్పడినాయి.

జూలియన్ కాలండర్‌ను ఆరంభించిన జూలియస్ సీజర్ కాని గ్రెగేరియన్ కాలండర్‌ను ఆరంభించిన పదమూడవ గ్రెగరీ కాని ఇలాంటి 'వివిధత్వాన్ని సహించలేని' అన్యత్వ విధ్వంసక ఏకమత 'నాగరికత'కు వారసులు! జూలియన్ కాలండర్ కాని గ్రెగెరియన్ కాలండర్‌కు కాని శాస్త్రీయ ప్రాతిపదిక లేదు. జూలియన్ కాలెండర్ క్రీస్తుశకానికి మొదటి అనుసంధానం. కాని పదిహేను వందల ఏళ్లలో ఈ 'జూలియన్' కాలగణంలో 'పదకొండు రోజుల' లెక్క తప్పింది. ఖగోళ వాస్తవాలను సరిగా గ్రహించలేకపోవడం ఇందుకు కారణం! పది రోజులు మాత్రమే తగ్గాయని భావించిన 'పదమూడవ గ్రెగరీ' క్రీస్తుశకం 1582 అక్టోబర్ ఐదవ తేదీని 1582 అక్టోబర్ పదిహేదవ తేదీగా గుర్తించాలని నిర్ధారించాడు. ఈ నిర్ధారణ ప్రాతిపదికగా 'గ్రెగేరియన్' కాలండర్ ఆరంభమైంది. దీనిలో కూడా బోలెడన్ని తప్పులు వచ్చాయి! ఈ 'తప్పుల తడక'ను ఒప్పుల కుప్పగా భావిస్తున్నవారు, నూట తొంభై ఐదు కోట్ల యాభై ఎనిమిది లక్షల ఎనభై అయిదువేల నూట పంతొమ్మిది ఏళ్లుగా నిర్దిష్టంగా అమలు జరుగుతున్న భారతీయ పంచాంగాన్ని వెక్కిరిస్తున్నారు! ఇదీ వైచిత్రి..

మన దేశంలో సౌరమానం, చాంద్రమానం, నక్షత్రమానం, బృహస్పతి మానం వంటి కాలగణన పద్ధతులున్నాయి! ఇవి పరస్పరం ధ్వంసం చేసుకోలేదు, వీటి మధ్య సమన్వయం ఏర్పడి ఉంది! సమన్వయ కాలగణన భారత జాతీయ జీవన వాస్తవం..

-హెబ్బార్ నాగేశ్వరరావు
9951038352

రంగులనుబట్టి చూడకండి

ప్రపంచీకరణ సాంకేతిక విప్లవంతో వచ్చిన మార్పులవల్ల తరగతి గదిలో ఒకే రంగున్న పిల్లలు కనబడరు. ఒకే రకమైన ముఖవర్చస్సున్న పిల్లలు కనపడరు. వాటితోనే ఆ పిల్లలపైన మన అభిప్రాయాలను పెంచుకుంటున్నారు. ముక్కు లొందకు పోతే అస్సామీ, నేపాలీ అనుకుంటారు. లేదా చైనీయుడు అనుకుంటాం. మనిషి రంగు చామనఛాయగా ఉంటే మధ్యప్రాచ్యం (ఆస్ట్రేలియా, ఈజిప్టు) వారని, తెల్లగా ఉంటే ఐరోపా వారని అనుకుంటాం. రంగుతో కొంతమందిని, ఆకారంలో కొంతమందిని అంచనావేస్తారు. అదేవిధంగా మానవ సంబంధాలపై అది ప్రభావితం చూపించే కాలం వచ్చింది. మనిషి రంగైనా, స్వరూపమైనా ఆ వ్యక్తి డిఎన్ఎ పైననే ఆధారపడి ఉంటుంది. మనిషి జీవకణాలే ఆ వ్యక్తి క్యారెక్టరును కూడా విశ్లేషణ చేస్తున్నాయి. చివరకు మన పూర్వీకులు వానర జాతివారని అంటారు. మన డీఎన్ఏ వానరాలకు దగ్గరగా ఉందని శాస్త్రవేత్తల అభిప్రాయం. అదేవిధంగా మన పొడవు, మన ఎత్తుకూడా వారి డిఎన్ఏపైననే ఆధారపడి ఉంటుంది. తరగతి గదిలో ఆడ, మగ పిల్లలు ఉంటారు. ఆడపిల్లల ఎత్తు తక్కువగా ఉంటుంది. దానికి కారణం ఒకనాటు పురుషుడు సాహసంతో పుష్ఠికరమైన ఆహారాన్ని సంపాదించుకున్నాడు. ఆడవారికి పుట్టుకతో పలం లేకపోవడం వలన దొరికిన ఆకులు, ఫలాలు తిని బతికారు. మగపిల్లల జీన్స్ ఆడపిల్లల జన్యువుల మార్పువలన వారి ఎత్తుపై ప్రభావం చూపిస్తుంది. అదేకాకుండా వాతావరణం కూడా ప్రభావం చూపుతుంది. 11వ శతాబ్దం పురుషుని ఎత్తు 173 సెంటీమీటరుల, అదే 19వ శతాబ్దం వచ్చేసరికి 167 సెంటీమీటర్లయ్యింది. కాలక్రమేణ ఆడమగ మనుషుల ఎత్తుల్లో 12 సెంటీమీటర్ల తేడా వచ్చింది. నాగరికతలో పురుష ఆధిపత్యంవల్ల తనకన్నా తక్కువ ఎత్తులో ఉన్న ఆడపిల్లలను సహచరిగా స్వీకరించాడు. జీన్స్‌లో తేడా ఉంది కాబట్టి అది ఎత్తులో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అంతమాత్రాన ఆడవారి ఎత్తు పెరగదని కాదు. వ్యాయామంతో ఒకటి రెండు సెంటీమీటరుల పెరగవచ్చును. తరగతి గదిలో కనపడే రంగైనా, ఎత్తైనా అది జీన్స్‌వల్ల జరిగిందే, దాన్ని ఆధారం చేసుకు విద్యార్థులపై ఒక అభిప్రాయానికి రావడం సరైంది కాదు. దేహాలపై విద్యార్థుల నియంత్రణ ఉండదు. తల్లి గర్భకోశంలో కూడా తేడా ఉంటుంది. అక్కడే జన్యువుల రూపాలు నిర్ణయమౌతాయి. ఉపాధ్యాయుడు శాస్త్రీయమైన అవగాహనతో విద్యార్థులను చూడాలి. తరగతి గదిలో రంగుతో, ఆకారంతో వారి గురించి నిర్ణయం తీసుకోకూడదు. ఈనాడు మారుతున్న పరిస్థితులలో రంగు వైషమ్యాలకు కారణమవుతుంది. రంగువలల వ్యక్తులను శత్రువులుగా చూడకూడదు. చామనఛాయ ఉన్న ప్రతివాడూ టెర్రరిస్టుకాదు. ఈ నేపథ్యాన్ని తరగతి గదిలో చూపించగలిగితే సమాజంలో వైషమ్యాలను నివారించవచ్చును. ఉద్యమానికి శాస్త్రీయ దృక్పథం అవసరం.

సూర్యుడే ఆలోచనలకు మూలం

సూర్యుడు ఒక జ్ఞాన దీపిక. సూర్యుడు స్వతహాగా ఒక్క వెలుగునే ప్రసాదించడు. హైడ్రోజన్, హీలియం ఈ రెండు వాయువులు సూర్యుడి నుంచి వస్తాయి. సూర్యుడు స్వయం ప్రకాశం ప్రసాదిస్తాడు. అందుకే పిల్లలను, ముసలివాండ్లను ప్రతిరోజు ఎండలో అరగంట కూర్చోమని చెబుతారు. అది విటమిన్ 'డి'కి కారణభూతమైంది. ప్రతిక్షణం 700 మిలియన్ టన్నుల హైట్రోజన్‌ను హీలియంగా మార్చుతుంది. అదే అణుశక్తికి కారణం. 4 హైడ్రోజన్ ఆటమ్స్ ఒక హీలియంగా మారుతుంది. కానీ బరువు మాత్రం 4 హైట్రోజన్ అణువులకన్నా తక్కువే. దీనినే ఐనిస్టీన్ శక్తిసూత్రంగా చెప్పాడు. సూర్యుడు జ్ఞాన నిధి. మనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. అది పరిశోధనకు కేంద్రం. అందుకే తరగతి గదికి సూర్యునికి సంబంధం ఉంది. అది కారుకు, పెట్రోలుకు ఉన్న సంబంధంలాంటిది.

-డా.చుక్కా రామయ్య

చరిత్రను వక్రీకరించింది ఎవరు?

ప్రతి సంవత్సరం జరిగినట్టే ఈసారి కలకత్తాలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెసు సమావేశాలు నిర్వహించారు, 2018 జనవరి 1వ తేదీనాడు జరిగిన ప్రారంభోపన్యాసంలో సంస్థ ప్రధాన అధ్యక్షుడు కె.ఎం.పరిమలీ మాట్లాడుతూ ''చరిత్రను వక్రీకరించడం తప్పు' అని అభిప్రాయపడ్డారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ హిస్టరీ ప్రొఫెసర్‌గా పనిచేసిన కెఎం పరిమలీ తన ప్రసంగంలో కొన్ని తీవ్రమైన ఆరోపణలు చేశారు. 1.ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతం ప్రాతిపదకపై దేశాన్ని విభజించాలని ప్రయత్నిస్తున్నది. 2.హిందుత్వ ఎజెండాతో పనిచేస్తున్నది. 3.మైనారిటీలను ద్వితీయశ్రేణి పౌరులుగా చూస్తున్నది 4.చరిత్రను వక్రీకరించి తిరిగి వ్రాయాలని ప్రయత్నిస్తున్నది. 5.కల్పిత (ఫిక్షన్) కథనాలను ప్రచారం చేస్తున్నది. 6.సంఘ పరివార్ ఆటలు సాగనీయవద్దు- ఈ విధంగా భావోద్వేగంగా కెఎం పరిమలీ ప్రసంగం కొనసాగింది.

ఇంతకూ ఏది చరిత్ర? ఏది వక్రీకరణ అనే అంశం పరిశీలించబోయేముందు ప్రపంచవ్యాప్తంగా కొన్ని చారిత్రకాంశాలు గమనించాలి. ప్రాచీన రష్యాలో 1917లో విప్లవం వచ్చింది. అప్పుడు స్టాలిన్ లెనిన్‌లు చరిత్రను నిర్మూలించారు. 1945లో రష్యామీద హిట్లర్ దారి చేశాడు. అప్పుడు ''మన సోషలిస్టు సామ్రాజ్యాన్ని రక్షించుకుందాం' అని స్టాలిన్ పిలుపునిచ్చాడు. ఐతే ప్రజలు స్పందించలేదు. అప్పుడు మన పూర్వజుల పుణ్యభూమిని రక్షించుకుందాం' అని మరో పిలుపునిచ్చాడు. దీనికి ప్రజలు స్పందించి యుద్ధంలో పాల్గొన్నారు. ఇది చరిత్ర. దీనిని ఎవరూ మార్చలేరు.

ఇస్లామిక్ ఉగ్రవాదులు మార్క్సిస్టు ఉగ్రవాదులు ఒక దేశం మీద దాడి చేసినప్పుడు ముందుగా తాము ఆక్రమించుకున్న దేశపు చరిత్రను సంస్కృతిని ధ్వంసం చేస్తారు. కాన్‌స్టాంటినోపుల్‌పై అరబ్బుల దండయాత్రకు ముందు అక్కడ ''వైజయంతి సంస్కృతి'' ఉండేది. దానిని ధ్వంసం చేశారు. టిమో జనచైనాను మధ్యయుగాలలో ఆక్రమించుకోగానే అక్కడి బౌద్ధ సంస్కృతిని నిర్మూలించాడు. ఇతడు మంగోలు జాతీయుడు. తర్వాతి కాలంలో ఈయనకు ఛెంగిస్‌ఖాన్ అని పిలిచారు. 1521 సెప్టెంబరులో మెక్సికోను క్రూసేడరు ఆక్రమించకముందు అక్కడ హిందూ దేవాలయాలుండేవి. వాటిని స్పానిష్ క్రిస్టియన్లు ధ్వంసం చేశారు. అమెరికాలోని స్థానిక రెడ్ ఇండియన్ల సంస్కతిని బ్రిటన్ నుంచి వచ్చిన క్రైస్తవులు నాశనం చేశారు. మహమ్మద్ ప్రవక్త పుట్టకముందు కాబా (మక్కా)లో విగ్రహారాధన ఉండేది. దానిని ప్రవక్త నిరోధించాడు. ప్రవక్తగారి పినతండ్రి శివభక్తుడు. ఆయన ఆయాత్ అనే పేరుతో శివస్తోత్రాలు రచించాడు. ఇవ్వాళ మనకు సౌదీ అరేబియాలో వారి విడిచిన సంస్కృతి కన్పడదు. గ్రీసులో హిందూ సంస్కతి ఉండేది. ఏథీనా అంటే దుర్గాదేవి.... అంటే సూర్యదేవుడు. పాసిడాన్ అంటే పరమశివుడు. త్రిశూలధారి జటాజూటధారి అయిన పాసిడాన్ ఒరిజినల్ చిత్రాలు నావద్ద ఉన్నాయి. అక్కడ ఆర్థడాక్స్ క్రైస్తవం వ్యాపించిన తర్వాత హిందూ సంస్కృతి అంతరించిపోయింది. కాందహార్, మహాభారతంలోని గాంధారి పుట్టిల్లు. ఇవ్వాళ ఆఫ్ఘనిస్తాన్‌లో హిందూ సంస్కృతి లేదు. వందల అడుగుల ఎత్తైన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఆమధ్య జిహాదీలు కూల్చివేశారు. నేపాల్ హిందూరాజ్యం. అక్కడ భట్టారాయ్ అనే చైనా ఏజెంటు ప్రాచీన తాళపత్ర గ్రంథాల లైబ్రరీలను ఆ మధ్య తగులబెట్టించాడు. 1959లో చైనాను ఆక్రమించుకున్నాక అక్కడి 6 లక్షల బౌద్ధ విహారాలు నేలమట్టం చేయబడ్డాయి. ఇండియాపైకి బాబర్ అక్బర్ ఔరంగజేబులు దండయాత్ర చేసినప్పుడు మధుర, కాశీ, అయోధ్య, శ్రీరంగం, తిరుమల వంటి దేవాలయాలను ధ్వంసం చేశారు. ఓరుగల్లును 1323లో ఉలుగ్ ఖాన్ నేలమట్టం చేసి ఏకశిలానగరం పేరును సుల్తానుపూరుగా మార్చా. మాలిక్ కాఫర్ 1310లో హళిబీడు బేలూరు శిల్పాలను విధ్వంసం చేశారు. 16వ శతాబ్దంలో అళియరామరాయలు యుద్ధంలో ఓడిపోగానే విజయనగరాన్ని శత్రువులు దాదాపు ఆరునెలలపాటు నిర్మూలిస్తూనే ఉన్నారు. హంపీ క్షేత్రము అనే ఖండకావ్యంలో కొడాలివారు 'శిలలు ద్రవించి ఏడ్చినం' అని కవిత రచించాడు. 1948లో కాశిం రజ్వీ తెలంగాణలో జరిపిన విధ్వంసం చరిత్ర పుటలను రక్తసిక్తం చేసింది. తెలంగాణ ఆడబడుచుల బట్టలు విప్పి బతకమ్మలు ఆడించారు. 1780లో టిప్పు సుల్తాన్ మలబారు, కూర్గు ప్రాంతాలల్లో జరిపిన నరమేధం ఆయన స్వహస్తాలతో వ్రాసిన లేఖలలో నిక్షిప్తమై ఉంది. ఐతే 1947 తర్వాత నెహ్రూ యుగంలో రూపొందించిన మన పాఠ్య గ్రంథాలల్లో కనపడకుండా సూడో సెక్యులరిస్టులు జాగ్రత్తపడ్డారు. ఇదిగో బ్రిటీషు వారు కమ్యూనిస్టులు కలిసి రూపొందించిన దొంగ చరిత్రలు చదివి వాటిని కెఎం పరిమలీలు పాఠాలు చెప్పి విద్యార్థుల మనస్సుల్లో విషం నింపుతున్నారు. కన్నయ్య కుమార్ వంటి వారు ఈ కెయు పరిమలీల విశ్వామిత్ర సృష్టియే.

ఆర్యులు విదేశాల నుండి వచ్చారు. జీలం నదీ తీరంలో పురుషోత్తముణ్ణి అలెగ్జాండరు ఓడించాడు. విజయనగర రాజులు బల్లులు, తొండలు తినేవారు. అక్బరు, ఔరంగజేబులు సత్పురుషులు. శివాజీ చిట్టెలుక. నేతాజీ సుభాష్ చంద్రబోసు హిట్లరు బూట్లు నాకిన కుక్క - వి.డి.సావర్కార్ దుర్మార్గుడు. ఉస్మాన్ అలీఖాన్ మంచోడు. ''మనది బిర్యానీ కల్చర్ - మనది షేర్వాణీ కల్చర్''.. ఇవీ ఇప్పుడు మనం చదువుకుంటున్న పాఠాలు.

నెహ్రూ రాజవంశంలో ఆరుగులు పాలకులు వచ్చారు. వారంతా తమ రాజకీయ అస్తిత్వం కోసం కమ్యూనిస్టుల మద్దత్తుమీద ఆధారపడ్డారు. అందుకు సామ్యవాదులు ఒక షరతు పెట్టారు. ఈ విధంగా రాజ్యపాలన మీరు చేసుకోండి - కళాసాంస్కృతిక విద్యారంగాలు మాకు స్వాధీనం చేయండి - అని. అందుకు జె.ఎన్.యులు, సంగీత సాహిత్య నాటక అకాడమీలు పాఠ్యగ్రంథాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెసు పూనా ఫిలిం ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థలను సామ్యవాదులు స్వాధీనం చేసుకున్నారు. భారతదేశంలో మైనారిటీలు ద్వితీయశ్రేణి పౌరులుగా చూడబడుతున్నారని కెయు పరిమలీ ఆరోపించాడు. కాశిం రజ్వీ 1948లో హైదరాబాదు వదిలి పాకిస్తాన్ వెళితే అతడిని అతి హీనంగా చూశారు. ఇండియాలో ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్‌లు జకీర్ హుస్సేన్‌లు అబ్దుల్ కలామ్‌లు భారత రాష్ట్రపతులులైనారు. మరి పాకిస్తాన్ మాటేమిటి? అక్కడ మంత్రివర్గంలో ఒక్క హిందువైనా ఉన్నాడా? స్వాతంత్ర్యం వచ్చినప్పుడు లాహోర్ వంటివి హిందూ మెజారిటీ ప్రాంతాలు. ఇప్పుడక్కడ ఒక్క హిందున్నాడా? లేదు! దీనికి సైన్సు కాంగ్రెసు అధినేతలు సమాధానం చెప్పి తీరాలి. రాణి పద్మిని అంతఃపురానికి నిప్పు అంటించుకుని 'జోహార్' చేయడం నిజమా? కాదా?

బాబరు అయోధ్యమీదికి దండయాత్ర చేసి మసీదు నిర్మించడానికి ముందు అక్కడ రామాలయం ఉన్నమాట నిజమా? కాదా? షాజహాన్ తాజమహల్ నిర్మించడానికి ముందు అక్కడ శివాలయం ఉన్నమాట నిజమా? అబద్ధమా? జీసను కాశ్మీరుకు వచ్చిన నిజమా? అబద్ధమా? అబ్రహమ్ - బ్రహ్మయ్య- శాంసన్ శ్యామసూనుడు, వాటికన్-వాటిక, సెయింట్ - శాంతుడు ఇవన్నీ సంస్కృత శబ్దాలు కావా? ఓల్గా - వాలుగానది, సత్లవానా - శ్వేతానన అంటే రష్యాలో ప్రాచీన కాలంలో వైదిక సంస్కృతి ఉండేది. బుద్ధిపూర్వకంగా మన ప్రబుద్ధులు ప్రపంచ చరిత్రను వక్రీకరించారు. మొగుణ్ణి కొట్టి మొగసాలు ఎక్కిందని ఓ తెలుగు సామెత ఉంది. ప్రణాళికాబద్ధంగా మార్క్సిసుటలు జిహాదీలు మెకాలేలు క్రూసేడర్లు చరిత్రను వక్రీకరించి వ్రాశారు. పరిహారం లేదు.

'భారతం, భాగవతం, రామాయణం కల్పిత కథలు' (ఫిక్షన్) అన్నారు బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ జ్యోతిబసువంటివారు. ఇక వీరికి భారతీయ చదువుపై ఎటువంటి ప్రాముఖ్యం ఉండదని తెలుస్తున్నది'' త్రేతాయుగం నుండి నేటివరకు గల ప్రపంచ చరిత్రను అష్టాదశ పురాణాలలో కూడా ఉంది. ఐతే ఈ పురాణాలన్నీ కట్టుకథలు, పుక్కిట పురాణాలు అన్నారు. మానవ చరిత్ర 1917లోనే ప్రారంభమయిందని తీర్మానించారు. ఇప్పుడు నరేంద్రమోదీ ప్రభుత్వం చేయవలసినది ఏమిటి? ఈ బూటకపు హిస్టారికల్ కాంగ్రెసుల నిజస్వరూపాన్ని వెలికి తీయడం కోసం ఒక కమిటీని నిర్ణయించండి. పాఠ్య గ్రంథాలను సంగీతనాటక, సాహిత్య అకాడమీ కార్యవర్గాలను వెంటనే రద్దు చేయించాలి. ''నిజమైన భారత దేశ చరిత్రను'' రచింపచేయించాలి. భారతదేశంలో లోకమాన్య బాలగంగాధర తిలక్ వంటి పరిశోధకులున్నారు. తెలుగులో మల్లంపల్లి సోమశేఖర శర్మ, కోట వెంకటాచలం, ఆదిరాజు వీరభద్రరావు, కొమర్రాజు లక్ష్మణరావు, సురవరం ప్రతాపరెడ్డి, బిఎన్‌శాస్త్రి వంటి పరిశోధకులున్నారు. వీరికి నేడు ఎట్టి గుర్తింపు లేదు. చరిత్రకారులు అంటే రొమిల్లా థాపర్, ఆర్.ఎస్.శర్మ, కెయుపరిమలి, కౌశాంబి, అరుంధతీరాయ్ రాహుల్ స్వాయకృత్యాయన్. ఈ దుర్మార్గం నరేంద్రమోదీ యుగంలో కూడా జరుగవలసిందేనా?? చైనాలో నేపాల్‌లో బెంగాల్‌లో కేరళలో సాంస్కృతిక విధ్వంసం మొదలైంది. పూర్వం చైనాలో ఉగాది ఉత్సవాన్ని డ్రాగన్ ముత్యం (పెరల్స్ పండుగగా జరుపుకునేవారు ఇప్పుడు అక్కడ వారి ప్రాచీన సంస్కతి నిర్మూలించబడింది. సరిగ్గా కేరళలో అదే జరుగుతున్నది. ఒకరి పండుగపై నిషేధం విధించారు. దీపారాధనలు కొబ్బరికాయలు 'కమ్యూనల్' అన్నారు. ఇక్కడి పాఠ్య గ్రంథాలను భ్రష్టు పట్టించారు. కనీసం ఇది తప్పు అనేవాడు కూడా లేకుండాపోతున్నది.

-ప్రొ.ముదిగొండ శివప్రసాద్

ఉత్తరాయణం

అంధులను ఆదుకోవాలి

అంధత్వం, దృష్టిదోషంతో ఉన్నవారికి సమాజం, ప్రభుత్వం అండగా నిలవాలి. ప్రభుత్వాలు వారికోసం ప్రత్యేక పథకాలు, కార్యక్రమాలు నిర్వహించాల్సి అవసరం ఉంది. కళ్లు లేకపోయినా ధైర్యంగా నిత్య జీవనయానాన్ని సాగించడానికి మార్గం చూపినవాడు బ్రెయిలీ. అంధుల కోసం లిపిని అభివృద్ధి చేసి మార్గదర్శిగా నిలిచాడు. ఆ లిపికి అతడిపేరే పెట్టారు. జనవరి 4వ తేదీని బ్రెయిలీ జయంతి. ఆ రోజున 'ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం'గా పాటిస్తారు. 1832లో 12 చుక్కల ప్రత్యేక లిపిని ఆరు చుక్కల లిపిగా మార్చాడు. అది ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చింది.

అంధుల జీవితాలను మార్చేసింది. అయితే బ్రెయిలీ లిపిలో విద్య, ఉద్యోగాలు చేయడానికి తగిన సౌకర్యాలు, వసతులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. సమాజం కూడా వారిని మిగతావారిలాగానే గౌరవిస్తూ సహకరించాలి.

-కామిడి సతీష్‌రెడ్డి, పరకాల

మహిళాబిల్లు ఇంకెప్పుడు?

రాజకీయాల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యంతో రూపొందించిన మహిళా బిల్లుకు మోక్షం లభించేది ఎప్పుడు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బిల్లును ఆమోదించే ప్రక్రియకు పలు పార్టీలు మోకాలడ్డాయి. మహిళకు ప్రాధాన్యం ఇస్తున్నామని చాలామంది నాయకులు, పార్టీలు బయటకు ప్రకటనలు చేస్తాయి. కానీ హక్కుల వద్దకు వచ్చేసరికి కుత్సిత వైఖరిని కనబరుస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల్లోనైనా మహిళాబిల్లుకు మోక్షం లభిస్తుందన్న ఆశ నీరుగారిపోయినట్టే. అసలు ఆ బిల్లు విషయం ఎవరూ ప్రస్తావించకపోవడమే విడ్డూరం.

కె.శోభనాచలం, గరికపర్రు

సీబీఐ వైఫల్యం

ఒక కోర్టులో నేరం నిరూపించలేకపోయినంత మాత్రాన నిందితులు సచ్ఛీలురని అర్థం కాదు. 2జి స్పెక్ట్రమ్, బొగ్గు బొరియల కుంభకోణాలలో దర్యాప్తు సంస్థ వైఫల్యం వల్ల నిందితులు బయటపడ్డారు. అసలు నేరమే జరగనట్లు, నిందితులు తప్పేమీ చేయనట్లు ప్రకటనలు చేయడం ఆశ్చర్యంగా ఉంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికల్లో స్పష్టంగా అక్రమాలు జరిగినట్లు పేర్కొన్నారు. ఆ అక్రమాలకు, నిందితులకు సంబంధం ఉన్న విషయం సరిగ్గా నిరూపించకపోవడమే ఈ కేసులో లోపం. ముమ్ముందు ఈ కేసులో నిందితులకు మళ్లీ చుక్కెదురయ్యే అవకాశాలు లేకపోలేదు. సమర్థులైన అధికారులు, ప్రభుత్వ చిత్తశుద్ధి ఉంటే ఇలాంటి అవినీతి కుంభకోణాల అంతుచూడటం కష్టమైనపనేమీ కాదు.

-వి.ఆర్.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

పార్లమెంట్‌ను కుదిపేసిన మహారాష్ట్ర అల్లర్లు

- దాడులను అరికట్టడంలో 'మహా'ప్రభుత్వం విఫలం
- కేంద్రం సమాధానం చెప్పాలని లోక్‌సభలో కాంగ్రెస్ డిమాండ్
- ఓటమిని జీర్ణించుకోలేకే ఆరోపణలు: బీజేపీ
- రాజ్యసభలో చర్చకు పట్టుబట్టిన విపక్ష ఎంపీలు
- సభా కార్యక్రమాలకు అంతరాయం.. వాయిదాలు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 3: మహారాష్ట్రలో భీమా కొరేగావ్ పోరాటానికి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో చెలరేగిన దాడుల అంశం బుధవారం పార్లమెంట్ ఉభయ సభలను కుదిపేసింది. మహారాష్ట్రలో చెలరేగిన అల్లర్లను అదుపుచేయడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని, దీనిపై ప్రకటన చేయాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో రాజ్యసభ వరసగా మూడుసార్లు, లోక్‌సభ ఒకసారి వాయిదా పడ్డాయి. రాజ్యసభ ప్రారంభమైన తరువాత వివిధ మంత్రిత్వ శాఖలు, కమిటీలకు సంబంధించిన పత్రాలు సమర్పించిన అనంతరం చైర్మన్ వెంకయ్య నాయుడు జీరో అవర్‌ను కొనసాగించేందుకు ప్రయత్నించారు. విపక్ష ఎంపీలు మహారాష్ట్రలో జరిగిన అల్లర్లపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితుల్లో చైర్మన్ 12 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగడం, విపక్ష సభ్యులు తమ స్థానాల్లో నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇవ్వడంతో రెండు గంటలకు వాయిదా వేశారు. ఆ తరువాత సభ ప్రారంభం కాగానే బీఎస్పీ సభ్యుడు సతీష్ చంద్ర మిశ్రా మహారాష్ట్రలో జరిగిన పరిణామాలపై చర్చకు నోటీసు ఇచ్చానని, చర్చను వెంటనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం, దళితులపై దాడులు జరుగుతున్నాయని, దీనిపై చర్చ చేపట్టాలని, కేంద్రం సమాధానం చెప్పాలని సతీష్ మిశ్రా డిపూటీ చైర్మన్ కురియన్‌ను కోరారు. సభను కొనసాగించేందుకు సహకరించాలని కురియన్ సభ్యులను కోరారు. విపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోడియం వద్దకు రావడంతో సభను మూడు గంటలకు వాయిదా వేశారు.



బుధవారం లోక్‌సభలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే

లోక్‌సభలో పాలక, విపక్షాల వాగ్వాదం

మహారాష్ట్రలో జరిగిన దాడులు వెనుక ఆరెస్సెస్ హస్తం ఉందని, సమాజంలోని కులాల మధ్య ఆ సంస్థ చిచ్చుపెడుతోందని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో ఆరోపించింది. దేశవ్యాప్తంగా దళితులపై బీజేపీ-ఆరెస్సెస్‌లు విద్వేషాన్ని రగిలిస్తున్నాయని, ఈ పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులో స్పష్టమైన ప్రకటన చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మహారాష్ట్రలోని భీమా-కొరెగావ్‌లో దళితులపై దాడులకు సంబంధించి మోదీ తన వైఖరిని స్పష్టం చేయాలని, సుప్రీం కోర్టు సిటింగ్ జడ్జిచేత న్యాయ విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. పూణె జిల్లాలో భీమా-కొరెగావ్ యుద్ధం 200 వార్షికోత్సవం సందర్భంగా దళితులు, హిందూ సంస్థల కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మరణించారని, ప్రజలను విభజించి చూసే బీజేపీ-ఆరెస్సెస్‌లే ఈ ఘటనకు కారణమని ఆయన ఆరోపించారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. బీజేపీ అధికారం ఉన్న రాష్ట్రాల్లో దళితులు, ముస్లిలపై దాడులు జరుగుతున్నాయని ఖర్గే మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు ప్రధాని ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ప్రధాని ఇతర పార్టీవాళ్లను 'మౌనిబాబా'లని అంటారు. కాని ఇప్పుడు ప్రధాని నరేంద్రమోదీయే 'మౌని బాబా' అని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు అభ్యంతరం చెబుతుండటంతో ఆగ్రహించిన ఖర్గే తన చేతిలోని పత్రాలను చించివేశారు. అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ మాట్లాడుతూ మహారాష్ట్రలో జరుగుతున్న అల్లర్లకు పరిష్కారం చూపకుండా ఖర్గే రెచ్చకొట్టాలని భావిస్తున్నారని అన్నారు. ఈ అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని, దేశంలో అన్నిచోట్లా అపజయం పాలైందని, అందుకే ఇటువంటి ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఈ పరిస్థితులలో అక్కడ శాంతి నెలకొల్పాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు 'విభజించు-పాలించు' అనే విధానాన్ని అవలంబిస్తోందని అనంత్ కుమార్ ధ్వజమెత్తారు.





మహారాష్ట్ర బంద్ సందర్భంగా బుధవారం నిర్మానుష్యమైన ముంబయి మహానగరం. రైళ్లకు అంతరాయం కలగడంతో థానెలోని రైల్వే స్టేషన్ వెలుపల ప్రయాణికుల అవస్థలు

మహారాష్ట్ర బంద్.. పలుచోట్ల హింస

ముంబయి, జనవరి 3: భీమా-కొరెగావ్ యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా చెలరేగిన హింసకు నిరసనగా బుధవారం జరిగిన మహారాష్ట్ర బంద్‌లో అక్కడక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నాయి. దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో రోడ్డు, రైలు రవాణా వ్యవస్థలు స్తంభించిపోయాయి. భారిపా బహుజన్ మహాసంఘ్ నేత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ పిలుపు మేరకు మహారాష్ట్ర బంద్ జరిగింది. రెండు రోజుల క్రితం పూణె జిల్లాలోని భీమా కొరెగావ్‌లో దళితులపై దాడులను నివారించడంలో మహారాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందినందుకు నిరసనగా బంద్ పాటించాలని ప్రకాశ్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. ముంబయిలో ఆందోళనకారులు సిటీ బస్సులను, లోకల్ రైళ్లను అడ్డుకోవడంతో జనజీవనం స్తంభించింది. నగరంలోని చెంబూరు, ఘట్కోపర్, కామరాజ్ నగర్, విఖ్రోలీ, డిండోషి, కండివలి, జోగేశ్వరి, కళానగర్, మహిమ్ ప్రాంతాల్లో దళితులు నిరసన ప్రదర్శనలు జరిపారని పోలీసులు తెలిపారు. వందలాది మంది ఆందోళనకారులు పశ్చిమ ఎక్స్‌ప్రెస్ హైవేను దిగ్బంధం చేశారు. ఆ తర్వాత పోలీసుల జోక్యం చేసుకుని ఆందోళనకారులను అక్కడి నుంచి తొలగించారు. వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించారు. హార్బర్‌లైన్ తదితర ప్రాంతాల్లో నిరసనకారులు రాళ్లు రువ్వారు. అనంతరం వారు గోవండి, మన్‌ఖుర్ద్, కుర్లా

స్తంభించిన రవాణా వ్యవస్థ

తదితర ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌పై బైఠాయించి సబర్బన్ రైళ్లను అడ్డుకున్నారు. పన్వెల్, బేలాపూర్, వషీ తదితర ప్రాంతాల్లో కొన్ని గంటల సేపు లోకల్ రైళ్లు నిలిచిపోయాయి. థానే, భండుప్, కంజుర్ మార్గ్, విఖ్రోలీ, ఘట్కోపర్ స్టేషన్లలో రైళ్ల కోసం ప్రయాణీకులు బారులు తీరారు. నల్లసోపర స్టేషన్‌లోనూ నిరసనకారులు రైళ్లను అడ్డుకున్నారు. బాంద్రా, ధారవి, కామరాజ్ నగర్, సంతోష్‌నగర్, డిండోషి, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో 13 బస్సులకు ఆందోళనకారులు నష్టం కలిగించారని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

పలు రైళ్లకు అంతరాయం కలగడంతో ముంబయిలో ప్రఖ్యాతి చెందిన 'డబ్బావాలాల' సేవలు నిలిచిపోయాయి. విద్యార్థుల భద్రత దృష్ట్యా తాము బస్సులను రద్దు చేశామని స్కూల్ బస్ ఆపరేటర్ల సంఘం ప్రకటించింది. థానే, గొరెగావ్ ప్రాంతాల్లో దళిత ఆందోళనకారులు రైల్వే ట్రాక్‌లను తొలగించారు. హింసాత్మక సంఘటనలకు సంబంధించి నగర పోలీసులు 9 కేసులను నమోదు చేశారు. పూణెలో బస్సులపై రాళ్లు రువ్విన సంఘటనలు ఒకటీ అరా జరిగినా మొత్తానికి బంద్ ప్రశాంతంగానే కొనసాగింది. గత రెండురోజులుగా ఆందోళనకారులు 42 బస్సులకు నష్టం కలిగించారని పూణె మహానగర్ పరివాహన్ మహామండల్ తెలిపింది. భీమా కొరెగావ్‌లో హింసకు బాధ్యుడని ఆరోపణలు ఎదుర్కొంటున్న మిలింద్ ఎక్బోటే ఇంటిపైకి దండెత్తేందుకు నిరసనకారులు యత్నించారు. రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినందుకు గుజరాత్ ఎమ్మెల్యే, దళిత నాయకుడు జిగ్నేశ్ మేవానీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్‌లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. భీమా కొరెగావ్ యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా పూణెలోని శనివార్ వాడలో జరిగిన కార్యక్రమంలో జిగ్నేశ్, ఖలీద్‌లు పాల్గొని మరో వర్గం వారిని రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌తో చేతులు కలిపిన టీడీపీ!

- ట్రిపుల్ తలాక్ బిల్లుపై కలిసి పోరాడతామని స్పష్టీకరణ
- సెలెక్ట్ కమిటీ సభ్యుడిగా సీఎం రమేష్
- రాజ్యసభలో జాబితా చదివిన ఆనంద్ శర్మ



టీడీపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 3: ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించే అంశంపై ఎన్‌డిఏ మిత్రపక్షమైన తెలుగుదేశం ప్రతిపక్షానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్‌తో కలిసిపోయింది. ముస్లిం మహిళలకు ట్రిపుల్ తలాక్ నుండి విముక్తి కలిగించేందుకు ఉద్దేశించిన ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించేందుకు మీతో కలిసి పోరాడతామని రాజ్యసభ సభ్యుడు సి.ఎం.రమేష్‌తో ప్రతిపక్ష నాయకుడు గులాం నబీ ఆజాద్‌కు తెలుగుదేశం పార్టీ సందేశం పంపింది. అంతటితో ఆగకుండా రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష ఉపనాయకుడు ఆనంద్ శర్మ బుధవారం రాజ్యసభలో ప్రతిపాదించిన ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీలో ప్రతిపక్షం తరపున సభ్యుల జాబితాలో చేరి సంచలనం సృష్టించింది. ఆనంద్ శర్మ బుధవారం ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని ఒక తీర్మానం ప్రతిపాదించారు. ఆయన ఈ తీర్మానంలో సెలెక్ట్ కమిటీలో ప్రతిపక్షం తరపున సభ్యులుగా ఉండేవారి పేర్లు కూడా సభాముఖంగా ప్రకటించారు. ఆ పేర్లలో తెలుగుదేశం సభ్యుడు సి.ఎం.రమేష్ పేరు కూడా ఉండటం గమనార్హం. సి.ఎం.రమేష్ మంగళవారం మధ్యాహ్నం రాజ్యసభ ఇన్నర్ లాబీలో గులాం నబీ ఆజాద్‌ను కలిసి ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని తమ పార్టీ కూడా డిమాండ్ చేస్తోందనీ, ఈ లక్ష్య సాధనకోసం ప్రతిపక్షంతో కలిసి పోరాడతామని చెప్పి వచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇద్దరు కేంద్ర మంత్రులతో భాగస్వామిగా కొనసాగుతున్న తెలుగుదేశం పార్టీ అధికార పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో ప్రతిపక్షంతో చేతులు కలపటం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే తెలుగుదేశం పార్టీ కూడా ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేయటం ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోదీ మధ్య పెరుగుతున్న దూరానికి అద్దం పడుతోందని భావిస్తున్నారు.

రన్‌వే నుంచి జారిపడ్డ ఎంఐజీ యుద్ధ విమానం

పనాజీ, జనవరి 3: గోవాలోని ఐఎన్‌ఎస్ హన్స నేవల్ బేస్‌లో బుధవారం మధ్యాహ్నం ఎంఐజీ 29కే యుద్ధ విమానం పైకి లేచే సమయంలో రన్‌వే నుంచి జారిపడింది. అయితే, పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి ఈ యుద్ధ విమానాన్ని సురక్షితంగా యథాస్థానానికి చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. భారత నావికాదళంలో కొత్తగా చేరిన ఎంఐజీ 29కే యుద్ధ విమానానికి ఈ తరహా ఘటన ఎదురుకావడం ఇదే ప్రథమం. యుద్ధ విమానం 'టేకాఫ్' సమయంలో ఎదురైన సాంకేతిక సమస్య కారణంగా జరిగిన ఈ ఘటనపై విచారణ జరుపుతామని గోవా ప్రాంత ఫ్లాగ్ కమాండింగ్ ఆఫీసర్ రియల్ అడ్మిరల్ పునీత్ కే బాహ్లే తెలిపారు. 'టేకాఫ్' సమయంలో సమస్య ఏర్పడగా అదే దిశగా పైలట్ ప్రయత్నించడంతో యుద్ధ విమానం రన్‌వే నుంచి పక్కకు వచ్చినట్లు ఆయన వివరించారు. రన్‌వే చివరి భాగాన 150 మీటర్ల ముందు విమానం నిలిచిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. గోవాలో ప్రయాణీకుల విమానాలు సైతం రాకపోకలు కొనసాగించే డబోలిమ్ విమానాశ్రయంలో ఉత్తర భాగాన ఉన్న ఐఎన్‌ఎస్ హన్స నేవల్ ఎయిర్ బేస్‌లో ఈ ఘటన జరిగిందన్నారు.

ఓ ప్రయాణీకుల విమానం ఎయర్‌పోర్టులో దిగడానికి 10 నిమిషాల ముందు యుద్ధ విమానం రన్‌వే పై నుంచి తప్పుకుందని గోవా ఎయిర్‌పోర్టు డైరెక్టర్ బిసి హెచ్ నెగి తెలిపారు. మధ్యాహ్నం 12.30 నుంచి రన్‌వేపై రాకపోకలను నిలిపివేసి 1-40 గంటల తర్వాత యథావిధిగా విమానాలను అనుమతించారు. 'సీ హారియర్స్' సేవలను ఉపసంహరించాక, రష్యా నుంచి దిగుమతైన ఎంఐజీ 29కే యుద్ధ విమానాలను నావికాదళంలో చేర్చారు. ప్రస్తుతం ఈ యుద్ధ విమానాలను ఐఎన్‌ఎస్ విక్రమాదిత్య నౌక నుంచి రక్షణ అవసరాలకు నౌకాదళం వినియోగిస్తోంది.



గోవాలోని నేవల్ బేస్‌లో రన్‌వే మీదనుంచి జారి పడిపోయిన యుద్ధవిమానం



బుధవారం ఢిల్లీలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న జోగు రామన్న, వేణుగోపాలాచారి, నగేష్

మేడారం జాతరకు రండి

ఉపరాష్ట్రపతికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 3: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు రావాలని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడ్ని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీలో బుధవారం ఉప రాష్ట్రపతి వెంకయ్యను ఇంద్రకరణ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జాతర ఏర్పాట్లపై ఉపరాష్ట్రపతికి మంత్రి వివరించారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించేలా కేంద్ర ప్రభుత్వానికి సూచించాలని వెంకయ్యకు ఇంద్రకరణ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మేడారం జాతరకు వస్తానని ఉపరాష్ట్రపతి హామీ ఇచ్చారని అనంతరం ఇందకరణ్‌రెడ్డి విలేఖరులతో తెలిపారు. ఉపరాష్ట్రపతిని కలిసినవారిలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు నగేష్, సీతారాం నాయక్ ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

ఆదిలాబాద్‌లో జంతు, పశు జీవ వైవిధ్య ప్రదర్శనశాల ఏర్పాటుకు రూ.125 కోట్లు విడుదల చేయాలని కేంద్ర పర్యావరణ, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి మహేష్ శర్మను తెలంగాణ రాష్ట్ర పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న విజ్ఞప్తి చేశారు. బుధవారం రామన్న కేంద్ర మంత్రులు థావర్ చంద్ గెహ్లాట్, అనంత్ గీతే, మహేష్ శర్మ, ఆల్ఫోన్స్ కన్ననన్‌తనంలతో సమావేశం అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలతో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్ర మంత్రులతో రామన్న చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ- జంతు, పశు జీవ వైవిధ్య ప్రదర్శనశాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి రూ.185కోట్లతో ప్రతిపాదన అందించిందని, ఇందులో కేంద్రం వాటా రూ.125కోట్లు త్వరగా విడుదల చేయాలని మహేష్ శర్మను కోరినట్టు తెలిపారు. అలాగే కరీంనగర్‌లో క్యాటగిరి ఒకటి విభాగంలో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. అనంతరం సామాజిక, న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్‌తో బీసీ వర్గాల సమస్యలు, స్కాలర్‌షిప్‌లపై చర్చించినట్టు రామన్న వివరించారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి అనంత్‌గీతేను కలిసి రాష్ట్రంలోని భారీ పరిశ్రమల అభివృద్ధి అంశాలపై చర్చించినట్టు తెలిపారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధిపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ఆల్ఫోన్స్‌తో చర్చించినట్టు ఆయన వెల్లడించారు.

అరుణాచల్.. అదెక్కడ?

- ఉనికినే మేం గుర్తించలేదు
- దక్షిణ టిబెట్‌గానే పరిగణిస్తున్నాం
- సైనిక చొరబాట్లపై చైనా మౌనం

బీజింగ్, జనవరి 3: భారత దేశంలో అంతర్భాగమైన అరుణాచల్ ప్రదేశ్ ఉనికిని తాము ఎన్నడూ గుర్తించలేదని చైనా బుధవారం స్పష్టం చేసింది. అలాగే అరుణాచల్‌లోకి తమ సైనిక దళాల చొరబాటుపైనా మౌనం వహించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని సియాంగ్ జిల్లాలో దాదాపు 200 మీటర్లమేర తమ దళాలు చొరబడ్డాయన్న కథనాలపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్రంగానే స్పందించింది. అసలు అరుణాచల్ ప్రదేశ్ ఉందన్న విషయాన్నే తాము ఎప్పుడూ గుర్తించలేదని దీర్ఘకాలంగా ఇదే వైఖరితో ఉన్నామని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి జంగ్ షువాంగ్ స్పష్టం చేశారు. అసలు తమ దళాలు అరుణాచల్ భూ భాగంలోకి చొరబడ్డాయన్న విషయం తమకు తెలియదని అన్నారు. అరుణాచల్‌ను దక్షిణ టిబెట్‌లో అంతర్భాగంగానే చైనా పరిగణిస్తోంది. దరిమిలా దాదాపు3,488 కిలోమీటర్లమేర వాస్తవాధీనరేఖ ప్రాంతంలో ఇరుదేశాల మధ్య వివాదం కొనసాగుతోంది. గత నెలలో చైనా దళాలు అరుణాచల్‌లోకి ప్రవేశించడాన్ని భారత్ దళాలు నిరోధించాయని, దానితో తమ నిర్మాణ సామగ్రిని అక్కడే వదిలేసి చైనా సైన్యం వెళ్లిపోయినట్టుగా కథనాలు వచ్చాయి. సరిహద్దు సమస్య పరిష్కారంపై భారత్-చైనాలు పటుతరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం ఇరు దేశాలకు ఎంతో అవసరమన్నారు. డోక్లాం తరహాలో తలెత్తినట్టుగానే భారత్-చైనాల మధ్య మరో ప్రతిష్టంభనకు అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు' ఆ జఠిల సమస్యను గత ఏడాదే పరిష్కరించుకున్నాం'అని చైనా ప్రతినిధి బదులిచ్చారు.

ఐరాసలో మద్దతు సరిపోదు

'హిందీ'పై లోక్‌సభలో సుష్మా స్వరాజ్

న్యూఢిల్లీ, జనవరి 3: ఐక్యరాజ్య సమితిలో హిందీని అధికార భాషగా ప్రకటించడానికి నిబంధనలు అవరోధంగా మారాయని కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ వెల్లడించారు. ఐరాసలో హిందీ భాష అమలుకు అవసరమయ్యే 4 బిలియన్లు ఖర్చుచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని బుధవారం ఇక్కడ తెలిపారు. 'ఐక్యరాజ్య సమితి నిబంధనల ప్రకారం మొత్తం సభ్యుల్లో మూడింట రెండో వంతు సభ్యుల మద్దతు ఉండాలి. అప్పుడే ఏ భాషనైనా అధికారికంగా గుర్తించడానికి వీలుంటుంది. దీనికి సంబంధించి ఐరాస నిబంధనల్లో స్పష్టంగా ఉంది' అని ఆమె చెప్పారు. ఐరాసలో సభ్యదేశాల సంఖ్య 193 అంటూ లోక్‌సభ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సుష్మా తెలిపారు. సభ్యదేశాల మద్దతు లభించి హిందీని అధికార భాషగా గుర్తేసే దానికయ్యే ఖర్చును భరించడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆమె అన్నారు.

నా దగ్గరా బటన్ ఉంది.. జాగ్రత్త!

ఉత్తర కొరియాకు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, జనవరి 3: అణ్వాయుధ హెచ్చరికలతో కుతకుత ఉడికిస్తున్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదే తీరులో తీవ్ర హెచ్చరిక చేశారు. కొత్త ఏడాది వేడుకల సందర్భంలో కిమ్ జోంగ్ మాట్లాడుతూ 'నా టేబుల్‌మీదే న్యూక్లియర్ బటన్ ఉంటుంది. తిక్కరేగితే నొక్కేస్తా'నంటూ అమెరికాను తీవ్రంగా హెచ్చరించటం తెలిసిందే. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం తాజాగా అదే తీరులో ట్విట్టర్ వేదికగా తీవ్ర హెచ్చరికలు చేశారు. 'ఎవరైనా అతనికి చెప్పండి. నా టేబుల్ మీదా న్యూక్లియర్ బటనుంటుంది. అది ఉత్తర కొరియాకంటే పెద్దది, శక్తివంతమైనది కూడా. అది పనిచేస్తుంది' అంటూ ట్రంప్ ఘాటు ట్వీట్ చేసినట్టు వైట్‌హౌస్ పేర్కొంది. అదేవిధంగా ఉత్తర కొరియా ప్యాంగ్యాంగ్ అణు కార్యక్రమాలను అతి జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టు కూడా వైట్‌హౌస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. తమవద్దనున్న అణ్వాయుధాలు అమెరికాలోని ఏ ప్రాంతానికైనా చేరుకోగలవంటూ కిమ్ జోంగ్ పదేపదే హెచ్చరికలు చేస్తుండటం తెలిసిందే. ఏడాదికాలంగా రెండు దేశాల అధ్యక్షులు అణ్వాయుధ ప్రస్తావనలతో పరస్పరం మాటల దాడులు చేసుకుంటోన్న విషయం తెలిసిందే. ఉత్తర కొరియా అణ్వాయుధ గురిలోనే అమెరికా ప్రధాన ప్రాంతాలన్నీ ఉన్నాయని, తమ దేశం మరిన్ని శక్తివంతమైన అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులు తయారు చేయడమే కాదు, పరీక్షించడమూ మానదని పదే పదే ఉత్తర కొరియా ప్రకటిస్తుంటే, 'ఉత్తర కొరియా అణ్వాయుధ అతి చర్యలన్నీ ప్రపంచ వినాశనానికి హేతువుగా కనిపిస్తున్నాయి. ఆ దేశం దూకుడుకు బ్రేకులు వేసేందుకు ప్రపంచ దేశాలన్నీ కలిసి రావాలి' అని అమెరికా వాదిస్తోంది.



‘ఫ్లాట్’గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబయి, జనవరి 3: బుధవారం ఉదయం లాభాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. నిఫ్టీ స్వల్ప లాభంతో ముగియగా, సెనె్సక్స్ స్వల్ప నష్టంతో ముగిసింది. సెనె్సక్స్ 18.88 పాయింట్లు నష్టపోయి 33,998.37 పాయింట్లకు చేరుకుంది. నిఫ్టీ కేవలం ఒక్క పాయింట్ స్వల్ప లాభంతో 10,443.20 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.63.54 వద్ద కొనసాగింది. ఆటో, ఐటీ, గ్యాస్, చమురు, ఆరోగ్యసేవల రంగాలు నష్టపోయాయి.

ఎన్‌ఎస్‌ఇలో అదానీ పోర్ట్సు, ఎల్ అండ్ టీ, ఐసిఐసిఐ, ఎస్ బ్యాంక్, కోల్ ఇండియా, పవర్ గ్రిడ్, టాటా స్టీల్ వంటి కంపెనీల షేర్లు లాభాలను చవిచూశాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, విప్రో, ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటో, మారుతి సుజికీ, టాటా మోటార్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎన్టీపీసీ, కోటక్ బ్యాంకు, సన్ ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంకు వంటివి 2.73 శాతం మేరకు నష్టపోయాయి. రిలయన్స్ రిఫైనరీలు, హీరో మోటార్ గ్రూప్, టైటాన్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు షేర్లు లాభాల దిశగా కొనసాగాయి.

ఎరువులకు ప్రస్తుతం డిమాండ్ ఉన్న దృష్ట్యా నాగార్జున కెమికల్స్ 19.91 శాతం, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ 5.72 శాతం, గుజరాత్ స్టేట్ ఫెర్టిలైజర్స్ 2.49 శాతం, నేషనల్ ఫెర్టిలైజర్స్ 4.05 శాతం, జురారీ ఆగ్రో కెమికల్స్ 2.46 శాతం, మేంగళూరు కెమికల్స్ 3.59 శాతం, చంబల్ ఫెర్టిలైజర్స్ 2.07 శాతం మేరకు లాభపడ్డాయి. బుధవారం నాడు ముఖ్యంగా ఆటో ఇండెక్స్ 0.55 శాతానికి పడిపోయింది.

ఐటీ, గ్యాస్, చమురు, టెక్నాలజీ, ఆరోగ్యసేవల రంగాలు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి.



TOP GAINERS	%	TOP LOSERS	%
Adani Ports	2.78	Dr Reddys	-2.29
Larsen	2.17	Wipro	-2.59
ICICI Bank	1.88	ONGC	-1.65
Yes Bank	1.33	Bajaj Auto	-1.61
Coal India	0.72	Maruti Suz	-1.35

PTI GRAPHICS



TOP GAINERS	%	TOP LOSERS	%
Adani Ports	2.58	Dr Reddys	-2.91
Larsen	2.04	Wipro	-2.75
Idea Cellular	1.99	ONGC	-1.73
ICICI Bank	1.71	Bajaj Auto	-1.63
Hindalco	1.69	Maruti Suz	-1.44

6 ‘బలహీన’ బ్యాంకులకు రూ. 7,577 కోట్ల సాయం

ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం



న్యూఢిల్లీ, జనవరి 3: నష్టాలతో బలహీనపడిన ప్రభుత్వరంగ బ్యాంకులకు మూలధనాన్ని తిరిగి సమకూర్చే పథకంలో భాగంగా ఆరు జాతీయ బ్యాంకులకు 7,577 కోట్ల రూపాయలను అందజేసేందుకు ఆర్థికమంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. రిజర్వుబ్యాంకు విధానాలకు లోబడి నష్టదాయక బ్యాంకులకు మూలధనాన్ని సమకూర్చేందుకు కేంద్రం ‘ఇంద్రధనుస్’ పథకాన్ని ప్రారంభించింది. 2019 మార్చిలోగా ‘బలహీన’ బ్యాంకులకు 70వేల కోట్ల రూపాయలను మూలధనంగా అందజేస్తారు. మూడేళ్ల క్రితం ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడిబిఐ బ్యాంకు, యూకో బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ మహారాష్టల్రకు సాయం అందించేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా ఆమోదముద్ర వేసింది. వాటాదారుల, డైరెక్టర్ల ఆమోదం వంటి లాంఛనాలన్నీ పూర్తయ్యాక మరి కొద్ది వారాల్లో ఈ బ్యాంకులకు మూలధనం సమకూరుతుంది.

షేర్లను విక్రయించి తమ మూలధనాన్ని పెంచుకునేందుకు కొన్ని ‘బలహీన’ బ్యాంకులు ఇప్పటికే ‘బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్’ నుంచి ఆమోదం పొందాయి. 1,375 కోట్ల రూపాయల మేరకు మూలధనాన్ని సమకూర్చుకునేందుకు షేర్లను జారీ చేయాలని యూకో బ్యాంకు బుధవారం నిర్ణయించింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా 323 కోట్ల రూపాయలను షేర్ల విక్రయం ద్వారా సమకూర్చుకునేందుకు కసరత్తు చేసింది.

షేర్లను విక్రయించి తమ మూలధనాన్ని పెంచుకునేందుకు కొన్ని ‘బలహీన’ బ్యాంకులు ఇప్పటికే ‘బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్’ నుంచి ఆమోదం పొందాయి. 1,375 కోట్ల రూపాయల మేరకు మూలధనాన్ని సమకూర్చుకునేందుకు షేర్లను జారీ చేయాలని యూకో బ్యాంకు బుధవారం నిర్ణయించింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా 323 కోట్ల రూపాయలను షేర్ల విక్రయం ద్వారా సమకూర్చుకునేందుకు కసరత్తు చేసింది. బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 2,257 కోట్లు, ఐడిబిఐ బ్యాంకుకు 2,729 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్టక్రు 650 కోట్లు, దేనా బ్యాంకుకు 243 కోట్లు సమకూర్చాలని కేంద్రం నిర్ణయించింది. మూలధనాన్ని తిరిగి సమకూర్చుకున్నాక ఈ బ్యాంకులు ఆర్థికంగా తేరుకుంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

నిరర్థక ఆస్తులు, రుణ బకాయిల కారణంగా కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకులు క్రమంగా బలహీనపడుతున్నాయని, రెండేళ్ల కాలంలో వీటికి 2.11 లక్షల కోట్ల రూపాయలను మూలధనంగా సమకూర్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందని గత అక్టోబర్‌లో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తుల విలువ 2015 మార్చిలో 2.75 లక్షల కోట్లు కాగా, గత ఏడాది మార్చి నాటికి ఆ విలువ 7.33 లక్షల కోట్లకు చేరింది. మూలధన సేకరణకు బాండ్లను జారీ చేయడం ద్వారా 1.35 లక్షల కోట్లు, మార్కెట్ ద్వారా 58వేల కోట్ల రూపాయలను సమకూర్చుకోవాలని భావించారు. మూలధన సేకరణకు బాండ్లను జారీ చేసేందుకు విధివిధానాలను రూపొందించే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది.

‘ఇంద్రధనుస్’ పథకం కింద రెండేళ్లలో బ్యాంకులకు 18వేల కోట్లను సమకూరుస్తామని కూడా గతంలో జైట్లీ తెలిపారు. కాగా, గత మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులకు 51,858 కోట్ల రూపాయలను సమకూర్చగా, మిగతా 18,142 కోట్లను రాబోయే రెండేళ్ల కాలంలో అందజేస్తారు.

టిఎస్-ఐపాస్ భేష్!

మంత్రి కెటిఆర్‌కు ఔత్సాహిక పారిశ్రామికవేత్త ప్రశంస

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 3: తెలంగాణ పారిశ్రామిక విధానం అద్భుతమని డెల్ ఎక్సెల్ ఫార్మా సియివో రఘుపతి కందారపు కొనియాడారు. ఈ మేరకు పరిశ్రమలశాఖ మంత్రి కె తారకరామారావుకు రఘుపతి బుధవారం సందేశం పంపారు. గతంలో వివిధ కంపెనీల్లో పని చేసిన రఘుపతి ప్రస్తుతం సొంతంగా పరిశ్రమను స్థాపించడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ప్రభుత్వపరంగా, పారిశ్రామిక విధానం వల్ల తనకు కలిగిన అనుభవాలను మంత్రితో పంచుకున్నారు. తాను గతంలో 15 సంవత్సరాల పాటు అనేక కంపెనీల్లో ఫార్మా రీసెర్చ్ విభాగానికి హెడ్‌గా పని చేసినప్పటికీ తనకు ఇంతటి సులభమైన, పారదర్శకమైన అనుభవం ఎప్పుడు కలుగలేదన్నారు. జూన్ 2016లో టిఎస్‌ఐపాస్ ద్వారా అనుమతులు పొందిన తాను, ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పూర్తి చేసి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులను కలిసానన్నారు. గతంతో పోలిస్తే డ్రగ్ లైసెన్స్ విధానం అత్యంత సులువుగా, పారదర్శకంగా ఉందని రఘుపతి గుర్తు చేసారు. డ్రగ్ లైసెన్సింగ్ విధానం నిజానికి క్లిష్టమైంది అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ ప్రక్రియ అత్యంత సులభంగా ఉందని ఆయన కొనియాడారు. మంత్రి కెటిఆర్ పని తీరు తమకు స్ఫూర్తిదాయకంగా ఉందని ఆయన ప్రశంసించారు.

తిరోగమన చర్య!

ఎన్నికల బాండ్లపై కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 3: ఎన్నికల బాండ్ల జారీకి సంబంధించి డోనర్స్ (దాతలు) పేర్లు బయటపెట్టకూడదన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పాటిస్తామని చెబుతున్న కేంద్రం విరాళాలు ఇచ్చేవారి పేర్ల విషయంలో గోప్యత పాటించడం ఎందుకని కాంగ్రెస్ నిలదీసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం తిరోగమన చర్యగా పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాల అభివర్ణించారు. ఎన్‌డిఎ ప్రభుత్వ ఎలక్టోల్ బాండ్ల విధానాన్ని ఆయన ఎద్దేవా చేశారు. పైగా దీన్ని అధికార పార్టీ పూర్తి స్థాయిలో దుర్వినియోగం చేసుకోడానికి వీలుంటుందని, ఆ దృష్టితోనే బాండ్ల విధానాన్ని తెరమీదకు తెచ్చారని సుర్వేవాల ఆరోపించారు.రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వదలచుకున్న వారు ఎస్‌బీఐ నుంచి బాండ్లు కొనుగోలు చేయవచ్చని ఆర్థిక మంత్రి జైట్లీ చేసిన ప్రకటనను ఆయన తప్పుపట్టారు. డోనర్ పేర్లు బయటకు రాకుండా ఎన్నికల వ్యయ ప్రక్షాళన ఏమిటని కాంగ్రెస్ ప్రశ్నించింది. డోనర్ పేరే లేనప్పుడు పారదర్శకత నేతిబీరకాయలో నెయ్యి వంటిదని సుర్జేవాల తన ట్వీట్‌లో విరుచుకుపడ్డారు.

దేశీయ జూట్ రంగానికి ఊతం

జనపనార సంచులు వాడాల్సిందే

న్యూఢిల్లీ, జనవరి 3: ఆహార ధాన్యాలు, పంచదారను జూట్(జనపనార) సంచుల్లోనే ప్యాక్ చేయాలన్న నిర్ణయాన్ని కేంద్ర కేబినెట్ కమిటీ పొడిగించింది. వచ్చే జూన్ నెలాఖరు వరకూ నాటికి జూట్ ప్యాకేజీని కచ్చితంగా అమలుచేయాలని తొలుత నిర్ణయించారు. జనపనార పరిశ్రమను ప్రోత్సహించడంతోపాటు ఆ రంగంపై ఆధారపడ్డ కుటుంబాలు, రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిషా, అస్సాం, ఆంధ్రప్రదేశ్, మేఘాలయ, త్రిపురలో ఎన్నో కుటుంబాలు జనపనార పరిశ్రమపై ఆధారపడ్డాయి. సెంట్రల్ కేబినెట్ ఆన్ ఎకనామిక్ ఎఫైర్స్(సీసీఈఏ) 1987 జూట్ ప్యాకేజింగ్ మెటీరియల్ చట్టం కింద గడువుపొడిగించినట్టు ఓ అధికార ప్రకటనలో వెల్లడించారు. ఈ చట్టం కింద ఆహార ధాన్యాలు 90 శాతం, పంచదార ఉత్పత్తులు 20 శాతం జూట్ ప్యాకేజీలో ఉండాలి. ప్రస్తుతానికి జూన్ నెలాఖరు వరకూ కాలపరిమితి నిర్ణయించినా భవిష్యత్‌లో దాన్నే ఖాయం చేస్తారని తెలిసింది. నూరు శాతం ఉత్పత్తులనకు జనపనార సంచులే వాడాలన్నది ప్రభుత్వ యోచన. తద్వారా ఆ రంగంపై ఆధారపడ్డ వేలాది కుటుంబాలను ఆదుకోవాలని కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా దేశంలోని జూట్ పరిశ్రమ కేంద్రంపైనే ఆధారపడి ఉంది. కేంద్రం ఏటా 5,500 కోట్ల రూపాయల ఉత్పత్తులను కొనుగోలు చేస్తోంది. అలాగే దేశ వ్యాప్తంగా ఈ రంగంలో 3.7 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. రైతులయితే 40 లక్షల మంది ఆధారపడ్డారు.

నాసిరకం చైనా రబ్బర్‌పై విచారణకు రంగం సిద్ధం

న్యూఢిల్లీ, జనవరి 3: చైనా నుంచి భారీగా దిగుమతి అవుతున్న కృత్రిమ రబ్బర్ నాణ్యతపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ విషయమై సమగ్ర విచారణ జరపాలని భారత్ నిర్ణయించింది. దేశీయ వ్యాపారులకు బాసటగా నిలవాలని ప్రభుత్వం భావిస్తోంది. చైనా రబ్బర్ నాణ్యతపై గుజరాత్ ఫ్లూరోకెమికల్స్ ‘డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ యాంటీ డంపింగ్ అండ్ అలైడ్ డ్యూటీస్ (డిజిఎడి) ముందు ఫిర్యాదు చేసింది. చైనా నుంచి వస్తున్న కృత్రిమ రబ్బర్ వల్ల దేశీయంగా నష్టం జరుగుతోందని నిర్ధారణ అయితే- దిగుమతులపై ‘యాంటీ డంపింగ్ డ్యూటీ’ కింద అదనపుపన్ను విధిస్తారు.

విశాఖ ఉక్కులో 10 శాతం పెట్టుబడుల ఉపసంహరణకు ఆమోదం

రాజ్యసభలో ఉక్కు శాఖ సహాయ మంత్రి వెల్లడి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 3: కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని అనుసరించి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ (విశాఖ ఉక్కు కర్మాగారం)లో ప్రభుత్వానికి ఉన్న 100 శాతం వాటాలో 10 శాతాన్ని పబ్లిక్ ఇష్యూ (ఐపిఓ) ద్వారా విక్రయిచడం జరుగుతుందని ఉక్కు శాఖ సహాయ మంత్రి విష్ణు దేవసాయి పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో పెట్టుబడులను ఉపసంహరించుకోవాడానికి కారణాలేమిటి అని ఎంపీ విజయ సాయి రెడ్డి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. విశాఖ ఉక్కులో పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదనకు 2012లోనే ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని వెల్లడించారు.

తెలంగాణ జెన్కో సీఎండీ దేవులపల్లికి సీబీఐపీ అవార్డు ప్రదానం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 3: ప్రతిష్ఠాత్మకమైన సిబిఐపి అవార్డును తెలంగాణ జెన్కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ అవార్డును సిబిఐపి అధ్యక్షుడు రవీంద్రకుమార్ ప్రదానం చేశారు.

కేంద్ర మానవనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్, కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్, విద్యుత్ శాఖ సహాయ మంత్రి రాజ్ కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా దేవులపల్లి మాట్లాడుతూ తెలంగాణ ట్రాన్స్‌కోలో సరఫరా నష్టాలు 3.37 శాతం తగ్గాయన్నారు. ఉత్తర, దక్షిణ గ్రిడ్‌ల మధ్య కొత్త లైన్లను నిర్మించడంలో తెలంగాణట్రాన్స్‌కో విశేషమైన చొరవను ప్రదర్శించినట్లు చెప్పారు. 11వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ తలెత్తినా తట్టుకునే శక్తి తెలంగాణకు ఉందన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కొత్తగా 514 సబ్‌స్టేషన్లు నిర్మించామన్నారు.



ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సిబిఐపి అవార్డును అందుకుంటున్న తెలంగాణ జెన్కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు

టిఎస్‌ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి మెరుగు పర్చేందుకు చర్యలు

అధికారుల సేవను ప్రశంసించిన ఆర్టీసీ చైర్మన్ సోమారపు

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, జనవరి 3: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్‌ఆర్టీసీ) ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్న ఎండిని, అధికారులను సంస్థ చైర్మన్ సోమారపు సత్యనారాయణ ప్రశంసించారు. సంస్థను ఇంకా ఆదాయం వచ్చే విధంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. బుధవారం నాడిక్కడ బస్‌భవన్‌లో చైర్మన్‌కు ఎండి జి.వి.రమణారావు, ఈడిలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ కాసేపువారితో ముచ్చటించారు. గత ఏడాది కొన్ని డిపోలు లాభాల్లోకి వచ్చాయని, మరికొన్ని లాభాలను సాధించే దిశగా ముందుకు వెళుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది కూడా ఇంకా కృషి చేస్తే చాలా డిపోలు లాభాల్లోకి వచ్చి సంస్థ ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని తెలిపారు. ఈ మేరకు అందరి సహకారం అవసరమని చైర్మన్ కోరారు. ఎండి జివి.రమణారావు మాట్లాడుతూ సంస్థ ఆర్థికంగా పుంజుకోవడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మరోవైపు నూతన పద్ధతుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

వీసా మార్పులతో విఘాతమే

★ ఇరుదేశాల సంబంధాలపైనా ప్రభావం: నాస్కామ్

★ వచ్చేసేవారికి స్వాగతం పలుకుతాం: ఆనంద్ మహేంద్రా

న్యూఢిల్లీ, జనవరి 3: హెచ్1బీ వీసాల విషయంలో అమెరికా ఎలాంటి ప్రతికూల చర్యలు చేపట్టినా ఇరుదేశాల సంబంధాలపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నాస్కామ్ తెలిపింది. హెచ్1బీ వీసాల పొడిగింపును నిరోధించేందుకు అమెరికా కొత్త చర్యలను చేపడుతోందంటూ కథనాలు వచ్చిన నేపథ్యంలో నాస్కామ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ట్రంప్ ప్రభుత్వ ప్రతిపాదిస్తున్న ఈ చర్యలు వల్ల భారత్ ఐటీ ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని, దాదాపు 10 లక్షల మందికి పైగా ఈ వీసా హోల్డర్లు స్వదేశానికి తిరుగుముఖం పట్టక తప్పని పరిస్థితి ఏర్పడుతుందన్న సంకేతాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలన్నీ కూడా భారత్- అమెరికా మధ్య ఉన్న మైత్రి బంధాన్ని దెబ్బతీసే అవకాశం ఉంటుందని నాస్కామ్ తెలిపింది. ఇప్పటికే అమెరికాలో గ్రీన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నవారు సైతం ఈ మార్పుల వల్ల తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుందని అలాగే కేవలం భారత్ ఐటీ పరిశ్రమలకే కాకుండా హెచ్1బీ వీసా కలిగిన ప్రతి భారతీయుడికీ విఘాతక పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే అమెరికాలో వృత్తి నిపుణుల సంఖ్య చాలా తక్కువగా ఉన్న తరుణంలో అమెరికా ఈ చర్యలను తలపెట్టడం ఇరుదేశాలకు నష్టమేనని నాస్కామ్ అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ అన్నారు. గ్రీన్‌కార్డు ఆమోదం కోసం ఎదురు చూస్తున్న వారి సంఖ్య అమెరికాలోగణనీయంగా ఉందని అది వచ్చేవరకూ హెచ్1బీ వీసాల గడువును పొడిగించడానికి ఈ కొత్త నిబంధనలు ఎంత మాత్రం వీలుకల్పించవని అన్నారు. అమెరికన్లకే ఉద్యోగాలు ఇవ్వాలని, అమెరికా వస్తువులే కొనాలన్న అధ్యక్షుడు ట్రంప్ ఆలోచనల్లో భాగంగానే హెచ్1బీ వీసాలకు సంబంధించి అమెరిగా అంతర్గత భద్రతాశాఖ ఈ మార్పులను తలపెడుతోంది. గత ఏడాదిగా ట్రంప్ ఈ రకమైన చర్యలనే చేపడుతూ వచ్చారని వాటన్నింటికీ పరాకాష్టగా ఇప్పుడు హెచ్1బీ వీసాల మంజూరు ప్రక్రియపై దృష్టి పెట్టారని అన్నారు. ఈచర్య వల్ల భారతీయులకు సామూహికంగా కలిగే నష్టం చాలా తీవ్రంగానే ఉంటుందని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. కాగా నిజంగా ట్రంప్ ఈరకమైన ప్రతికూల చర్యలు చేపడితే ఏ విధంగానూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్వదేశం వచ్చేవారందరికీ స్వాగతం పలుకుతామని మహేంద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహేంద్రా అన్నారు.


స్పైస్ పార్క్‌కు మరో 20కోట్ల కేంద్ర నిధులు

ఫిబ్రవరిలో టెర్మరిక్ సెల్ ప్రారంభం ★ రానున్న కేంద్ర మంత్రి సురేష్ ప్రభు ★ నిజామాబాద్ ఎంపీ కవిత వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

నిజామాబాద్, జనవరి 3: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలో రూపుదిద్దుకుంటున్న స్పైస్ పార్క్ పనులు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటుతో మరింత వేగం పుంజుకోనున్నాయి. ఢిల్లీలో బుధవారం నిజామాబాద్ పార్లమెంటు సభ్యురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్‌ప్రభును కలిసి పసుపు రైతులను ఆదుకునేందుకు చేపడుతున్న స్పైస్ పార్క్ పనుల గురించి వివరించారు. దీనికోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 42 ఎకరాల భూమిని సేకరించి, 30కోట్ల రూపాయలను కేటాయించిందని మంత్రి దృష్టికి తెచ్చారు. స్పైస్ బోర్డు ఆధ్వర్యంలోనే దీని ప్రతిపాదనలు, డీపీఆర్‌ను రూపొందించారని, వాటికి అనుగుణంగానే ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇందుకు కేంద్ర మంత్రి స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులకు తోడు అదనంగా కేంద్రం నుండి మరో 20కోట్ల రూపాయలను సమకూరుస్తామని సంసిద్ధత వ్యక్తం చేశారు. అదేవిధంగా పసుపు పండించే రైతులతో పాటు ఈ పంటను సేకరించే ట్రేడర్లు, పసుపు ఆధారిత రంగంతో సంబంధం ఉన్న వారితో హైదరాబాద్‌లో ఫిబ్రవరి 3వ తేదీన వర్క్‌షాప్ నిర్వహించాలని నిర్ణయించినట్టు ఎంపీ కవిత తెలుపగా, సుగంధ ద్రవ్యాల బోర్డు చైర్మెన్, కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులు ఈ సదస్సులో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. పసుపు రైతులను ఆదుకునేందుకు ఏర్పాటు చేయనున్న స్పెషల్ టర్మరిక్ సెల్ ప్రారంభోత్సవానికి ఫిబ్రవరి మాసంలో హాజరయ్యేందుకు కూడా మంత్రి అంగీకరించారు.

పసుపు రైతులను ఆదుకునేందుకు మంత్రి సురేష్‌ప్రభు స్పైస్ పార్క్‌కు నిధుల కేటాయింపుతో పాటు ఇతరత్రా చర్యలు చేపట్టేందుకు చొరవ చూపడం పట్ల ఎంపీ కవిత హర్షం వ్యక్తం చేశారు.



కేంద్ర మంత్రి సురేష్‌ప్రభును కలిసి స్పైస్ పార్క్ నిర్మాణం గురించి వివరిస్తున్న ఎంపీ కవిత

అశోక్ గజపతిరాజులో భేటీ

నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఏర్పాటుపై బుధవారం ఎంపీ కవిత చర్చించారు. విమానాశ్రయం ఏర్పాటు సాధ్యాసాధ్యాలకు సంబంధించిన బృందాలను పంపాలని ఎంపీ కవిత ఈ సందర్భంగా కోరారు.

వన సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక

- నాలుగు కార్యక్రమాలకు రూపకల్పన
- ఎర్రచందనం పరిరక్షణపై అవగాహనా సదస్సులు
- రిజర్వు ఫారెస్టుల చుట్టూ ఫెన్సింగ్
- జన్మభూమిలో ప్రత్యేక కార్యక్రమాలు
- రాష్ట్ర అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ మల్లికార్జునరావు

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, జనవరి 3: రాష్ట్ర వ్యాప్తంగా అటవీ విస్తీర్ణం పెంపు.. వన్యప్రాణి సంరక్షణ.. స్మగ్లింగ్ నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఎం మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అడవుల పరిరక్షణకు నాలుగు ప్రత్యేక అవగాహన సదస్సులను జన్మభూమి కార్యక్రమాల్లో నిర్వహిస్తామన్నారు. 'వనసురక్ష' కింద ఏపీకే మణిహారంగా ఉన్న ఐదు జిల్లాల్లో విస్తరించి ఉన్న అడవులలో లభ్యమయ్యే ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడం.. వాటిని కాపాడుకోవడం.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అడవులలో ఉత్పత్తి అవుతున్న విలువైన పంటలను కాపాడుకోటవంతో పాటు కార్చిచ్చులు చెలరేగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే అంశాలపై ప్రజలను, సిబ్బందిని చైతన్య పరుస్తామని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయటంతో పాటు వన్యప్రాణుల అపహరణ, వధించటం వంటి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అడవులు అన్యాక్రాంతం కాకుండా రిజర్వు ఫారెస్టుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. 'వనవికాసం' కింద నేల సంరక్షణ పనులపై దట్టమైన అటవీ గ్రామాల సమీపంలో ఉన్న ప్రజల్లో అవగాహన కల్పించటం.. అటవీ ప్రాంతాల పునరుద్ధరణ.. భూగర్భజలాలను వృద్ధి చేయటం.. మట్టి క్షీణతను అదుపు చేయటం.. అటవీ అభివృద్ధి.. సహజ పునరుత్పత్తి.. కృత్రిమ పునరుత్పత్తి ద్వారా స్థిరమైన సాగు, సామాజిక అటవీ నర్సరీలలో 2018లో ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్రంలో పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. వనం-మనం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటటం, ప్రజాపంపిణీ కోసం ఇతర విభాగాలకు అందించేందుకు వివిధ రకాల మొక్కలు పెంచి వన్యప్రాణి నిర్వహణలో భాగంగా తాబేలు పరిరక్షణ, అడవుల అభివృద్ధి పశుగ్రాసం ప్లాట్లు ఏర్పాటవుతాయని వివరించారు.

'వనసేవ'లో భాగంగా వైద్య శిబిరాలు, సౌరదీపాల పంపిణీ, బోరుబావులు, కుట్టు యంత్రాల పంపిణీ, సౌరలాంతర్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాన్ని చేపడతామని చెప్పారు. చివరగా 'వన సంపద' కింద ప్రజలు వినియోగించేందుకు వివిధ అటవీ ఉత్పత్తులకు, అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆదివాసీల సంరక్షణకు వివిధ కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. ఔషధ మొక్కలు, ఎర్రచందనం, గంధపుచెక్కలు, టేకు, వెదురు సంపదను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

భాషా మైనారిటీల ఆలోచనే లేదు

లోక్‌సభలో కేంద్ర మంత్రి నఖ్వీ

న్యూఢిల్లీ, జనవరి 3: మైనారిటీల జాబితాలో భాష ప్రాతిపదికన మైనారిటీలను చేర్చే ఆలోచనేదీ కేంద్రం వద్ద లేదని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ స్పష్టం చేశారు. లోక్‌సభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు రాతపూర్వక సమాధానమిస్తూ, జాతీయ స్థాయిలో మైనారిటీలుగా కేంద్రం ఆరు కమ్యూనిటీలనే గుర్తించిందని వివరించారు. 1992 నేషనల్ కమిషన్ ఫర్ మైనారిటీస్ యాక్ట్ సెక్షన్ 2(సి) ప్రకారం ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, క్రిస్టియన్లు, జొరాస్ట్రియన్లు, జైనులు మాత్రమే జాతీయ మైనారిటీల జాబితాలో ఉన్నారని సమధానమిచ్చారు. కొన్ని కులాలకు మైనారిటీలు గుర్తింపు లభిస్తున్నా, అది రాష్ట్రాలకు సంబంధించిన వ్యవహారమన్నారు. జేవిష్‌లను మైనారిటీల జాబితాలో చేర్చే అంశంపై కేంద్రం ఇంతవరకూ నిర్ణయం తీసుకోలేన్నారు.



రాష్ట్ర స్థాయి ఉత్తమ మహిళా ఉపాధ్యాయిని అవార్డులు ప్రదానం చేస్తున్న మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు

విలువలతో కూడిన విద్యాబోధన జరగాలి

- మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు
- సమాజాన్ని ఉద్ధరించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి
- మహిళా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 3: విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, అందుకు అనుగుణంగా విలువలతో కూడిన విద్యాబోధన జరగాలని మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదాన కార్యక్రమం విశాఖలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారి చూపేవాడే ఉపాధ్యాయుడని, వారి బాధ్యతలను విస్మరించకుండా ఆదర్శప్రాయం కావాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దగలిగే శక్తి సామర్థ్యాలు ఉపాధ్యాయునికే ఉన్నాయన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడం ద్వారా చక్కటి సమాజం రూపకల్పనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ బడ్జెట్‌లో రూ.23,209 కోట్లను కేటాయించి, విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యా రంగంలో జోడించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించగలుగుతున్నామన్నారు. రాష్ట్రంలో గడచిన మూడేళ్ల కాలంలో 30వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని గుర్తు చేశారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామని, అయితే మహిళా ఉపాధ్యాయులకు కూడా ఒక ప్రత్యేక ఉపాధ్యాయ దినోత్సవం ఉండాలన్న భావనతో దార్శనికురాలు సావిత్రిబాయి పూలే జయంతిని గుర్తించామన్నారు. రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి 86 మంది మహిళా ఉపాధ్యాయినులకు ఉత్తమ అవార్డులు ప్రకటించినట్టు తెలిపారు. అవార్డుతో పాటు రూ.10వేల నగదు, రూ.10వేలు విలువచేసే ట్యాబ్, సర్టిఫికెట్, బంగారు పతకం, శాలువ బహూకరించారు. సమావేశంలో సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి జీ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే మీసాల గీత తదితరులు పాల్గొన్నారు.

25న కొత్త ఫ్రంట్

- ఈ పాలకులను గద్దె దించడమే లక్ష్యం
- అడవుల నుంచి గిరిజనులను బయటకు పంపే కుట్ర
- సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఆంధ్రభూమి బ్యూరో



ఖమ్మం, జనవరి 3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడంతో పాటు వచ్చే ఎన్నికల్లో వారిని గద్దె దించడమే లక్ష్యంగా ఈ నెల 25వ తేదీన బహుజన డెమోక్రటిక్ లెఫ్ట్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఎం మహాసభల సందర్భంగా బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రజలను మాటలతో మాయచేస్తూ కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతామన్నారు. తమ ఫ్రంట్‌లో ఇప్పటికే అనేక సంఘాలు చేరాయని, త్వరలోనే సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కూడా చేరనున్నదని స్పష్టం చేశారు. ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లో ఈ ఫ్రంట్ ప్రారంభమవుతుందన్నారు. ప్రారంభ సమావేశానికి సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, ప్రకాష్ అంబేద్కర్ లాంటి ప్రముఖులతో పాటు ఆయా రాజకీయ పార్టీలు, సంఘాల ప్రధాన నేతలు పాల్గొంటారన్నారు. దేశంలో నోట్లరద్దే పెద్ద కుంభకోణమని, ఆర్థిక రంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ఘోరంగా విఫలమయ్యారని, మతోన్మాదానికి అనుకూలంగా రాజ్యాంగ సవరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు. నోట్ల రద్దు, జీఎస్టీ పెద్దోళ్ళకోసమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడవుల నుంచి గిరిజనులను బయటకు పంపించేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. వారికి ఇస్తానన్న మూడెకరాల భూమి ఇవ్వక పోగా గిరిజనుల పోడు భూములను బలవంతంగా లాక్కుంటున్నారన్నారు. అడవి మీద గిరిజనులకు హక్కే లేదనడం అవివేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలే ఆదివాసీలు, లంబాడీల మధ్య చిచ్చుపెట్టారని, దీనిపై ముఖ్యమంత్రి ఎందుకు నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. ఈ సమస్యలపై అఖిలపక్షాన్ని ఎందుకు నిర్వహించడంలేదని ప్రశ్నించారు. బిసి సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని, ఎంబిసి కులాలను గుర్తించాలని డిమాండ్ చేశారు.

బుక్ ఫెస్టివల్‌లో 'సైబాబా' కలకలం

అడ్డుకున్న స్థానిక రచయితలు

విజయవాడ (క్రైం), జనవరి 3: తెలంగాణకు చెందిన రచయిత సైబాబా విజయవాడ నగరంలోని బుక్ ఫెస్టివల్‌కు రావడంతో కలకలం రేగింది. గతంలో తెలంగాణ ఉద్యమం సందర్భంగా ఆంధ్రాప్రజలకు వ్యతిరేకంగా ఆయన చేసిన రచనల్లో అసభ్యకర పదజాలం ఉపయోగించారని, అందుకు క్షమాపణ చెప్పాలని పలువురు భాషాభిమానులు, స్థానిక కవులు, రచయితలు అడ్డుకుని డిమాండ్ చేశారు. నాటి తెలంగాణా ఉద్యమ సమయంలో సమైక్యాంధ్రాను కించపరుస్తూ సైబాబా కొన్న రచనలు చేశారు. వాటిలో బూతులు కూడా ఉండటంతో ఇప్పుడు నగరానికి వచ్చిన ఆయనను ఇక్కడివారు అడ్డుకున్నారు. స్వరాజ్యమైదాన్‌లో జరుగుతున్న బుక్ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన 'జల్ జల' అనే పుస్తకావిష్కరణకు ఆయనను ఇక్కడి నిర్వాహకులు పిలిచారు. దీంతో ఈ కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరుకాగా భాషాభిమానులు ఆందోళనకు దిగారు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో సైబాబా రాసిన రాతలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే పుస్తకాన్ని ఆవిష్కరించుకోవాలని డిమాండు చేశారు. మా తెలుగుతల్లి పాట పాడిన తర్వాతే పుస్తకావిష్కరణ జరగాలని ఆందోళనకు దిగారు. అరే ఆంధ్రుడు నంగినంగి వేషాలు వద్దు నక్కతలుపులు ఇకపై చూపెట్టొద్దు, బెజవాడకు మెయిల్ కడతాం, బద్మాష్‌లంతా బదాయించాలి' ఇలా ఆయన రాసిన కొన్ని అసభ్యకర రచనలను చదివి వినిపించారు. తమకంటూ ఆత్మగౌరవం ఉందని, సైబాబా సభాముఖంగా క్షమాపణ చెప్పాలని నిలదీశారు. అయితే ఉద్యమం సమయంలో తాను అందరిలానే రచనలు చేశానంటూ క్షమాపణ చెప్పేందుకు సైబాబా ససేమిరా అన్నాడు. ఈ తరుణంలో రంగ ప్రవేశం చేసిన సూర్యారావుపేట పోలీసులు ఏసిపి శ్రీనివాసరావు ఆధ్వర్యాన పరిస్థితిని అదుపు చేశారు. రక్షణ వలయంలో సైబాబాను వాహనం ఎక్కించి పంపేయడంతో సద్దుమణిగింది.



పుస్తకావిష్కరణకు హాజరు కాకుండానే వెనుదిరిగి వెళుతున్న రచయిత సైబాబా

సీపీఎస్ రద్దు కోసం 9న ధర్నా

సీఎస్‌ను కలిసి నోటీసు ఇచ్చిన ఎన్జీవో నేతలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 3: కాంట్రిబ్యూటరీ పింఛను పథకం (సీపీఎస్) రద్దు చేయాలంటూ ఈ నెల 9న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ నిరసనను ధర్నా రూపంలో తెలియచేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ దినేష్‌కుమార్‌కు పింఛను సాధనా సమితి నోటీసులను బుధవారం అందచేసింది. సీపీఎస్ విధానం వల్ల 2004 సెప్టెంబర్ తరువాత ఉద్యోగంలో చేరిన వారికి, ఉపాధ్యాయులకు పదవీ విరమణ తరువాత పింఛను లభించదని ఏపీఎన్జీవో నేత, జెఏసీఏపీ కన్వీనర్ పి.అశోక్ బాబు తెలిపారు. దీని వల్ల దాదాపు 1.8 లక్షల మంది ప్రభావితం అవుతారని తెలిపారు.

'రాఫెల్' రద్దుకు భారత్ నిర్ణయం!

జెరుసలెం, జనవరి 3: 500 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువ చేసే 'రాఫెల్ యుద్ధ విమానాల' కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుందని ఇజ్రాయల్‌లోని ప్రఖ్యాత ఆయుధ తయారీ సంస్థ వెల్లడించింది. ఇజ్రాయల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత్ పర్యటన నేపథ్యంలో- 'ఒప్పందం రద్దు నిర్ణయం' పట్ల ఆ సంస్థ 'విచారం' వ్యక్తం చేసింది. భారత్ విదేశాంగ మంత్రిత్వశాఖ నుంచి ఒప్పందం రద్దుపై అధికారిక ప్రకటన తమకు చేరిందని రాఫెల్ అధికార ప్రతినిధి ఇషాయ్ డేవిడ్ బుధవారం తెలిపారు. రాఫెల్ సంస్థ రూపొందించిన యుద్ధ విమానాలు, అధునాతన ఆయుధాలు విశ్వవ్యాప్తంగా ఇప్పటికే 26 దేశాలు కొనుగోలు చేస్తున్నాయి.

1వ పేజీ తరువాయి

తెగని ట్రిపుల్ తలాక్

ఏమిటిని అరుణ్ జైట్లీ నిలదీశారు. సుప్రీం కోర్టు ట్రిపుల్ తలాక్‌ను ఆరు నెలలపాటు రద్దుచేసి ఈలోగా దీనికి సంబంధించిన చట్టాన్ని చేయాలని రాజకీయ పార్టీలను ఆదేశించింది. కోర్టు ఆదేశం మేరకే తామీ చట్టాన్ని చేస్తున్నాం, అయితే కాంగ్రెస్ కోర్టు తీర్పుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని అరుణ్ జైట్లీ కాంగ్రెస్‌పై ఎదురుదాడి చేశారు. న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడు సుప్రీం కోర్టు నిషేధించిన తరువాత కూడా ట్రిపుల్ తలాక్ ఇచ్చి ముస్లిం మహిళలకు అన్యాయం చేస్తున్నారని కొన్ని సంఘటనలను ఉదహరించారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయెల్ లేచి ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలనుకుంటున్న కాంగ్రెస్ ఈ అంశంపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షం నాయకుడు గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ అరుణ్ జైట్లీ ఆరోపణలను ఖండించారు. బిల్లును పూర్తిగా సమర్థిస్తున్నాం, అయితే కొన్ని సవరణలు చేయాలన్నది తమ డిమాండ్, దీనికి ప్రభుత్వం ఒప్పుకోవచ్చుకదా అని నిలదీశారు. బిల్లుపై లోతుగా చర్చ జరిపేందుకు దీనిని సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్‌పై ఆరు నెలల్లోగా చట్టం చేయాలంటూ సుప్రీం కోర్టు ఎలాంటి గడువు విధించలేదు, అరుణ్ జైట్లీ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తృణమూల్ కాంగ్రెస్ పక్షం నాయకుడు డెరిక్ ఓబ్రేన్ లేచి ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలా, వద్దా? అనే అంశంపై సభలో ఓటింగ్ జరపాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించేందుకు సంబంధించిన తీర్మానాన్ని 24 గంటల ముందు ప్రతిపాదించవలసి ఉంటుందని సూచించారు. దీనికి డిప్యూటీ చైర్మన్ కురియన్ బదులిస్తూ సభాధ్యక్షుడు ఈ నియమానికి మినహాయింపు ఇచ్చాడని సూచించాడు. సభలోని మెజారిటీ సభ్యులు బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు ఒప్పుకోవటం లేదని గులాం నబీ ఆజాద్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుతుందనేది అందరికీ తెలిసిందే, లోక్‌సభలో ఎన్‌డిఏకు మెజారిటీ ఉన్నది కాబట్టి బిల్లును ఆమోదించి పంపించారు, రాజ్యసభలో ప్రతిపక్షానికి మెజారిటీ ఉన్నది కాబట్టి సెలెక్ట్ కమిటీకి పంపించాలంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సభలో మొదట ప్రతిపాదించిన బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించే అధికారం మాత్రమే రాజ్యసభకు ఉన్నది, లోక్‌సభ ఆమోదించి పంపించిన బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించే అధికారం రాజ్యసభకు లేదని అరుణ్ జైట్లీ వాదించారు. ముస్లిం మహిళల ప్రయోజనాలను కాపాడేందుకు ఉద్దేశించిన బిల్లును కాంగ్రెస్ అడ్డుకుంటోందని రవిశంకర్ ప్రసాద్ ఆరోపించగా, ఆనంద్ శర్మ లేచి మహిళల ప్రయోజనాల పట్ల అంతగా ప్రేమ ఉంటే చట్టసభల్లో మహిళలకు యాభై శాతం సీట్లు రిజర్వు చేసేందుకు ఉద్దేశించిన బిల్లును సభలో ప్రతిపాదించాలి, మద్దతు ఇచ్చేందుకు తాము సిద్ధమేనని ప్రకటించారు. ఈ దశలో కొందరు మంత్రులతోపాటు పలువురు సభ్యులు తమ సీట్లలో నిలబడి బిల్లుపై వెంటనే చర్చ జరిపి ఆమోదించాలంటూ నినాదాలిచ్చారు. దీనికి ప్రతిగా ప్రతిపక్షం సభ్యులు తమ సీట్లలో నిలబడి బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనంటూ నినాదాలు ఇవ్వటంతో రాజ్యసభ దద్దరిల్లిపోయింది. సభను అదుపు చేసేందుకు డిప్యూటీ చైర్మన్ కురియన్ ఎంత ప్రయత్నించినా సభ్యులు శాంతించలేదు. దీనితో కురియన్ రాజ్యసభను గురువారానికి వాయిదా వేశారు.

ప్రాజెక్టులే నా లక్ష్యం

సహాయం ఇస్తే రాష్ట్రం కొంత ఇచ్చి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. గత అక్టోబర్‌లో 50 వేల ఇళ్లు పూర్తిచేసి పసుపు, కుంకుమ, రవికెతో నూతన యజమానులతో గృహప్రవేశాలు చేయించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కొత్తగా నిర్మించబోయే 2.50 లక్షల ఇళ్లను సంక్రాంతి నాటికి ప్రారంభించాలనే ఆశయంతో ఉన్నామన్నారు. కార్యక్రమంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సి.ఆదినారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్ రైతుకు ఊరట

నీటిని వదిలితే కెసి కెనాల్ ద్వారా ఆర్డీఎస్‌లోకి చేరుకుంటాయి. తద్వారా కెసి కెనాల్, ఆర్డీఎస్ రెండింటి పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందనుంది. తుంగభద్ర డ్యామ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు 5.2 టిఎంసిలు, తెలంగాణకు 3.5 టిఎంసిల నీటి వాటా రావాల్సి ఉంది. ఇలా ఉండగా ఆంధ్రప్రదేశ్ నీటిపారుదలశాఖ కార్యదర్శి శశిభూషన్‌తో తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ఫోన్లో మాట్లాడగా గురువారం ఇండెంట్ పంపించనున్నట్టు తెలిపినట్టు సమాచారం.

కరవు భయమిక లేనే లేదు

అమలు పరిచామన్నారు. జిల్లాల్లో పండే అరటి దేశం మొత్తానికి తెలిసేలా చేస్తామన్నారు. ప్రాజెక్టుల వద్ద నిద్రించి మరీ పెండింగ్ పనులు పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలోనే లింగాల మండల తలసరి ఆదాయంలో ముందుండాలన్నారు. ఈ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ గెలవకపోయినా ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టినప్పుడు కృష్ణా, గోదావరి జిల్లాల రైతులను రెచ్చగొట్టి రాయలసీమకు నీళ్లు రాకుండా జగన్ అడ్డుపడాలని చూశారన్నారు. ముఠా రాజకీయాలు ఉన్నాయని తెలిసినా ధైర్యంగా ముందుకు పోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఉసురుతీసిన రహదారులు

పడింది. టిప్పర్ వెనుక భాగంలో కూర్చున్న శేషమ్మ(45), హనుమంతమ్మ(18), గోవిందమ్మ(55), నర్సమ్మ(45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నారాయణ(40), ఈరమ్మ(50), చిన్న మంగమ్మ(45)ను చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మరో పది మందికి గాయాలయ్యాయి. వీరికి ఆదోని ఆసుపత్రిలో చికిత్స అందించారు. మృతులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో కొత్తపేటలో విషాదం అలముకుంది.

ఊపిరాడక మృతి...

టిప్పర్‌లోని బియ్యం బస్తాల కింద పడి ఊపిరాడక కూలీలు మృతి చెందినట్లు తెలుస్తోంది. పనికి వెళ్లిన వీరు బియ్యం బస్తాలు కొనుగోలు చేసి టిప్పర్‌లో వెంట తెచ్చుకుంటున్నారు. టిప్పర్ బోల్తా పడగానే కూలీలపై బియ్యం బస్తాలు పడ్డాయి. దీంతో ఊపిరాడక శేషమ్మ, హనుమంతమ్మ, గోవిందమ్మ, నర్సమ్మ అక్కడిక్కడే మృతి చెందినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ప్రమాదం జరగ్గానే అప్రమత్తమైన చుట్టుపక్కల వారు వచ్చి బియ్యం బస్తాలు తొలగించే లోగా నలుగురు విగతజీవులుగా మిగిలారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ముగ్గురు మార్గమధ్యంలోనే మృతి చెందారు. ఊరుగాని ఊరులో చెమడోచ్చి సంపాదించిన డబ్బుతో బియ్యం కొనుక్కుని ఇంటిల్లిపాదీ కడుపారా తిందామని ఆశపడ్డ వారి బతుకులు అవే బియ్యం బస్తాల కింద పడి చితికిపోవడం పలువురిని కలచివేసింది.

అశ్వాపురంలో ముగ్గురు మృతి

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంట వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. మొండికుంట వద్ద బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైరు పనుల నిమిత్తం కొంతమంది కూలీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఇక్కడకు వచ్చారు. ఉదయం డీసీఎం వ్యాన్‌లో నుంచి కేబుల్ వైర్ బండిల్స్ మొండికుంట వద్ద జరుగుతున్న పనుల ప్రదేశంలో దింపుతుండగా మణుగూరు నుంచి పాల్వంచ వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం వ్యాన్‌లో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శివరాత్రి గోపయ్య(50), సన్యాసిపేట కనకారావు(43), డీసీఎం వ్యాన్ డ్రైవర్ తోలేటి భాగ్యారావు (25) మృతి చెందారు. ఏడుగురు తీవ్రంగా గాయపడగా భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. సంఘటన స్థలిని సిఐ అల్లం నరేందర్, ఎస్సై రాంజీ పరిశీలించారు.

ఆయిల్ మాఫియాపై ప్రభుత్వం సీరియస్

పూర్తిస్థాయి విచారణకు ఆదేశం ■ నిందితుల గుండెల్లో గుబులు

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, జనవరి 3: కాకినాడ పోర్టు కేంద్రంగా కోట్ల రూపాయల విలువైన వంట నూనెలు అపహరిస్తున్న ఆయిల్ మాఫియాపై ఉక్కుపాదం మోపే దిశగా రంగం సిద్ధమవుతోంది. మాఫియా దోపిడీపై సమగ్ర విచారణకు ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మాఫియా గుండెల్లో గుబులు మొదలయ్యింది. ఏడాదిన్నరగా సాగిన ఆయిల్ చోరీపై కస్టమ్స్ శాఖ సమగ్ర విచారణ జరుగుతుండగా, ఉన్నత స్థాయి పోలీసు విచారణకు ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం. విచారణ అనంతరం అసలు దోషులను కటకటాల వెనక్కి పంపడానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. కాకినాడ పోర్టు కేంద్రంగా వంట నూనె కంపెనీలకు వెళ్ళే పైపులను పగులగొట్టి కోట్లాది రూపాయల విలువైన పామాయిల్‌ను మాఫియా అపహరిస్తున్న ఉదంతం గత నెలలో వెలుగు చూసిన సంగతి విదితమే. ఎన్‌సిఎస్ కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు మాఫియా గుట్టు రట్టుచేశారు. రెడ్‌హ్యాండెడ్‌గా ఆయిల్ చోరీ గుట్టు రట్టుచేసి, నిందితులను అరెస్టుచేసి రిమాండుకు తరలించారు. కొందరు కీలక నిందితులు రాజకీయ పలుకుబడితో పోలీసులు తమ జోలికి రాకుండా చేసుకుని, అనంతరం ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. అయితే ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించడంతో బెయిల్‌పై తప్పించుకుని తిరుగుతున్న అసలు దోషులు కూడా జైలుకెళ్ళడం తథ్యమని తెలుస్తోంది. ఆయిల్ మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తున్న అధికార టీడీపీకి చెందిన నేతను సైతం నేరం రుజువైన పక్షంలో జైలుకు పంపాల్సిందేనని ప్రభుత్వం ఆదేశించినట్టు తెలుస్తోంది. ఏటా సుమారు 2 లక్షల టన్నుల వంట నూనెలు కాకినాడ పోర్టుకు నౌకల ద్వారా దిగుమతి అవుతోంది. ఏడాదిన్నర కాలంగా 1నుండి 3 శాతం ఆయిల్ పక్కదారి పట్టినట్టు గుర్తించారు. వంట నూనెల దిగుమతుల ద్వారా కాకినాడ పోర్టుకు 2016లో రూ.280 కోట్ల ఆదాయం లభించగా, 2017లో ఆదాయం గణనీయంగా తగ్గినట్టు తెలుస్తోంది. మరోవైపు ఆయిల్ మాఫియాపై కేసులు నమోదైనప్పటికీ అధికార పార్టీ నేత మాఫియాకు నాయకుడని పెద్ద త్తున ప్రచారం జరగడంతో ప్రభుత్వం అప్రమత్తమయ్యింది. ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం నిఘా వర్గాలను సమగ్ర విచారణకు ఆదేశించినట్టు తెలుస్తోంది. కాగా కీలక నిందితులపై కఠిన చర్యలు తీసుకోకుండా ఫిర్యాదు చేసిన కంపెనీపై వత్తిడి తెచ్చేందుకు బడాబాబులు రంగంలోకి దిగినట్టు తెలిసింది. బడాబాబుల ప్రయత్నాలను తిప్పికొట్టే పనిలో సదరు కంపెనీ ప్రతినిధులున్నారు. మాఫియాపై చర్యలు తీసుకోవడంలో పోలీసులకు ఎంత పవర్ ఉందో, కస్టమ్స్ శాఖకూ అదే విధమైన అధికారాలున్నాయని, వెలుగులోకి వచ్చిన అక్రమాలను కస్టమ్స్ శాఖ చూస్తూ ఊరుకోదని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హెచ్-1బీ వీసా పొడిగింపు ఉండదు

వాషింగ్టన్, జనవరి 3: అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన 'బై అమెరికన్, హైర్ అమెరికన్' నినాదం ఫలితంగా హెచ్-1బీ వీసాలను నియంత్రించేందుకు రంగం సిద్ధమైంది. ట్రంప్ ప్రతిపాదించిన సవరణ బిల్లు ఆమోదం పొందితే దాదాపు 5 లక్షల మంది భారతీయులు అమెరికాలో ఉద్యోగాలకు దూరమై, సొంత గడ్డకు పయనం కావల్సి ఉంటుందని ఓ అంచనా. అమెరికాలో శాశ్వత నివాసం కోసం గ్రీన్‌కార్డు పొందాలని ఎదురుచూసే వారికి ఇకమీదట పొడిగింపు ఇవ్వరాదని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ ఆ దేశ ప్రజలకు ట్రంప్ ఇచ్చిన హామీ మేరకు హెచ్-1బీ వీసాలకు పొడిగింపు ఇవ్వరాదని, అందుకు కొత్త నిబంధనలు తీసుకురావాలని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీస్' పేర్కొంటోంది. అమెరికాలో ప్రస్తుత చట్టం ప్రకారం అక్కడ ఉద్యోగాలు చేసే విదేశీయులు హెచ్-1బీ వీసా పొందితే మొదట మూడేళ్ల కాలపరిమితితో పాటు మరో మూడేళ్లు పొడిగింపునకు అవకాశం ఉంది. మొత్తం ఈ ఆరేళ్ల కాలంలో వారి గ్రీన్‌కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే, పరిశీలన పూర్తయ్యేవరకూ పొడిగింపు లభిస్తుంది. అయితే, ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సవరణల పుణ్యమాని ఇక ఎలాంటి పొడిగింపులు ఉండవు. గ్రీన్‌కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉండగా వీసాను పునరుద్ధరించక పోవడమే ఈ సవరణ ముఖ్య ఉద్దేశం. సవరణ బిల్లు వల్ల అమెరికాకు ఉద్యోగాల రీత్యా వలస వచ్చిన వారికి ముఖ్యంగా భారతీయులకు ఇక గడ్డుకాలం తప్పదంటున్నారు. అమెరికాలోని ఐటీ సంస్థలు హెచ్-1బీ వీసాలపై ఆధారపడి వేలాదిమంది భారతీయులకు ఉద్యోగాలు ఇస్తున్నాయి. దీంతో దాదాపు సగం మంది ఇంటిముఖం పట్టే అవకాశాలున్నాయని ఓ నివేదికలో పేర్కొన్నారు. దశాబ్దాకాలానికి పైగా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నవారికి, అమెరికా పౌరసత్వం కలిగిన పిల్లలకు, అక్కడ ఇళ్లు కలిగినవారికి ఇబ్బందులు తప్పవని బారక్ ఒబామా హయాంలో న్యాయశాఖలో పనిచేసిన లియోన్ ఫ్రెస్కో అంటున్నారు.

క్రీడ

మూడో టీ-20 సెంచరీతో
మున్రో రికార్డు
చివరి మ్యాచ్‌లో విండీస్‌పై కివీస్ విజయం


ఈ మ్యాచ్‌లో 104 పరుగులు చేసి, టీ-20 ఇంటర్నేషనల్స్‌లో మూడు శతకాలు సాధించిన తొలి క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన కొలిన్ మున్రో. గత ఏడాది జనవరి 6న బంగ్లాదేశ్‌పై 101, నవంబర్ 4న భారత్‌పై 109 (నాటౌట్) చొప్పున అతను రెండు సెంచరీలు నమోదు చేశాడు. తాజాగా వెస్టిండీస్‌పై సెంచరీ సాధించి, మూడో శతకంతో రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించాడు

మౌంట్ మాంగనుయ్ (న్యూజిలాండ్), జనవరి 3: కొలిన్ మున్రో రికార్డు శతకం బుధవారం ఇక్కడ జరిగిన చివరి టీ-20 ఇంటర్నేషనల్‌లో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్‌కు 119 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను కివీస్ 2-0 తేడాతో కైవసం చేసుకోగా, వైఫల్యాల బాటలో నడిచిన విండీస్ ఈ టూర్‌ను ఒక్క విజయం కూడా లేకుండా ముగించింది. టీ-20 ఇంటర్నేషనల్స్‌లో మూడు శతకాలు సాధించిన తొలి క్రికెటర్ రికార్డు పుటల్లోకి ఎక్కిన మున్రో 53 బంతుల్లో 104 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ మార్టిన్ గుప్టిల్ (63) అర్ధ శతకంతో రాణించడంతో, నిర్ణీత 20 ఓవర్లలో న్యూజిలాండ్ 5 వికెట్లకు 243 పరుగుల గౌరవ ప్రదమైన స్కోరు సాధించగలిగింది. మొదటి వికెట్‌కు గుప్టిల్, మున్రో 11.5 ఓవర్లలో 136 పరుగుల భాగస్వామ్యాన్ని అందించడం విశేషం. వెస్టిండీస్ బౌలర్లలో కార్లొస్ బ్రాత్‌వెయిట్‌కు రెండు వికెట్లు లభించాయి. జెరోమ్ టేలర్, రయాద్ ఎమ్రిట్ చెరో వికెట్ పడగొట్టారు.

తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు

ఈ టూర్‌లో చివరి మ్యాచ్‌ని గెల్చుకొని, పరువు నిలబెట్టుకోవాలన్న ఆశతో ఇన్నింగ్స్ ప్రారంభించిన విండీస్‌ను టిమ్ సౌథీ మొదట్లోనే దెబ్బతీశాడు. అతను వేసిన మొదటి బంతిలో కొలిన్ మున్రోకు క్యాచ్ ఇచ్చి చాడ్విక్ వాల్టన్ (0) వెనుదిరిగాడు. అదే ఓవర్ ఐదో బంతికి స్టార్ ఆటగాడు క్రిస్ గేల్ కూడా పెవిలియన్ చేరాడు. రెండు బంతులు ఎదుర్కొన్న అతను పరుగుల ఖాతా తెరవకుండానే గ్లేన్ ఫిలిప్స్‌కు చిక్కాడు. స్కోరుబోర్డుపై కేవలం ఒక పరుగు మాత్రమే ఉండగా, రెండు వికెట్లు కోల్పోయిన విండీస్‌ను ఆదుకోవడానికి ఫస్ట్‌డౌన్ బ్యాట్స్‌మన్ ఆండ్రె ఫ్లెచర్ తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ, మిగతా బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టడంతో వెస్టిండీస్ పరుగుల వేటలో విఫలమైంది. ఫ్లెచర్ 32 బంతుల్లో 46 పరుగులు సాధించగా, రోవ్‌మన్ పావెల్ (16), కెప్టెన్ కార్లొస్ బ్రాత్‌వెయిట్ (15), ఆష్లే నర్స్ (15) జట్టును ఆదుకోలేకపోయారు. ఫలితంగా విండీస్ 16.3 ఓవర్లలో 9 వికెట్లకు 124 పరుగులు చేయగలిగింది. ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు గాయపడిన కారణంగా షాయ్ హోప్ బ్యాటింగ్‌కు దిగలేదు.

న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా టెస్టులతో మొదలైన వెస్టిండీస్ పరాజయాల పరంపర చివరి వరకూ కొనసాగింది. మొదటి టెస్టును ఇన్నింగ్స్ 67 పరుగుల తేడాతో కోల్పోయిన విండీస్ రెండో టెస్టులో 240 పరుగుల భారీ తేడాతో పరాజయాన్ని ఎదుర్కొంది. ఫలితంగా టెస్టు సిరీస్‌లో 0-2 తేడాతో వైట్‌వాష్ వేయించుకుంది. మొదటి వనే్డలో ఐదు వికెట్లు, రెండో వనే్డలో 204 భారీ తేడాతో ఓటమిపాలైంది. డక్‌వర్త్ లూయిస్ విధానంలో ఫలితాన్ని తేల్చాసివచ్చిన చివరి, మూడో వనే్డను 66 పరుగుల తేడాతో కోల్పోయింది. దీనితో వనే్డ ఇంటర్నేషనల్స్ సిరీస్‌లోనూ విండీస్‌కు క్లీన్‌స్వీప్ (0-3) తప్పలేదు. కాగా, టీ-20 ఇంటర్నేషనల్స్‌లో మొదటి మ్యాచ్‌ని 47 పరుగుల తేడాతో చేజార్చుకున్న విండీస్‌ను రెండో మ్యాచ్‌ని వర్షం ఆదుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 9 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఈ దశలో భారీ వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. చివరికి మ్యాచ్‌ని రద్దు చేసినట్టు అంపైర్లు ప్రకటించారు. ఇక చివరిదైన మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ 119 పరుగుల భారీ ఆధిక్యంతో గెలవగా, విండీస్ ఈ సిరీస్‌ను 0-2 తేడాతో కోల్పోయింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: 20 ఓవర్లలో 5 వికెట్లకు 243 (మార్టిన్ గుప్టిల్ 63, కొలిన్ మున్రో 104, టామ్ బ్రూస్ 23, కేన్ విలియమ్‌సన్ 19, కార్లొస్ బ్రాత్‌వెయిట్ 2/50, జెరోమ్ టేలర్ 1/53, రయాద్ ఎమ్రిట్ 1/42).

వెస్టిండీస్ ఇన్నింగ్స్: 16.3 ఓవర్లలో 9 వికెట్లకు 124 (ఆండ్రె ఫ్లెచర్ 46, రోవ్‌మన్ పావెల్ 16, కార్లొస్ బ్రాత్‌వెయిట్ 15, ఆష్లే నర్స్ 14, జెరోమ్ టేలర్ 13, షాయ్ హోప్ గాయం కారణంగా బ్యాటింగ్ చేయలేదు, టిమ్ సౌథీ 3/21, ట్రెంట్ బౌల్ట్ 2/29, ఇష్ సోధీ 2/25).

తుది పోరాటానికి సన్నాహాలు..


ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టు కోసం సమాయత్తమవుతున్న ఇంగ్లాండ్ క్రికెటర్లు. ఈ మ్యాచ్ గురువారం నుంచి సిడ్నీ మైదానంలో మొదలవుతుంది

క్రిస్ వోక్స్‌కు ఫిట్నెస్ సమస్య
చివరి టెస్టులో ఆడడని ప్రకటించిన రూట్

సిడ్నీ, జనవరి 3: ఫాస్ట్ బౌలర్ క్రిస్ వోక్స్ గురువారం నుంచి ప్రారంభం కానున్న యాషెస్ సిరీస్ చివరి టెస్టులో ఆడడం లేదని ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ తెలిపాడు. బుధవారం నెట్ ప్రాక్టీస్ ముగిసిన తర్వాత అతను విలేఖరులతో మాట్లాడుతూ వోక్స్ పక్కటెముకల వద్ద కండరాలు పట్టుకున్నాయని, దీనితో అతను ఇబ్బంది పడుతున్నాడని అన్నాడు. వోక్స్ జట్టులోని లేని కారణంగా, 20 ఏళ్ల యువ లెగ్ స్పిన్నర్ మాసన్ క్రేన్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఉంటాడని చెప్పాడు. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో మొదటి మూడు టెస్టులను కోల్పోయిన ఇంగ్లాండ్ 0-3 తేడాతో సిరీస్‌ను చేజార్చుకున్న విషయం తెలిసిందే. వర్షం కారణంగా పలుమార్లు ఆటకు అంతరాయం ఏర్పడిన నాలుగో టెస్టు చివరికి డ్రాగా ముగిసింది. చివరిదైన ఐదో టెస్టులో విజయం సాధించడం ద్వారా కొంతైనా పరువును నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్న ఇంగ్లాండ్‌కు వోక్స్ అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే విషయమే. అయితే, క్రేన్ సమర్థుడని, టెస్టు కెరీర్‌ను ప్రారంభించనున్న అతను తన ప్రయత్నంలో సఫలమవుతాడన్న నమ్మకం తనకు ఉందని రూట్ అన్నాడు. చివరి టెస్టులో ఆస్ట్రేలియాకు గట్టిపోటీనిస్తామని, విజయం కోసం శ్రమిస్తామని చెప్పాడు.

స్టార్క్ వచ్చేస్తాడు
ఆస్ట్రేలియా కెప్టెన్ స్మిత్ ప్రకటన


నెట్స్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్

సిడ్నీ, జనవరి 3: ఇంగ్లాండ్‌తో జరిగిన యాషెస్ సిరీస్ నాలుగో టెస్టులో కాలి మడమ గాయం కారణంగా ఆడలేకపోయిన ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ చివరిదైన ఐదో టెస్టులో ఆడనున్నాడు. అతను నెట్స్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా బౌల్ చేశాడని, చివరి టెస్టులో ఆడే ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఉంటాడని ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ తెలిపాడు. బుధవారం నెట్స్ అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ, స్టార్క్ ఎలాంటి సవాళ్లకైనా సిద్ధంగా ఉన్నాడని చెప్పాడు. జట్టులోని రెండో స్పిన్నర్ అస్టన్ అగర్‌కు అవకాశం ఉండకపోవచ్చని పేర్కొన్నాడు. సిడ్నీ పిచ్‌ని పరిశీలించిన తర్వాత, ఒకే స్పిన్నర్‌తో చివరి టెస్టు ఆడాలని భావిస్తున్నట్టు చెప్పాడు. అయితే, ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని అన్నాడు. వికెట్‌పై పచ్చిక ఎక్కువగా ఉంది కాబట్టి బంతి స్వింగ్ అవుతుందని తెలిపాడు. ఇలాంటి పిచ్‌లపై ఫాస్ట్ బౌలర్లు బాగా రాణిస్తారని, ఈ సిరీస్‌లో ఇంత వరకూ 604 పరుగులు చేసిన స్మిత్ అన్నాడు. ఇలావుంటే, 1936-37 యాషెస్ సిరీస్‌లో 810 పరుగులు చేసి సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ నెలకొల్పిన రికార్డును స్మిత్ అధిగమించడం కష్టమైనప్పటికీ, అసాధ్యం మాత్రం కాదని పరిశీలకులు అంటున్నారు.

ఆధిపత్యం కొనసాగేనా?
దక్షిణాఫ్రికా టూర్‌లో టీమిండియా పరిస్థితిపై ఉత్కంఠ

కేప్ టౌన్, జనవరి 3: సుమారు మూడేళ్లుగా తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరచిన టీమిండియా అదే ఆధిపత్యాన్ని దక్షిణాఫ్రికా టూర్‌లోనూ కొనసాగిస్తుందా లేదా అన్నది ఉత్కంఠ రేపుతున్నది. నిజానికి 2015 జనవరి ఒకటి నుంచి ఇప్పటి వరకూ భారత్ ఎదురులేని జట్టుగా పేరు సంపాదించింది. చాంపియన్స్ ట్రోఫీని మినహాయిస్తే, దాదాపుగా ఆడిన ప్రతి సిరీస్‌నూ, టోర్నీనీ గెల్చుకొని, తనకు తానే సాటి అని నిరూపించుకుంది. లండన్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్ చేరినప్పటికీ, తుది పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ చేతిలో ఓడడం ఒక్కటే గత మూడేళ్ల కాలంలో భారత్‌కు చేదు అనుభవాన్ని మిగిల్చింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2015 వరల్డ్ కప్‌లో సెమీ ఫైనల్ వరకూ వెళ్లిన భారత్, గత ఏడాది ప్రపంచ టీ-20 చాంపియన్‌షిప్‌లోనూ సెమీస్ చేరింది. మూడేళ్ల కాలాన్ని పరిశీలిస్తే, టీమిండియా టెస్టు ఫార్మాట్‌లో తొమ్మిది సిరీస్‌లను గెల్చుకుంది. ఒక సిరీస్‌ను డ్రా చేసుకుంది. మొత్తం మీద 12 ద్వైపాక్షిక సిరీస్‌ల్లో తొమ్మిది విజయాలను నమోదు చేసింది. మూడు సిరీస్‌లను చేజార్చుకుంది. ఈ మూడు సిరీస్‌లు వరుసగా బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో 2015లో జరిగినవే. అంటే, 2016, 2017 సంవత్సరాల్లో భారత్ ఒక్క సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ఈకాలంలో ఎనిమిది సిరీస్‌లు ఆడి, అన్నింటినీ తన ఖాతాలో వేసుకుంది. టీ-20 ఇంటర్నేషనల్స్ ఫార్మాట్‌లో కొంత వెనుకబడినప్పటికీ, మొత్తం 13 సిరీస్‌ల్లో ఎనిమిది విజయాలను సాధించగలిగింది. రెండు సిరీస్‌లు డ్రాకాగా, మూడు సిరీస్‌ల్లో మాత్రమే పరాజయాలను ఎదుర్కొంది. ఇందులో రెండు పర్యాయాలు భారత్‌పై వెస్టిండీస్ విజయాలను నమోదు చేసింది. మరొకటి, దక్షిణాఫ్రికా చేతిలో, 2015లో, మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలో ఎదురైంది.

మొత్తం మీద 2015 జనవరి ఒకటి నుంచి భారత్ అన్ని ఫార్మాట్స్‌లో కలిపి 135 మ్యాచ్‌లు ఆడింది. వాటిలో 87 మ్యాచ్‌ల్లో విజయాలు సాధించింది. 36 మ్యాచ్‌లను కోల్పోయింది. తొమ్మిది మ్యాచ్‌ల్లో ఫలితాలు తేలలేదు. మూడు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. అంటే, టీమిండియా 64.44 శాతం మ్యాచ్‌లను గెల్చుకుంది. అదే కాలానికి గణాంకాలను పరిశీలిస్తే, భారత్ తర్వాత న్యూజిలాండ్ రెండో స్థానంలో ఉంది. ఆ జట్టు 118 మ్యాచ్‌లు ఆడి, 69 విజయాలు సాధించింది. దక్షిణాఫ్రికా 116 మ్యాచ్‌ల్లో 68 మ్యాచ్‌లను కైవసం చేసుకుంది. ఈ గణాంకాలే భారత్ ఆధిపత్యం ఏ తీరులో కొనసాగిందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ ర్యాంకింగ్స్ టెస్టు ఫార్మాట్‌లో నంబర్ వన్ స్థానంలో నిలిచిన భారత్ వనే్డల్లో రెండు, టీ-20 ఇంటర్నేషనల్స్ ఫార్మాట్‌లో మూడు స్థానాల్లో ఉంది.

కోహ్లీ నాయకత్వంలో గత ఏడాది భారత్ అద్వితీయ ప్రదర్శనతో ఆకట్టుకుంది. అన్ని ఫార్మాట్స్‌లో కలిపి 47 మ్యాచ్‌లు ఆడి, 38 విజయాలు సాధించింది. వీటిలో 30 వనే్డలుకాగా, 8 టెస్టులు. ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక విజయాల జాబితాలో భారత్ రెండో స్థానాన్ని ఆక్రమించింది. 2003లో ఆస్ట్రేలియా జట్టు అన్ని ఫార్మాట్స్‌లో కలిపి 53 మ్యాచ్‌లు ఆడి, 37 విజయాలను నమోదు చేసింది. ఇందులో 7 టెస్టులు, 21 వనే్డలు కాగా, మిగతా 9 టీ-20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు. ఏ రకంగా చూసినా, గత ఏడాదిపై తనదైన ముద్ర వేసిన టీమిండియాకు, కొత్త సంవత్సరం ప్రారంభంలోనే సిసలైన పరీక్ష ఎదురుకానుంది. బలమైన టెస్టు జట్లలో ఒకటైన దక్షిణాఫ్రికా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. మొదటి రెండు స్థానాల మధ్య జరిగే టెస్టు సిరీస్ సహజంగానే అందరి దృష్టినీ ఆకట్టుకుంటుంది. టీమిండియాను తక్కువ అంచనా వేయడానికి వీల్లేకపోయినా, దక్షిణాఫ్రికాలో ఆడాల్సి రావడం వల్ల కొన్ని సమస్యలు తప్పకపోవచ్చు. అక్కడి వాతావరణానికి, పిచ్‌ల తీరుకు ఆటగాళ్లు ఎంత త్వరగా అలవాటు పడతారనే అంశంపైనే భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌తోపాటు ఆరు మ్యాచ్‌ల వనే్డ, మూడు మ్యాచ్‌ల టీ-20 ఇంటర్నేషనల్ సిరీస్‌లను కూడా టీమిండియా ఆడుతుంది. అక్కడి నుంచి తిరిగి వచ్చిన తర్వాత, శ్రీలంక, బంగ్లాదేశ్ కూడా పాల్గొనే ముక్కోణపు వనే్డ ఇంటర్నేషనల్ టోర్నీలో ఆడుతుంది. అనంతరం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఉంటుంది. టీమిండియాకు ఎంపికైన లేదా ఎంపికయ్యే ఆటగాళ్లంతా దాదాపుగా ఏదో ఒక ఫ్రాంచైజీ తరఫున ఐపీఎల్‌లో ఆడడం ఖాయం. ఐపీఎల్ ముగిసిన వెంటనే భారత జట్టు కోసం మరోసారి సవాలుగా నిలిచే ఇంగ్లాండ్ పర్యటన ఎదుచూస్తున్నది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఇంగ్లాండ్‌లో టీమిండియా మూడు టీ-20, మూడు వనే్డ ఇంటర్నేషనల్స్‌తోపాటు ఐదు టెస్టు మ్యాచ్‌లు ఆడుతుంది. ఆతర్వాత, ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లి, అక్కడ బార్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం టెస్టు సిరీస్ ఆడుతుంది. ఒక రకంగా చెప్పాలంటే, 2017లో భారత జట్టు ఎక్కువ మ్యాచ్‌లు స్వదేశంలో ఆడితే, ఈ ఏడాది అందుకు భిన్నంగా విదేశాల్లో ఆడుతుంది. స్వదేశంలో ప్రత్యర్థి జట్లపై విరుచుకుపడే భారత్ విదేశాల్లో చేతులెత్తేస్తుందనే విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. 1992లో మొదటిసారి దక్షిణాఫ్రికాతో ద్వైపాక్షిక సిరీస్ ఆడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ దక్షిణాఫ్రికాలో సఫారీలపై ఒక్క టెస్టు సిరీస్‌ను కూడా గెల్చుకోలేకపోయింది. ఇంత వరకూ అందని టెస్టు సిరీస్‌ను కోహ్లీ సేన సాధించుకొని తిరిగి వస్తుందా? లేక గతంలో మాదిరిగానే రిక్త హస్తాలతో వెనుదిరుగుతుందా? అనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. కేప్ టౌన్‌లో ఈనెల ఐదు నుంచి మొదలయ్యే మొదటి టెస్టుతో ఆరంభం కానున్న పోరు ఉత్కంఠగా సాగడం ఖాయం.

ధావన్ ఫిట్..
జడేజాకు జ్వరం..



కేప్ టౌన్, జనవరి 3: భారత ఓపెనర్ శిఖర్ ధావన్ కాలి మడమ నొప్పి నుంచి కోలుకున్నాడు. శుక్రవారం నుంచి దక్షిణాఫ్రికాతో ఇక్కడ జరిగే మొదటి టెస్టు మ్యాచ్‌కి అతను అందుబాటులో ఉంటాడు. అయితే, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా జ్వరంతో బాధపడుతున్న కారణంగా, అతని పేరును పరిశీలించే అవకాశాలు లేవు. ధావన్ పూర్తి ఫిట్నెస్‌తో ఉన్నాడని, మురళీ విజయ్‌తో కలిసి అతను ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తాడని భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. జడేజా అనారోగ్యంతో బాధపడుతున్నాడని పేర్కొంది. అక్కడే ఉన్న నిపుణుల బృందం అతనికి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నదని తెలిపింది. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, అసరమైన సూచనలు చేస్తున్నట్టు తెలిపింది.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

చెన్నై చిన్నెలకు వన్నెలు!

■ హేమలత కాన్వాస్‌పై 'చారిత్రక ఆనవాళ్లు'

చరిత్రలో కనుమరుగైన ప్రదేశాలు, కట్టడాలు మన ముందు బొమ్మల రూపంలో ఆవిష్కృతమైతే ఎలా ఉంటుంది. ఒక్కసారి సంభ్రమాశ్చర్యాలకు లోనవుతాం. ఆనాటి జీవన విధానం ఇలా ఉండేదా అని కళ్లు ఇంత చేసుకుని చూస్తాం. కనుమరుగవుతున్న చారిత్రక ప్రదేశాల ఆనవాళ్లను తన కుంచెలో బంధిస్తున్నారు హేమలత వెంకటరామన్. జ్ఞాపకాల పొరలలో పదిలంగా ఉన్న చరిత్ర ఆనవాళ్లు చెదిరి పోకుండా.. వారసత్వ సంపదకు వాస్తుశిల్పిగా మారింది ఫైన్ ఆర్ట్స్ విద్యార్థిని.









హేమలత వెంకటరామన్ కుంచె నుంచి జాలువారిన చిత్రాలలో కొన్ని..

హేమలత వెంకటరామన్ ప్రస్తుతం ఓహియో యూనివర్శిటీలో ఫైన్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ చేస్తున్నారు. అలాగే సెలవు దొరికితే చాలు మద్రాసు నగరంలో వాలిపోతుంది. అక్కడ లైబ్రరీలో కూర్చొని చరిత్రకు సంబంధించిన విషయాలను చదువుతుంది. ఆమెకు చెన్నై అంటే వల్లమాలిన ప్రేమ. ఎందుకంటే దేశంలో మరెక్కడా లేనటువంటి చారిత్రక భవనాలు చెన్నైలో ఉన్నాయి. అందుకే సెలవు దొరికితే ఇక్కడకు వచ్చేస్తుంది. ఆమె నగరంలోని విభిన్న చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలను సందర్శిస్తోంది. ఇప్పటికే 'మద్రాస్ ఇన్ మిని' అనే శీర్షికతో తన హృదయాన్ని ఆకట్టుకున్న స్థలాలను స్కెచ్లు గీసేసింది. ఈ స్కెచ్లు బహుళ ప్రజాదరణ పొందాయి. 'మద్రాస్ క్యాటలాగ్' అనే సిరీస్‌ను ప్రారంభించి మద్రాసు నగరం, దాని పట్ల ప్రజలు కనబరచే ప్రేమను తెలియజేస్తూ చిత్రాలను సోషల్ మీడియాలో ఉంచింది. మద్రాసు నగర ప్రజలతో మమేకమై వారు చెప్పిన విషయాల ఆధారంగా కూడా ఆనాటి ప్రజల జీవన విధానంపై బొమ్మలు గీస్తుంది. పూల విక్రయదారులు, వాచ్‌మెన్లు, కొంత మంది పెద్దవారే ఆమె బొమ్మలకు వనరులంటే అతిశయోక్తి కాదు. గంటల తరబడి బొమ్మలు గీస్తుంటే ఆ ప్రాంతవాసులు ఆమె ఓపికను ప్రశంసిస్తూ ఆశ్రయం ఇచ్చేవారూ లేకపోలేదు. అందుకే మద్రాసు వాసులు అంటే హేమలతకు అభిమానం. మద్రాసులోని చారిత్రక ప్రదేశాలపై ఆమె డాక్యుమెంటరీని సైతం రూపొందించారు.

గంటల కొద్దీ నిరీక్షణ..

ఓ స్కెచ్ రూపొందాలంటే కొన్ని గంటల సమయం కేటాయించాల్సిన అవసరం ఉంది. పొడవైన స్కెచ్ వేయలంటే కనీసం ఏడున్నర గంటల సమయం పడుతోంది. అక్కడ ప్రజలు చెప్పే విషయాలను ఆకళింపు చేసుకుని అక్కడే వారితో పాటే ఉంటూ ఆమె స్కెచ్ గీస్తుంది. జిమ్నాస్ట్‌గా దేశంలో వివిధ ప్రాంతాలను సందర్శించాను. కాని మద్రాసువాసులు చూపించే అభిమానం మరెక్కడ దక్కదని, అందుకే వారితో ముచ్చటించిన అంశాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పెడుతుంటానని హేమలత చెబుతున్నారు.

కొత్త ప్రాజెక్టుకు రూపకల్పన..

ఇపుడు హేమలత 'టీబ్యాగ్ ఆర్ట్ 100 డేస్' పేరుతో మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది. టీ బ్యాగ్‌లతో ఇంక్, వాటర్ కలర్స్ ఉపయోగించి స్కెచ్‌లు వేస్తుంది. హేమ ఇటీవలే కొలంబస్‌లో తన పెయింటింగ్స్‌తో ఎగ్జిబిషన్ సైతం ఏర్పాటు చేసింది. 'స్ట్రీట్ ఆఫ్ స్మైల్స్' అనే బ్లాగును నడుపుతూ.. కవిత్వాలను ఆ బ్లాగులో పొందుపరుస్తుంది. తన అంతిమ లక్ష్యం పెయింటింగ్ కళతో కమ్యూనిటీలను ఏకీకృతం చేయటం. విభిన్న సంఘాల ప్రజలు వారి చరిత్రను తెలుసుకోవాలనుకుంటే తనకు సహకరించాలని హేమ కోరుతుంది.

ఆయా కమ్యూనిటీల సామాజిక, సాంస్కృతిక ప్రాజెక్టులకు వారధిగా పనిచేస్తానని అంటున్నారు. మరింత మంది చరిత్రకారులను కలుసుకుని వారు వెలిబుచ్చిన అభిప్రాయాలతో పాటు చరిత్రకు సంబంధించిన చిత్రాలను పొందుపరచి ఒక కాఫీ టేబుల్ పుస్తకాన్ని తీసుకురావాలనే ఆశయంతో ఉన్నానని, ఈ పనులన్నీ కూడా మాస్టర్ డిగ్రీ చేతికి వచ్చిన తరువాతే అని చెబుతోంది.

నేను వేసే పెయింటింగ్స్‌కు పెన్, ఇంక్, వాటర్ కలర్స్, స్కెచ్ పెన్నులను ఉపయోగిస్తాను. ప్రస్తుతం నా అభిరుచి హిందూ మతం, పురాణశాస్త్రాలకు సంబంధించిన పాత్రల స్కెచ్ల శ్రేణిని రూపొందించాలనుకుంటున్నాను. ఒక వాస్తుశిల్పిగా చారిత్రక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషిచేస్తున్నాను. సంక్షిప్త చరిత్రను వారి కళ్ల ముందు ఉంచుతాను. సాంస్కృతిక పునర్జీవనాన్ని సృష్టించటమే ధ్యేయం.

-హేమలత వెంకటరామన్





వార్త-వ్యాఖ్య

-వీరాజీ

స్కూళ్లలో తల్లిదండ్రుల పూజకో రోజు!



జార్ఖండ్ రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం నుంచి గవర్నమెంటు స్కూల్స్‌లో ఏడాదికోరోజు తల్లినీ తండ్రినీ పూజ చేసే రోజుగా కేటాయిస్తూ విద్యా శాఖమాత్యురాలు శ్రీమతి నీరాయాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో నలభై వేల ప్రభుత్వ పాఠశాలలున్నాయి. దీనిని 'మాత్రి పిత్రి దివస్' అంటారు. మొత్తం యాభై లక్షలమంది విద్యార్థులు ఇక ఏటా పేరెంట్స్ డే చేసుకుంటారు. ఆమాటకొస్తే, పక్కనున్న చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో 2015లోనే వాలైంటైన్స్ డేని ఎత్తేసి 'అమ్మా నాన్నల పూజ రోజు' అంటూ అమలు చేస్తున్నారు. ఐతే అది చూసి కాదు మన రాష్ట్రంలోనే గిరంధి జిల్లాలోని లోక్ నాయక్ ఎయిడెడ్ స్కూలులో పిల్లలందరూ మొన్న ఇరవై తేదీనాడు తల్లికి తండ్రికీ పూలదండలు వేసి హారతి ఇచ్చి పాదాలకు దండం పెట్టడం సభ చూశానని- అదే స్ఫూర్తితో మన రాష్ట్రం అంతటా కూడా మాత్రి పిత్రి దివస్ పెడుతున్నామని, తేదీ త్వరలో ప్రకటిస్తామని నీరాజీ చెప్పారు. ఐడియా బాగుంది, ఇంగ్లీషు మదర్స్ డే ఎత్తేసి ఇది పెడితే సరి- నాన్న కూడా మురిసిపోతాడు!

లక్కీ 'న్యూ ఇయర్' పాప!



కొత్త సంవత్సరం 2018లో అర్థరాత్రి చెవులు చిల్లులు పడే హ్యాపీ న్యూఇయర్ కేక్‌లమధ్య బంగలూరులోని రాజాజీనగర్‌లోని డాక్టర్ నాగరాజా మెమోరియల్ ఆసుపత్రిలో పుష్పా అనే మధ్యతరగతి ఇల్లాలు ఆడపిల్లకి జన్మనిచ్చింది. బాలిక క్యార్ క్యార్‌లే హ్యాపీ న్యూఇయర్ అనుకున్నారు కాని, తండ్రి ఎం.గోపి మొహం అంత వికసించలేదు కాని, మర్నాడు పొద్దున్నే సిటీ మేయర్ గారొచ్చారు పాపని చూద్దామని. తల్లి సంభ్రమాశ్చర్యంగా పాపని అందించింది. మేయరు వెనుకనే డిప్యూటీ మేయరమ్మ కూడా లక్ష్మి పుట్టింది అని ముద్దాడారు. నా బొంద అనుకున్నాడు తండ్రి. కాని మేయరుగారు ఐదు లక్షల రూపాయల చెక్కుని ప్రెజెంటు చేశారు.. దీని చదువుకోసం అన్నారు.

ఆసుపత్రి అంతా సంతోషించారు. అసలు సంగతి ఏమిటీ అంటే- న్యూ ఇయర్ ఘడియలతోనే మునిసిపల్ పరిధి ఆసుపత్రిలో పుట్టిన ఆడపిల్లలకి ఐదు లక్షల ఎడ్యుకేషనల్ సాయం నగదుగా ఇస్తామని, బృహన్ బంగాలూరు మునిసిపల్ అధికారులు ప్రకటించారు. ఈ పైకం పేరెంట్స్ కమిషనరుల జాయింట్ అకౌంట్లో వేశారు. బళ్ళో వేశాక ఇస్తారు. అదృష్టలక్ష్మి అని పేరెట్టండి అన్నారంతా..

veeraji.pkm@gmail.com

వాయు కాలుష్యం కాటు...

అధిక రక్తపోటు, సిగరెట్లు తాగటం, పోషకాహార లోపం వల్ల ప్రపంచంలో అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయి. వాయు కాలుష్యం వల్ల ఏటా భారత్‌లో 14 లక్ష ల మంది మృత్యువాతపడుతున్నారు. వాతావరణ కాలుష్యం మనిషి జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దాదాపు 188 దేశాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ కాలుష్యం మనిషిలో అధిక రక్తపోటుకు కారణమవుతోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. తాజా అధ్యయనాల వల్ల ఇది గుండెకు కూడా చేటు తెస్తుందని వెల్లడైంది. గాలిలోని కార్బన్‌డైఆక్సైడ్, దుమ్మూధూళీ తదితరమైనవి రక్తపోటుకు దారితీస్తున్నాయి. గాలి కాలుష్యం అధికంగా ఉంటే వీరిలో రక్తపోటు లెవెల్స్‌లో మార్పు వస్తున్నట్లు పరిశోధకులు సైతం గమనించారు.

ఆత్మీయత కోల్పోతున్న అనుబంధాలు!

• పెద్దలు దారితప్పితే.. పిల్లలదీ చెడుమార్గమే • అవగాహన లేమితో కుటుంబాలే విచ్ఛిన్నం

'ఉదయాన్నే అమ్మ పిలిచే ముద్దు పిలుపు మనకు లేదు.. బడికి బండిపై తీసుకెళ్లే నాన్న ఇక లేడు, రాడు అనే విషయాన్ని అర్థం చేసుకోలేని చిన్న వయస్సులో వారిని ఒంటరి వాళ్లను చేసి తమ స్వార్థానికి, తాత్కాలిక సుఖాలకు, సంతోషాలకు తల్లిదండ్రులు తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలు భవిష్యత్ తరానికి బాటలు వేయాల్సిన చిన్నారులను అనాథలుగా మార్చేస్తున్నాయి. దీనికి సమాజంలో పెరుగుతున్న వెర్రిపోకడలు, విచ్చలవిడితనాలే కారణమని చెప్పవచ్చు. పూర్వకాలంలో పెళ్ళి అనే బంధానికి చాలా విలువ, దానికి కట్టుబడి ఉండాలనే తపన ఇద్దరిలోనూ ఉండేది. రానురాను పెళ్లి అనేది ఒక ఈవెంట్‌లా మారిపోయింది. అప్పటివరకూ ఒకరంటే ఒకరికి ఉన్న వల్లమాలిన ప్రేమ పార్కుల్లో, సినిమా థియేటర్లలో, షాపింగ్ మాల్స్‌లోనూ తిరిగినప్పుడు కనిపిస్తుంది. సడన్‌గా అది మూడు ముళ్ల బంధంగా మారి మూడుమూర్ల పసుపు తాడుగా మెడలో పడినప్పటి నుండి ఇద్దరిలోనూ వైరుధ్యాలు మొదలవ్వడానికి కారణం ఏమిటి? అప్పటివరకూ ఇద్దరికీ ఒకరిలో ఒకరికి కనపడని లోపాలు ఉన్నట్టుండి తెరమీదకు ఎలా వస్తాయి? ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ, యాంత్రిక జీవనం సాగిస్తున్న నేటి రోజుల్లో వీకెండ్ పార్టీలంటూ పబ్‌లకూ, క్లబ్‌లకూ వెళ్లి సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. అలా కాకుండా వారమంతా కష్టపడిన భార్యాభర్తలు మనసు విప్పి మాట్లాడుకోడానికి దొరికిన ఆ కొద్ది సమయాన్ని సద్వినియోగం చేసుకోకపోవడంతో మనస్పర్థలు విత్తనంలా మొదలై.. వృక్షంలా మారి చివరకు అర్థం లేని అపార్థాలతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు నేటి యువజంటలు.



ఒక బిడ్డ కలిగి వాడు పెద్దవుతుంటే వారి మధ్య ప్రేమానురాగాలు పెరగడానికి బదులుగా బిడ్డ బాధ్యతలపై ఇద్దరూ వంతులు వేసుకుంటున్నారు. ఇలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లల మానసిక పరిపక్వత ఏవిధంగా ఉంటుంది? సృష్టించే భగవంతుడు ప్రతి ఒక్కరినీ ఏదో ఒక ఉన్నతమైన ఆశయంతోనే జీవం పోస్తాడు. అలాంటప్పుడు దానికి మార్గం చూపించాల్సిన తల్లిదండ్రులే పెడదోవ పడుతుంటే వాళ్లు ఎటెళ్లాలో.. ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో పెరుగుతున్నారు. ఈ వాతావరణంలో పెరిగిన పిల్లలు సన్మార్గాన్ని ఎంచుకోడానికి బదులు చెడుమార్గానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నది మేధావులు చెబుతున్న మాట.

అగ్నికి ఆజ్యం పోసినట్లు సోషల్ మీడియా

ఇది నాణానికి ఒకవైపు అయితే, మరోవైపు ఇటీవలి కాలంలో అనేక ప్రసార మాధ్యమాల్లో వస్తున్న క్రైమ్ కథలు, ఆ నేపథ్యంతో వస్తున్న సినిమాలు యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. ప్రసారం చేసే వారిది సదుద్దేశ్యం అయినప్పటికీ దానిలోని నిజాన్ని కాకుండా ఆ కథనంలో అనుసరించిన విధి విధానాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చి వాటినే అనుసరిస్తున్నవారు కొందరైతే.. వాటికి కొన్ని మార్పుచేర్పులు చేసి నేరాలు, మోసాలు చేయడానికి, ఆర్థిక నేరాలకు పాల్పడటానికి వినియోగిస్తూ తమ నేరచరిత్రకు వారే శ్రీకారం చుట్టుకుంటున్నారు. మరికొందరైతే ఆడపిల్లలను మభ్యపెట్టి లోబర్చుకోడానికీ వెనుకంజ వేయడం లేదు. అగ్నికి ఆజ్యం పోసినట్లు సోషల్ మీడియా కూడా దీనికి మరింత ఊతాన్ని ఇస్తోంది. ఇలాంటి నేరాలకు నెట్టింట్లో మరింత సమాచారం దొరుకుతుంటే నేరాలకు అలవాటుపడ్డవారు చివరికి హత్యలకు, అత్యాచారాలకూ వెనుకాడడం లేదు.

బంధం గట్టిదైతే బంగారు జీవితం

ఇలాంటి సమాజం నుండి మన భవిష్యత్ తరాన్ని కాపాడుకోవాలంటే ప్రతిఒక్కరూ ముందుకు రావాలి. ముఖ్యంగా మానవతా విలువలను పెంపొందించే దిశగా అవగాహన సదస్సులు నిర్వహించాలి. జీవితం విలువను తెలియజేసేలా ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన కనీస కర్తవ్యం మన ప్రభుత్వానిది. బంధాలకున్న విలువలను ఆ సదస్సుల్లో తెలియజేయాలి. మానవ సంబంధాలు కేవలం డబ్బు సంబంధాలే కావు.. ఆత్మీయతానురాగాలను పరిమళింపజేసే అపురూప అనుబంధాలనేది అర్థమయ్యే రీతిలో చిన్నతనం నుండి వారికి తెలియజెప్పేలా పాఠాలుండాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలు తమను ఆదర్శంగా తీసుకునేలా సక్రమమైన మార్గంలో పయనించాలి. తప్పుడు మార్గంలో పయనించాలని ఆలోచన వచ్చినవారు దానికి కారణాలు ఏమిటనేది ముందస్తుగా తమను తాము ప్రశ్నించుకోవాలి. అంతేకాకుండా జీవిత భాగస్వామితో చర్చించి ఏ విషయంలో తమకు అసంతృప్తి కలుగుతోందో వారికి విడమర్చి చెప్పాలి. ఆ మార్గం నుండి బయటపడటానికి వారు ఏవిధంగా ఒకరికొకరు సహకరించుకోగలరో చర్చించుకోవాలి. భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలకు తావుండాలి తప్ప, ఆధికత్యను ప్రదర్శించాలనే ఆలోచనలకు ఎవరికి వారు స్వస్తిపలకాలి. అలాంటప్పుడు కొంత మేర సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. అప్పటికీ సమస్య ఒక కొలిక్కి రాకపోతే రిహాబిలిటేషన్ సెంటర్లు, ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లకు వెళ్ళి తమకున్న సమస్యను నిస్సంకోచంగా చెప్పుకోవాలి. సమస్యల పరిష్కారానికి మానసికవేత్తలు మార్గాన్ని చూపడమే కాకుండా మరింత మానసిక ధైర్యాన్ని పెంపొందించే అవకాశాలు ఎన్నో ఉన్నాయి. భార్యాభర్తల బంధం విడదీయరానిదిగా ఉండాలి తప్ప, గట్టిగా లాగితే తెగిపోయే దారంలా మారకూడదు. తల్లిదండ్రుల బంధం గట్టిదైతే వారు జన్మనిచ్చిన బిడ్డల బంగారు జీవితం నూరేళ్లూ మూడు పువ్వులు.. ఆరుకాయలుగా విలసిల్లుతుందని చెప్పటం నిర్వివాదాంశం.

- వసుంధర



ప్రతికూల వాతావరణంలో పెరిగిన పిల్లలు తమకంటూ ఉన్నత ఆశయాలను ఏర్పర్చుకొని, పరిపక్వత చెందటం మనం చాలా తక్కువ మందిలో చూస్తాం. పైపెచ్చు తల్లిదండ్రుల మితిమీరిన ప్రవర్తన చిన్నతనం నుండి గమనిస్తూ పెరిగిన పిల్లలు యవ్వనంలోకి అడుగుపెట్టగానే తమకంటూ విధి విధానాలను ఏర్పర్చుకోకపోగా జీవితం పట్ల అవగాహన లేకుండా చదువు పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇలాంటి దృక్పథంలో ఉన్న పిల్లలకు తల్లిదండ్రులు నీతిబోధలు చేయాలని ప్రయత్నిస్తే అది సముద్రంలో చేరిన నీటిబిందువే అవుతుంది. పైపెచ్చు నువ్వు నాకు చెప్పే స్థాయిలో లేవని తల్లిదండ్రులను ఎదిరించి చెడు సావాసాల వైపు వెళ్లి బంగారం లాంటి జీవితాన్ని, భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్న నేటి యువతరం కథలు ఎన్నో.. ఎన్నెన్నో!


ముత్యాల ముగ్గు

18 చుక్కలు
18 వరుసలు
సరిచుక్క



పి.వి.ప్రత్యూష,
ప్రశాంతి నగర్,
సెవెన్ క్రాస్ రోడ్డు,
పాయకాపురం,
విజయవాడ.

15 చుక్కలు
ఒకటి వచ్చే వరకు





ఆర్.శిల్పానాయుడు,
చోడవరం, విశాఖపట్నం.

ముగ్గులు పంపాల్సిన చిరునామా

ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500003.

★కలర్ స్కానింగ్ చేసిన ముగ్గులను JPG ఫార్మాట్‌లో bhoomika@andhrabhoomi.net కు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

వాహిని

10 ఆంధ్రభూమి గురువారం 4 జనవరి 2018



వ్యూహం

10 **అలపర్తి రామకృష్ణ**

కాఫీ కప్పులతో అన్నపూర్ణమ్మగారు హాల్లోకి వచ్చేసరికి ఆ నవ్వులు ఆగిపోయాయి.

❖❖❖

లోహిత వాళ్ళింటినుంచి తిరిగి వస్తున్నాడు స్కంద.

వనస్థలిపురం నుంచి కారు హైవే మీదకు వచ్చింది.

''నాన్న పర్సనాలిటీ నాకు వచ్చిందా?'' అడిగాడు స్కంద.

''ఇప్పుడా విషయాలు ఎందుకు'' అసహనంగా కదులుతూ అంది మానస.

''మీ నాన్న రూపం నీకు వచ్చిందిరా మనవడా? కానీ ఆయన బుద్ధులు రాలేదు.. చాలా సంతోషం!'' అన్నాడు తాతయ్య ఈమధ్య? అది నిజమేనా?

''మనస్సు అందంగా వుండాలి.. ఆ సొగసు ఎప్పటికీ మాయదు.. బాహ్య రూపం శాశ్వతంగా ఒకేలాగా ఉండదు.. మీ నాన్నది క్రుకెడ్ మెంటాలిటీ.. బుద్ధి మంచిది కాదు.. సంపద మీదే ఆయన దృష్టి.. మనుషులమీద ఉండదు'' అందామె.

''మీ ఇద్దరికీ ఎక్కడ పరిచయం ఏర్పడింది? నాన్ననే పెళ్లి చేసుకోవాలన్న ఆలోచన ఎందుకు కలిగింది?''

''మంగళూరులో ఎంబిబిఎస్ చదివే రోజుల్లో పరిచయం ఏర్పడింది. నేను కన్నడ అమ్మాయిని.. మా నాన్నగారు బెంగుళూరులో రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసి బాగా సంపాదించారు.. మాది సంపన్న కుటుంబమని తెలిసి పరిచయం పెట్టుకున్నాడు మీ నాన్న. పిజి కూడా అక్కడే చేశాం.. చదువు పూర్తి అయ్యేక అతనే ప్రపోజ్ చేశాడు పెళ్లి చేసుకుందామని.. 'ఇద్దరం ఒకే ప్రొఫెషన్.. పెళ్లి చేసుకుంటే బాగుంటుందని' అన్నాడు. సరేనన్నాను. పెళ్లి అయ్యేక ప్రతిదానికి విసుక్కునేవాడు కారణం లేకుండానే! అతని ప్రవర్తన నచ్చలేదు. విడాకులు తీసుకుందాం అన్నాడు. దానిక్కూడా 'సరే'నన్నాను. మీ నాన్న నేను విడిపోయి ఇరవై ఎనిమిది సంవత్సరాలవుతుంది...'' నిట్టూర్పు విడుస్తూ అంది మానస.

ఆమె మనస్సుకు నచ్చని విషయాలు కదిలించి బాధపెట్టాలని అతని ఉద్దేశ్యం కాదు.. తండ్రి వివరాలు తెలుసుకుందామనే అతని తాపత్రయం.. ఆయన స్వగ్రామం కొత్తగూడెం అని అమ్మ అంతకుముందోసారి మాటల్లో చెప్పింది.

తన ఇన్వెస్టిగేషన్‌కు ఆ వివరాలు అవసరం.

❖❖❖

నాగులపాడులో పోలీస్ జీప్ ఆగింది.

''డాక్టర్ మౌర్యగారి ఇల్లు ఎక్కడ?'' అడిగాడు జీప్ డ్రైవర్.

ఆ వూళ్ళో డాక్టరు చదువు చదివింది ఒక్కరే!

''అదిగో బాబూ రామాలయం ఎదురుగా వున్న ఇల్లే! ఇంటి ముందు మర్రి చెట్టు కన్పిస్తుంది కదా! అదే ఇల్లు!'' రోడ్డుమీద వెళ్తున్న వ్యక్తి డాక్టరుగారి ఇల్లు చూపించాడు.



మర్రి చెట్టు నీడలో జీప్ ఆపాడు.

జీపు దిగి ఇంట్లోకి నడిచాడు స్కంద.

మౌర్య భార్యను, తల్లిదండ్రులను పరామర్శించడానికి వచ్చిన బంధువులు హాల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

''దేవుడిలాంటి మనిషి.. ఆపదలో వున్నవాళ్ళను ఆదుకునేవాడు.. తనసొంత ఖర్చుతో ఎంతోమందికి పెళ్ళిళ్ళు చేశాడు.. ఉద్యోగాలు ఇప్పించేవాడు.. పేదవాళ్ళకు ఆర్థిక సహాయం చేసేవాడు.. చేతికి ఎముక లేదు మహారాజుకు'' మౌర్యను పొగుడుతూ వున్నాడు ఓ బంధువు.

ఆ మాటలు వింటుంటే మౌర్య భార్యకు మరింత దుఃఖం పొర్లుకు వచ్చింది.

హాల్లో అడుగుపెట్టిన స్కందకు ఎదురుగా గోడకు తగిలించిన మౌర్య ఫొటో కన్పించింది. గంభీరంగా హాల్లో వున్నవాళ్ళను ఆప్యాయంగా చూస్తున్నట్లు కన్పించాడు ఫొటోలో.

''ఎవరు కావాలి బాబూ?'' స్కందను అడిగాడు డెబ్భైయ్యేళ్ళ వున్న వ్యక్తి.

''మీరు డాక్టర్ మౌర్యకు ఏమవుతారు?' ఆ పెద్దాయన్ని అడిగాడు.

''నా కొడుకే బాబూ! నా తలకు కొరివి పెడతాడనుకుంటూ వుండేవాడిని. వాడి తలకు నేను కొరివి పెట్టాల్సి వచ్చింది?''

''ఎలా చనిపోయాడు?''

''ఈత కొడుతూ నీళ్లల్లో మునిగి చనిపోయాడని హాస్పిటల్ వాళ్లు శవాన్ని తెచ్చి ఇంటిముంద వరండాలో పడేశారు.. వెంటనే దహన క్రియలు జరిపించమని నామీద ఒత్తిడి తెచ్చారు. మా అబ్బాయికి ఈత కొట్టడం బాగానే వచ్చు.. నీళ్ళలో ఎలా మునిగి చనిపోయాడో అర్థం కావడంలేదు'' అన్నాడు మౌర్య తండ్రి.

''నేను పోలీసు డిపార్టుమెంటు నుంచి వస్తున్నాను.. మీ అబ్బాయి మరణం అసహజంగానే తోస్తున్నది. మాకు ఏవో కొన్ని అనుమానాలు వున్నాయి.. వాటిని నివృత్తి చేసుకోవడానికి మీ దగ్గరకు వచ్చాను.. మీ అబ్బాయి గూర్చి వివరాలు చెప్పాలి మీరు''.

''మేడ మీద మా అబ్బాయి గది వుంది.. అక్కడ కూర్చుదాంరా బాబూ!''

మేడమీద గదికి స్కందను తీసుకువెళ్ళి మౌర్యకు సంబంధించిన పుస్తకాలు, పేపర్లు, మెడికల్ జర్నల్స్‌లో అతను రాసిన వ్యాసాలు చూపించాడు. అవన్నీ చూసేక మంచి బ్రిలియంట్ డాక్టరని అర్థమయ్యింది. మాఫియా గ్యాంగు చేతుల్లో పడి శలభంలా మాడిపోయాడని అనుకున్నాడు స్కంద.

''మీ అబ్బాయికి డ్రగ్స్ అలవాటువుందా? మాదక ద్రవ్యాలు మత్తును కలిగించేవి తీసుకునే వాడా?''

''లేవు బాబూ! సిగరెట్ కూడా తాగడు. కుటుంబ సమస్యలు కూడా లేవు. ఊళ్ళో మాది మోతుబరి కుటుంబం.. నాకు వాడొక్కడే కొడుకు.. నా భార్యకు ఆరోగ్యం సరిగా లేదు. కోడలు మా ఇంట్లోనే వుండి మాకు సాయపడుతూ వుంది.. మా అబ్బాయి వారం, పది రోజులకు వొచ్చిపోతూ వుండేవాడు.. కొడుకు, కోడలు ఎంతో అన్యోన్యంగా వుండేవాళ్ళు.. పిల్లల్లేరు వాళ్ళకు..

- ఇంకా ఉంది

నేర్చుకుందాం

శ్రీ నరసింహ శతకములోని పద్యము



సీ. ఐశ్వర్యములకు నిన్ననుసరింపcగ లేదు
ద్రవ్యమిమ్మని వెంటcదగుల లేదు
కనకమిమ్మని చాలc గష్టపెట్టcగలేదు
పల్లకిమ్మని నోట పలుకలేదు
సొమ్ము లిమ్మని నిన్ను నమ్మి కొల్వcగలేదు
భూములిమ్మని పేరు పొగడలేదు
జలము నిమ్మని నిన్ను బ్రతిమాలcగలేదు
పసుల నిమ్మని పట్టుపట్టలేదు

తే. నేను కోరిన దొక్కటే నీల వర్ణ
చయ్యనను మోక్ష మిచ్చినcజాలు నాకు
భూషణవికాస! శ్రీధర్మపురనివాస
దుష్టసంహార!నరసింహ! దురితదూర!

భావం: ఓనల్లని శరీరకాంతి గల స్వామీ! నేను సిరిసంపదలు, డబ్బు, బంగారం, పల్లకీలు, నగలు, పొలాలు, బలపరాక్రమాలు, పాడిపశువులు ఇట్లాంటివేమీ నిన్ను కావాలని నేను కోరలేదు. వాటికొరకై నిన్ను పొగడటం, బ్రతిమాలటం పేచీ పడటం లాటి పనులేవీ నేను చేయలేదు. నేను కైవలమొక్కటే నిన్ను కోరుతున్నాను. శాశ్వతమైన కైవల్యపదవి చిక్కిన తరువాత ఇక అప్రాధాన్యము, అశాశ్వితమైన లౌకికమైనవి ఏ పదవులూ ఏ సంపదలూ కావాలని కోరుకునే వారు ఉండరు కదా. పరమాత్మ దొరికిన తరువాత ఇక అన్యము కావాలని ఎవరు అనుకొంటారు? అనుకోరని భావం.

మాటాట : 1528

నిర్వహణ: సుధామ

■	1		2			■
3	■	■		■	■	4
5	6	■		■	7	
■	8		■	9		■
10		■	11	■	12	13
	■	■		■	■	
■	14					

ఆధారాలు

అడ్డం:
1. గుజరాత్ , హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో గెలిచిన (పూలసేన) దిది
5. దేవాలయం
7. దీనితోక బెత్తెడు అని వ్యవహారం
8. తాటిలేక కొబ్బరి వంటివాటి కొమ్మ
9. కుసుమములు
10. వ్రతము వంటిదే
12. కూతురు, కుమార్తె
14. కత్తిపాట దిగంబరకవి

నిలువు:
2. ఉప్పు
3. వ్యవసాయము
4. కాపాలము
6. దశరూపకాల్లో ఒకటి, నాటక భేదము
7. సంకెల, మెడకు ఆభరణం
10. ముఖద్వారము, వక్త్రము
11. గోము
13. త్రాసు

మాటాట - 1527 సమాధానం

1 న్యూ	ఇ	2 య	ర్	■	3 డై	4 రీ
న	■	త్నం	■	5 గ్రీ	■	జ
6 త	ల	■	7 పా	టిం	■	న్
■	■	క్షీ	■	గ్స్	■	■
9 పి	■	10 లి	క్మి	■	11 పు	12 స
బ	■	కో	■	13 గ్మో	■	ర్ణ
14 తే	దీ	వా	ర	ము	■	యం

మంచిమాట



ఆశ్రితవత్సలుడు



తిరుప్పావై 20వ పాశురమ్ ముప్పత్తు మూవర్

ముప్పత్తుమూవర్ అమరర్కు మున్ శెన్టు!
కప్పం తవిర్కుం కలియే తుయిలెళాయ్
శెప్పముడైయాయ్ తిఱలుడైయామ్ శెత్తార్‌క్కు
వెప్పం కొడుక్కుంవిమలా తుయిలెళాయ్
శెప్పు అన్న మెన్‌ములై శెవ్వాయ్ శిఱుమఱుంగుల్
నప్పిన్నై నంగాయ్ తిరువే తుయిలెళాయ్
ఉక్కముం తట్టొళియం తన్దు ఉన్ మణాళనై!
ఇప్పోదే ఎమ్మై నీరాట్టేలో రెమ్బావాయ్

భావం:ఈనాటి పాశురంలో పరమాత్మ ధర్మ రక్షణా స్వభావాన్ని కొనియాడుతున్నారు గోపికలు. ప్రేమను వర్షించే అనురాగమూర్తివి ఓ నీళాదేవి? పరిపూర్ణజ్ఞానాన్ని అందించే తల్లివి, మోక్ష ప్రదాత, మహాలక్ష్మీ స్వరూపానివి. మా అహంకార మమకారాలను తొలగించి ప్రణవాన్ని ప్రసాదించు. పరమాత్మతో కూడి ఆనందానుభవాన్ని అనుభవించేటట్లు కరుణించు! అని నీళాదేవిని ప్రార్థిస్తున్నారు గోపికలు.

ముప్పది మూడు కోట్లు దేవతలకు, ఆపద రాకముందే వెంట నిల్చి వారి భయాన్ని పోగొట్టజాలిన బలశాలివి నీవు మేల్కొనాలి. మా వ్రతం కూడా నీ కోసమే కనుక దుష్ట ఇంద్రియ శక్తులు ఎంత జయించినా వెంట రాక మానవు. నీవు మేల్కొని మమ్ము రక్షించి మా వ్రతాన్ని సఫలం చేయాలి.

ఆశ్రితులను రక్షించేవాడా, రాక్షసులకు దుష్ట ఇంద్రియ శక్తులకు భయము కల్గించే పరిశుద్ధ స్వరూపుడా! శుద్ధ సాత్విక తత్త్వానికి భయపడే స్వభావం విషమేంద్రియ శక్తులది. నీవు మేల్కొనాలి. బంగారుకలశముల వంటి మృదువైన స్తనములు, పగడము వంటి ఎర్రనైన అధరములు గలిగిన, నడుముగల ఓ నీళాదేవీ! (స్త్రీ పరిపూర్ణత్వానికి బిడ్డలపై ప్రేమధార వర్షించడానికి కరుణా హృదయాల్ని సూచించడానికి, అనురాగ హృదయానికి సంకేతించబడినదే ఎరుపురంగు. మాతృస్తన్యము బిడ్డకు అమృతధారగా జీవాన్నిస్తుంది. మాతృహృదయానురాగం ప్రేమగా పలుకుతుంది. ఇదే పగడపు రంగులోని తల్లి అధరాల సంకేతం.

నీ అనురాగభావాలే శాశ్వతం గానీ, ఇహలోకంలోని మా అనురాగ భావనలు, మమతలన్నీ శూన్యమైనవే, ఇదే సన్నని నడుము సంకేతిస్తున్నది. పరిపూర్ణ జ్ఞాన సంపన్నులారా! స్థితికారకుడిని చలింపజేసే శ్రీ మహాలక్ష్మీ! నీవు చైతన్యం పొందాలి. మా నోముకు కావలసిన విసనకర్రను, అద్దాన్ని (నమఃతత్త్వాన్ని, ప్రణవాన్ని) ఇచ్చి, నీ అధీనంలో ఉన్న కృష్ణ పరమాత్మ భక్తి భావనలో హాయిగా ఇపుడే ఆనందంగా స్నానం చేయాలని మా హృదయం వేగిరిపడుతున్నది. అని విన్నవించుకుంటున్నారు గోపికలు.

ఆండాళ్ తిరువడిగళే శరణమ్

- డాక్టర్: పరవస్తు కమల

యాజ్ఞసేని



- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 2

ఆయా వేదికలపై గట్టి కప్పులను నిర్మించారు. వాటిపై మణికవర్యులు రత్నాలను, ముత్యాలను, అలంకరణ వస్తువులను విక్రయిస్తున్నారు.

కొన్ని వేదికలపై వృత్తిపనివారు హస్తకళాప్రావీణ్యం ఉట్టిపడేటట్లుగా మగ్గాలపై నేసిన స్త్రీ పురుషులు ధరించే చేనేత వస్త్రాలను మరి రాజభటులు, రాజప్రముఖులు, వారి వారి అర్హతకు తగినట్లుగా ధరించే వివిధాలంకృతమైన కుట్టిన వస్త్రాలను ప్రదర్శిస్తున్నారు.

దాసదాసీ జనాలు ఏవేవో వస్తువులను చేతబట్టి హడావుడిగా వీధులలో అటునుండి ఇటూ ఇటు నుంటి అటూ తిరుగుతున్నారు.

రాజప్రాకారాలనంటుకొనియున్న ఒక దేవాలయంలో 'ఈశ్వరాభిషేకం' చేస్తున్నారు. 'నమస్తే అస్తు భగవ్విశ్వేరాయ మహాదేవాయ త్ర్యంబకాయ త్రిపురాంతకాయ త్రికాగ్నికాలాయ కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ..శ్రీమన్మహాదేవాయ నమః'' అని అంతరిక్షం ఘోషించినట్లు నమక చమకాలు చదువుతున్నారు.

వేరొక కోవెలనుండి 'నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహీ తన్నో విష్ణుః ప్రచోదయాత్' అనే మంత్రపుష్పసహిత సూక్తులు వినిపిస్తున్నాయి.

పాంచాలురు దేశీభక్తులు. అందువల్ల ఒక గుడి నుండి దేవీస్తుతులు వినబడుతున్నాయి.


రాజభటులు హడావిడిగా వీధులలో తిరుగుతూ కనిపిస్తున్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా కూడళ్ళవద్ద చేరి నిలబడియుండటం కనిపిస్తున్నది.

ఆ గుంపునుండి ఒక పెద్దమనిషి అడిగాడు ''ఏమిటీ విశేషం. ఎందుకిలా ప్రజలు గుమికూడారు'' అని.

వారిలో ఒకడు అన్నాడు- ''ద్రుపద రాజకుమారి స్వయంవరమట. చాటింపు అదే' అని.

ఇంతలో ఒకచోట రాజభటులు దండోరాచేపట్టి ఎత్తైన వేదికపై నిలబడి చెపుతున్నారు.

''ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియపరచడమేమనగా పాంచాల దేశాధీశుడు, మహారాజాధిరాజు ద్రుపద మహారాజులవారు తమ ముద్దుల పట్టి, రాజకుమారి అయిన 'ద్రౌపదిదేవికి' స్వయంవరాన్ని ప్రకటించ నిర్ణయించారు. వివిధ దేశాధి రాజులకు ఆహ్వానాలు పంపుచున్నారు. వచ్చే పుష్య శుక్ల అష్టమినాడు స్వయంవరం జరుగుతుం



దహో! ఇది రాజాజ్ఞ. తెలియగలరహో!'' అని ఒక కూడలి నుంచి మరొక కూడలికి తరలి వెళుతున్నారు.

ప్రతి కూడలివద్దా అలా దండోరాను విన్న ప్రజలు ఎంతో ఆనందిస్తున్నారు.

2

పాంచాలము. ఇది ప్రాచీన భారతదేశంలోని ఒక జనపదం. ఈ పాంచాల రాజ్యం ఉత్తరాన హిమాలయ ప్రాంతం వరకు, పశ్చిమాన చర్మణ్వతీ నది, కురు, శూరసేన మరియు మత్స్యదేశాల వరకు, తూర్పున నైమిశారణ్య ప్రాంతంవరకు విస్తరించి ఉండేది. తదుపరి పాంచాల రాజ్యం రెండుగా విభజించబడి గంగానదికి దక్షిణాన (మాకందములోని) 'కాంపిల్య నగరము' రాజధానిగా దక్షిణ పాంచాలముగానూ, ఉత్తర 'అహిచ్ఛత్రం' రాజధానిగా ఉత్తర పాంచాలముగానూ ఏర్పడ్డాయి.

భరద్వాజుడు ఒక ముని. గొప్ప తపోనిష్ఠాగరిష్ఠుడు. ఒకనాడు భరద్వాజ ముని స్నానానికై గంగానదికి వెళతాడు. అప్పుడు తనకెదురుగా మహావిలాసంతో జలక్రీడలాడుచున్న ఘృతాచి అనే అప్సరసను చూస్తాడు. ఒక పెనుగాలి చేత ఘృతాచి చీర తొలగిపోగా నిర్మలమయిన ఆమె దేహము కనిపిస్తుంది. భరద్వాజుడు అది జూచి ఆమెను కామించాడు. ఆ మన్మథ రాగాతిశయం చేత ఆ క్షణంలోనే మునికి వీర్యస్ఖలనంకాగా, ఆ వీర్యాన్ని తెచ్చి ఒక కలశంలో భద్రపరచగా దానినుండి 'శుక్రుని' అంశతో (బృహస్పతి అంశతో కూడా కూడా కలదు) ద్రోణుడు జన్మించాడు. ద్రోణము నుండి పుట్టినవాడు కాబట్టి ద్రోణుడు అనీ, కలశం నుండి జన్మించినవాడు కాబట్టి 'కలశజుడు' 'కలశభవుడు', 'కుంభసంభవుడు' అనే నామాలతో పిలువబడ్డాడు. భరద్వాజమునికి పాంచాలదేశ రాజైన 'వృషతుడు' మంచి స్నేహితుడు. ఘోర తపస్సు చేస్తున్న పృషతుడు సమీపంలో ఒక రోజు వసంత కుసుమాలను కోస్తున్న 'మేనక' అనే అప్సరసను చూస్తాడు. వెంటనే పృషతుడికి మన్మథ రాగంచేత వీర్యస్ఖలనం కాగా ఆ వీర్యాన్ని పృషతుడు తన పాదంతో కప్పివేస్తాడు. అందుండి మరుత్తుని అంశతో 'ద్రుపదుడు' అనే ఒక కుమారుడు జన్మిస్తాడు. ఆ బాలుడిని పృషతుడు భరద్వాజ ముని ఆశ్రమంలోనే వదలి తాను పాంచాల దేశానికి వెళ్లి రాజ్యాన్ని పాలిస్తుంటాడు.

భరద్వాజ కుమారుడైన 'ద్రోణుడు, పృషతుని కుమారుడైన ద్రుపదుడు ఇద్దరూ కలిసి వేదాలు చదివి, విలువిద్యలు నేరుస్తారు.

- ఇంకా ఉంది

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండుటచే మానసికానందాన్ని పొందుతారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది.కొన్ని పనులు ఈ రోజు పూర్తిచేసుకోగలుగుతారు.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  ఆత్మీయుల సహకారం లభిస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. అనారోగ్య బాధవలన బలహీనులవుతారు
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  ఆకస్మిక ధనలాభయోగముంటుంది. కుటుంబంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలుంటాయి. అంతటా అనుకూల వాతావరణమేర్పడుతుంది.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
  బంధు, మిత్రులతో మనస్పర్ధలు రాకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనుకోకుండా డబ్బు చేజారే అవకాశాలున్నాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో విరోధమేర్పడే అవకాశాలుంటాయి. స్త్రీల మూలకంగా శతృబాధలనుభవిస్తారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  నూతన కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపారమూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో నష్టపోయే అవకాశముంది. కుటుంబంలో మార్పులు కోరుకుంటారు. ఒక మంచి అవకాశాన్ని జారవిడుచుకుంటారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  అన్ని కార్యములందు విజయాన్ని సాధిస్తారు. అంతటా సౌఖ్యాన్ని పొందుతారు. శత్రుబాధలుండవు. శుభవార్తలు వింటారు. గౌరవ, మర్యాదలు అధికమవుతాయి.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  ఆరోగ్యం గూర్చి జాగ్రత్తపడుట మంచిది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. కుటుంబ కలహాలకు దూరంగా వుంటే మేలు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  గౌరవింపబడే ప్రయత్నంలో సఫలమవుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా లేనందున మానసికాందోళన చెందుతారు. ప్రతి పని పూర్తిచేస్తారు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  పిల్లలవల్ల ఇబ్బందులనెదుర్కొంటారు. అధికారులతో గౌరవింపబడతారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకుంటారు. అనారోగ్య బాధలు తొలగిపోతాయి.

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్**, ఆంధ్రభూమి దినపత్రిక,
36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

దౌత్యంతో పాక్‌కు చెక్

ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, సంప్రదాయ వనరులతో ప్రపంచంలో అగ్రరాజ్యంగా ఎదిగే సామర్థ్యం ఉన్న భారతదేశాన్ని చూస్తే పొరుగు దేశాలు ఉలిక్కిపడుతున్నాయి. సరిహద్దుల్లో చికాకులు కలిగించడమేగాక, ఉగ్రవాదులను రెచ్చగొట్టి, విచ్ఛిన్నకర శక్తులను దేశంలోకి అక్రమంగా పంపిస్తూ భారత్‌ను ఉక్కిరిబిక్కిరి చేయాలనే దురుద్దేశాన్ని ప్రదర్శిస్తున్న దేశాల్లో పాకిస్తాన్‌దే అగ్రస్థానం. భారత్ సైతం ఎప్పటికపుడు పాక్ కుట్రలను తిప్పికొడుతోంది. ఉగ్రవాదులను భారత్‌లోకి చొరబాటుకు తోడ్పడటం, మంచుపర్వతాల్లో ఆకస్మిక దాడులకు పాల్పడటం, చివరికి హిందూ మహాసముద్ర జలాల్లో చైనా కుట్రలకు తోడ్పాటునివ్వడం మామూలైపోయింది. దీంతో ఇరు దేశాల సంబంధాలపై అనుమానపు మేఘాలు కమ్ముకున్నాయి. పాక్ చర్యలకు అమెరికా తరహాలో సర్జికల్ స్ట్రైక్స్ (మెరుపు దాడులు) చేసి పాక్ తీవ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి తన సత్తాను చూపింది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు దిగజారిపోయాయి. క్రీడా సంబంధాలు నిలిచిపోయాయి. మిలటరీ దుందుడుకువాదం, మతోన్మాదం, రాజకీయ అవకాశవాదం, మత్తుపదార్థాల మాఫియాతో పాకిస్తాన్ అట్టుడికిపోతోంది. ఈ శక్తులు అన్నింటికీ వ్యూహాత్మక ప్రయోజనాల రీత్యా భారత్‌తో శాశ్వత వైరం అవసరం. పాక్ ప్రజల్లో తమ పట్టుపెంచుకునేందుకు అవి భారత్ వ్యతిరేకతను కోరుతున్నాయి. భారత్ వ్యతిరేకతే కేంద్రంగా పాక్ వ్యూహం, మిలటరీ నీతి సాగుతోంది. భారత్ మాత్రం పాక్ కుయుక్తులకు అంతర్జాతీయ వేదికలపై సైతం దీటైన సమాధానమే ఇస్తోంది. సైన్యం తమ పని సమర్థంగా ముగిస్తోంది. జమ్మూకాశ్మీర్‌లోని అనువైన ప్రాంతాల్లో తీవ్రవాదులు చొరబాటు, వారిని మన సైన్యం హతమార్చడం దైనందిన కార్యక్రమంగా మారింది. శాంతి, స్నేహ, సహకారాలకు భారత్ వ్యతిరేకం కాకున్నా రక్షణ విషయంలో మాత్రం రాజీపడే ప్రసక్తే లేదనే సంకేతాన్ని చాలా స్పష్టంగా ఇస్తోంది. దేశ భద్రత పటిష్టంగా ఉండాలంటే ప్రమాదాలను జాగ్రత్తగా అంచనా వేసే విదేశాంగ విధానాన్నే భారత్ అనుసరిస్తోంది. ఒక దశలో వాస్తవాధీన రేఖ వద్ద పాక్ సైన్యం ఒడిగట్టిన దారుణానికి బదులుగా సంగీత విద్వాంసులను, కళాకారులను పాకిస్తాన్‌కు భారత్ తిరిగి పంపించింది. దీర్ఘకాలిక దృక్పథంతో దౌత్యనీతిని భారత్ రచిస్తోంది. భావోద్వేగాలతో కూడిన స్పందన కాకుండా, స్థిరమైన విదేశాంగ విధానాన్ని అనుసరించడంతో పాటు దీర్ఘకాలిక దృఢమైన వ్యూహాత్మక ప్రయోజనాలను కలిగించే విధంగా భారత్ ఎత్తుగడలు వేస్తోంది. ఈ వ్యూహం మిగిలిన పొరుగుదేశాల విషయంలోనూ భారత్ అనుసరిస్తోంది. అయితే ఇటీవలి కాలంలో హెచ్చుమీరుతున్న పాక్ ఆగడాలపై నిపుణుల అభిప్రాయాలే ఈ వారం ఫోకస్.

విశాల భారతానికి అవకాశం

భారత్-పాకిస్తాన్ ప్రజల మధ్య ఎలాంటి శత్రుత్వం లేదు. రాజకీయ అవసరాలకోసమే పాలకులు రెండు దేశాల మధ్య శత్రుత్వాన్ని పెంచి పోషిస్తున్నారు. మతపరమైన రాజకీయాల వల్ల రెండు దేశాల మధ్య ద్వేషం పెరుగుతోందే తప్ప సాంస్కృతిక, సాంప్రదాయాల ప్రకారం ఎలాంటి విభేదాలు లేవు. రెండు దేశాల మధ్య శత్రుత్వం ఏర్పడేందుకు చారిత్రక కారణాలున్నాయి. బ్రిటన్ పాలకుల నుండి భారత్ స్వతంత్ర దేశంగా ఏర్పడ్డ నాటినుండి భారత్-పాక్ మధ్య ద్వేషం, విభేదాలు ప్రారంభమయ్యాయి. భారత్-పాక్‌లలో హిందూ, ముస్లింలు లక్షలాది మంది హత్యకు గురయ్యారు. రెండు మతాల మధ్య చెలరేగిన విద్వేషాలను చల్చార్చేందుకు, స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు మహాత్మాగాంధీ ప్రయత్నించారు. గాంధీ చేసిన ప్రయత్నం, పాకిస్తాన్‌కు 25వేల కోట్ల రూపాయలు ఇవ్వాలన్న ఒప్పందం అమలు చేయాలని గాంధీ చేసిన ప్రయత్నాలు విఫలం కావడమే కాకుండా ఆయన హత్యకు దారి తీశాయి. 1965లో పాక్-భారత్ మధ్య యుద్ధం జరిగింది. 1971లో పాకిస్తాన్ విడిపోవడానికి భారత్ కారణమన్న భావన పాకిస్తాన్ ప్రజల్లో నాటుకుపోయింది. కాశ్మీర్ సమస్య పరిష్కారం కాకుండా రగులుతూనే ఉంది. ఇవన్నీ ఇరు దేశాల మధ్య విద్వేషాలకు, శత్రుత్వం పెరిగేందుకు దోహదపడ్డాయి. మరోవైపు అమెరికా తన ఆయుధ సంపత్తిని మార్కెటింగ్ చేసుకునేందుకు పాకిస్తాన్‌ను ఉసికొల్పి, భారీఎత్తున పాక్‌కు ఆయుధాలను సరఫరా చేస్తూ వచ్చింది. భారత ఉపఖండంలో అశాంతికి ఇదీ ఒక కారణంగానే చెప్పుకోవాలి. ఇటీవల నేపాల్‌లో 25 సంవత్సరాల వయస్సున్న యువతతో సమావేశం జరిగింది. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్ తదితర దక్షిణాసియా దేశాల నుండి యువ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ యువ ప్రతినిధుల మధ్య నెలకొన్న స్నేహం, సౌభ్రాతృత్వం చూస్తే నాకు ముచ్చటేసింది. వారిలో ఎలాంటి శత్రుత్వ భావనలు కనిపించలేదు. అందుకే దక్షిణాసియా దేశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొనాల్సి ఉంది. అన్ని దేశాల నేతలు కలిసి పనిచేస్తే, ఈ దేశాలన్నీ కలిసి ఒక సమాఖ్యగా ఏర్పడేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ సమాఖ్యకు 'విశాల భారత్' అని కాని మరో పేరుకాని పెట్టుకునే అవకాశం ఉంది. దక్షిణాసియా దేశాలన్నీ కలిసిమెలిసి పనిచేస్తే ఊహలకు అతీతంగా అభివృద్ధి కనిపిస్తుంది. సైన్యంపై చేసే ఖర్చు తగ్గిపోయి, అదే డబ్బును వ్యవసాయం, పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాలు, కుటీర పరిశ్రమలు తదితర అభివృద్ధి పనులకోసం ఖర్చు చేయవచ్చు. దక్షిణాసియా దేశాలు ఒక సమాఖ్యగా ఏర్పడితే ప్రపంచంలో బలమైన శక్తిగా అవతరిస్తుంది. తద్వారా అది విశ్వశాంతికి మార్గం వేసినట్టవుతుంది. ఇందుకోసం అన్ని దేశాల నేతలు కలిసి చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దక్షిణాసియా దేశాల నేతలు శాంతియుత వాతావరణంలో కలిసి చర్చలు జరిపితే శత్రుత్వం తగ్గిపోయి, స్నేహం, సౌభ్రాతృత్వం పెరిగే అవకాశం ఉంది. ఇందుకు వివిధ దేశాల నేతల మధ్య చిత్తశుద్ధి అవసరం.



- ప్రొఫెసర్ హరగోపాల్
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (రిటైర్డ్)

రెండు దేశాలకూ చేటు

సరిహద్దుల్లో నిత్యం ఉద్రిక్త వాతావరణం నెలకొనడం భారత్, పాకిస్తాన్ రెండు దేశాలకు మంచిది కాదు. ఒకనాడు కలిసి ఉన్న ప్రాంతాలే విడిపోయి నేడు రెండు దేశాలుగా ఉంటున్నప్పటికీ అందరి మూలాలు ఒక్క దగ్గరే అనే విషయం గుర్తించాలి. పాలకుల తీరుతో ప్రజలు బాధపడాల్సి వస్తోంది. ఉద్రిక్త వాతావరణం కారణంగా రక్షణ బడ్జెట్ ఇరు దేశాల్లో వేల కోట్లను దాటి లక్షల కోట్లకు చేరుకుంటోంది. ఇది ఆహ్వానించదగిన పరిణామం కాదు. ఈ బడ్జెట్‌తో దేశ ప్రజలకోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు. ఉద్రిక్తతల విషయంలో భారతదేశం కొంచెం సంయమనంగానే ఉంటున్నప్పటికీ పాకిస్తాన్ రెచ్చగొట్టే ధోరణిని విడనాడకపోవడం విచారకరం. ఇటీవల అక్కడ జైలులో ఉన్న జాదవ్‌ను అతని తల్లి, భార్య కలిసేందుకు పాకిస్తాన్ అనుమతినివ్వడం సంతోషకరమైనప్పటికీ అక్కడ వారిద్దరి పట్ల ప్రవర్తించిన తీరు దుర్మార్గం. బొట్టు, తాళి, మెట్టెలను తీసివేయించడం ద్వారా మొత్తం భారతదేశ మహిళలందరినీ పాకిస్తాన్ అవమానించినట్లేనని భావించాలి. ప్రపంచ దేశాలు సైతం ఈ సంఘటనను తప్పుబట్టడం గమనార్హం. సరిహద్దుల్లో నిత్యం ఏదో ఒకచోట కాల్పులు జరుగుతుండడం నిత్యకృత్యమైంది. ఇరువైపుల సైనికులు మరణిస్తున్నారు. వారి కుటుంబాలు ఎంత బాధ పడుతున్నాయో అర్థం చేసుకోవాలి. ఇరుదేశాల నేతలు పాలనా దక్షత కలిగిన వారైనప్పటికీ సరిహద్దు వివాదాల్లో సమస్యలను పరిష్కరించుకోలేక పోతున్నారు. అన్నదమ్ముల్లా విడిపోయి బద్ధ శత్రువులుగా మారి కొట్లాడుకుంటుండడం బాధాకరం. ఆక్రమిత కాశ్మీర్ మనదే అయినప్పటికీ ప్రస్తుతం అది పాకిస్తాన్ దురాక్రమణలో ఉంది. దీనికి శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది. కాశ్మీర్‌లో నిత్యం అల్లర్లు జరుగుతుండడానికి కారణం పాకిస్తాన్‌లోని కొన్ని ఉగ్రవాద సంస్థలేననేది వాస్తవం. అటువంటి సంస్థలపై పాకిస్థాన్ పాలకులు చర్యలు తీసుకోవడం ద్వారా భారత్‌తో సాన్నిహిత్యం పెంచుకోవాలనేది భారతీయుల అభిలాష. దక్షిణాసియా దేశాలన్నీ సోదరభావంతో ఉంటేనే అన్ని దేశాల్లో అభివృద్ధి కనపడుతుంది. భారత్, పాకిస్తాన్ దేశాలకు చెందిన ఎందరో ఉన్నత విద్యావంతులు, మేధావులు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. అటువంటి వారి సలహాలను కూడా తీసుకుంటూ ఇరుదేశాలు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాలి. విడిపోయినప్పటికీ సోదరభావంతో మెలగడం ద్వారా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా రెండు దేశాలు నిలవాలి.



- మేకపాటి రాజమోహన్‌రెడ్డి
నెల్లూరు ఎంపీ, లోక్‌సభలో వైసీపీ ఫ్లోర్‌లీడర్

అంతర్జాతీయంగా ఏకాకిని చేయాలి

దేశ విభజన నాటి నుండి కూడా భారత్ పట్ల పాకిస్తాన్ శతృవైఖరి కొనసాగుతూనేవుంది. గతంలో రెండు పర్యాయాలు భారత్‌తో యుద్ధాలకు దిగి నష్టపోయినా పాకిస్తాన్ గుణపాఠం నేర్వలేదు. కాశ్మీర్ సమస్యను ఆసరాగా చేసుకుని సీమాంతర ఉగ్రవాదంతో భారత్ వ్యతిరేకంగా పాకిస్తాన్ కుట్రలు, దాడులు చేస్తోంది. భారత్‌ను దెబ్బతీసే లక్ష్యంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో కూడా ఇతర దేశాలను ఇబ్బందుల పాలు చేసేలా ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్ వైఖరి మానవ సమాజానికి చేటుగా మారింది. ఐక్యరాజ్య సమితిలో, అంతర్జాతీయ వేదికలపై పాక్ ఉగ్ర బుద్ధిని ఎండగట్టి ఆ దేశాన్ని ఏకాకిగా చేసేందుకు దౌత్యపర యత్నాలు విస్తృతం చేయాలి. అటు పాక్ ఉగ్రమూకలు, పాక్ సైన్యం సాగిస్తున్న ఉగ్రదాడులను తిప్పికొట్టడంలో భారత్ మరింత కఠిన వైఖరి అనుసరించాలి. పాక్ ఉగ్రమూకల శిబిరాల ధ్వంసం చేసే క్రమంలో మరిన్ని సర్జికల్ దాడులు అవసరం. ఇంకోవైపు పాకిస్తాన్‌కు ఇతర దేశాల నుంచి ముఖ్యంగా అమెరికా, చైనా వంటి దేశాల నుండి ఆర్థిక, పారిశ్రామిక, ఆయుధ సహకారాలను అందకుండా చేయాలి. ఈ దిశగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా పాక్‌కు ఆర్థిక సహాయం నిలిపివేయాలన్న వ్యాఖ్యానించడం ఉగ్రమూకల పోషణ సాగిస్తున్న పాక్‌కు గట్టి ఎదురుదెబ్బే. పాకిస్తాన్‌కు ఇంతకాలం సాయం చేయడం పొరపాటన్నట్లుగా అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను చైనా కూడా పరిశీలనలోకి తీసుకోవాలి. చైనా కేవలం భారత్ ఎదుగుదలపై అసూయతో పాక్‌కు సహాయకారిగా ఉంటుంది. అమెరికా తరహాలో చైనా కూడా పాక్‌కు సహాయంపై పునరాలోచన చేసుకోవాలి. ఉగ్రవాదంపై పోరుకు సహకరించిన పాక్‌కు ఏ దేశం కూడా సహకరించరాదన్న సందేశాన్ని అమెరికా వంటి ఉగ్రవ్యతిరేక దేశాల సహకారంతో అంతర్జాతీయ స్థాయిలో భారత్ విస్తృత ప్రచారం సాగించాలి. కాశ్మీరీలు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం వైపు ఆకర్షితులు కాకుండా భారత్ నూతన చర్యలు చేపట్టాలి. పొరుగుదేశాలతో అంతర్జాతీయంగా శాంతిని కోరుకునే భారత్ పట్ల పాకిస్తాన్ శతృవైఖరి దీర్ఘకాలికంగా ఆ దేశాన్నే దెబ్బతీస్తుంది. పాక్ పాలకులు ఉగ్రవాద పోషణపై చూపుతున్న శ్రద్ధను ఆ దేశ అభివృద్ధి పట్ల చూపకపోవడం విచారకరం. ఉగ్రదాద మూకల కేంద్రంగా పాకిస్తాన్ కొనసాగడం ద్వారా ఆ దేశ అభివృద్ధి తీవ్రంగా కుంటుపడుతోంది. చివరకు పొరుగుదేశాల సాంప్రదాయాలను గౌరవించాలన్న సంస్కారం, విచక్షణ, కనీస మానవత విలువలు సైతం కోల్పోయిన పాక్‌లో మార్పుకు ఉదారవాద వైఖరి పనికిరాదు. పాక్‌లో ఖైదీగా ఉన్న కులభూషన్ యాదవ్‌తో ఆయన భార్య, తల్లి భేటీ సందర్భంగా పాక్ వ్యవహరించిన తీరు భారత్‌ను అవమానించడంగానే భారత ప్రజలు భావిస్తున్నారు. మొత్తంగా హింసా, యుద్ధోన్మాద వైఖరిలతో మనుగడ సాగించాలనుకునే పాక్ పట్ల భారత్ అంతర్జాతీయ దేశాల మద్ధతుతో దౌత్యపరంగా, ఆర్థికంగా, సైనికంగా దాడులు ఉధృతం చేయాలి.



- డాక్టర్ బి.ధర్మానాయక్
అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్, ఉమ్మడి నల్లగొండ జిల్లా

అవి కవ్వింపు చర్యలే

మన దేశంపై పాకిస్తాన్ నిరంతరాయంగా కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. కయ్యానికి కాలు దువ్వుతున్న పాక్‌ను భారత్‌సహా అన్ని దేశాలూ హెచ్చరిస్తున్నప్పటికీ వారికి బుద్ధి రావడం లేదు. పొరుగు దేశాలతో భారత్ ఎప్పుడూ స్నేహ సంబంధాలనే కోరుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య సంబంధాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. పాక్ అనాగరిక చర్యలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ దేశానికి ఏ విధమైన సహాయ సహకారాలు అందించేది లేదని ప్రకటించారు. పాక్ చర్యలపట్ల యావత్ ప్రపంచం విచారాన్ని వ్యక్తం చేస్తున్నప్పటికీ తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, మన దేశ సరిహద్దుల్లో అశాంతికి పాక్ కారణమవుతోంది. మన దేశంపైకి తీవ్రవాదులను ఉసిగొల్పుతూ, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినంత కాలం ఆ దేశంతో చర్చలు జరపకపోవడమే మంచిది. దేశ సరిహద్దుల్లోకి చొరబాట్లను ప్రోత్సహించిన పక్షంలో పాక్ భారీమూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది. ఈ విషయంలో మనదేశం తీసుకునే ఏ నిర్ణయాన్నైనా ప్రతి ఒక్కరు సమర్థించాలి. దేశ భద్రత విషయంలో కేంద్రం తీసుకునే నిర్ణయాలకు రాజకీయాలకు అతీతంగా మద్దతునివ్వాలి. ఒకవేళ పాక్ ప్రభుత్వం తీవ్రవాదాన్ని కట్టడిచేసి, శాంతియుత వాతావరణంలో చర్చలు జరిపేందుకు పాక్ ముందుకువచ్చిన పక్షంలో అందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది.



- తోట నరసింహం
కాకినాడ ఎంపీ, లోక్‌సభలో టీటీపీ పక్ష నేత

శాంతియత్నాలకు విఘాతం

శాంతికాముక దేశమైన భారత్, విదేశాలతో సత్సంబంధాలు కొనసాగించడంలో ఎప్పుడూ ముందుంటుంది. మన దేశం స్నేహ సంబంధాలు కొనసాగించే దిశగా ఎన్నో అడుగులు వేస్తున్నా, పాక్ మాత్రం కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. సరిహద్దు ప్రాంతంలో నిరంతరం దాడులకు పాల్పడుతూ శాంతి ప్రయత్నాలకు భంగం కలిగిస్తూనే ఉంది. 1947లో బ్రిటిష్ ప్రభుత్వము ఇండియా, పాకిస్తాన్‌గా విభజించినప్పటికీ భౌగోళికంగా, చారిత్రకంగా, సాంస్కృతికంగా, మతపరంగా ఈ రెండు రాజ్యాల మధ్య ఎలాంటి పోలికలూ లేవనే చెప్పొచ్చు. దురదృష్టవశాత్తూ ఈ రెండు రాజ్యాలూ ఎన్నటికీ మంచి మిత్రులు కాలేకపోయాయి. దక్షిణాసియాలో ప్రజాస్వామ్య శాంతిని స్థాపించాలంటే అణ్వాయుధ సంపత్తి కలిగిన భారత్, పాక్ మధ్య శాంతిని స్థాపించాల్సిన అవసరం ఉంది. ద్వైపాక్షికంగా చర్చలద్వారా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో శాంతి స్థాపనకు భారత్ దృఢచిత్తంతో కృషి చేస్తోంది. అంతర్జాతీయ తీవ్రవాదాన్ని అణచివేయడం, ముఖ్యంగా నవంబర్ 26 ముంబై దాడిలో పాల్గొన్న తీవ్రవాదులపై చర్యలు తీసుకోండని పాకిస్తాన్‌పై భారత్ ఎంత ఒత్తిడి చేసినా ఆ యత్నాలు వృథా అయ్యాయి. కాశ్మీర్ సమస్యను ఒక అంతర్జాతీయ సమస్యగా అనేక అంతర్జాతీయ వేదికలపై పాక్ చిత్రీకరించే ప్రయత్నం చేయడంతోపాటు అణ్వాయుధ, రసాయన ఆయుధాల సమస్యతో ముడిపెడుతోంది. ఈ జటిల సమస్య పరిష్కారం కావాలంటే కాశ్మీర్‌తో సహా పాక్‌తో ఉన్న అన్ని సంబంధాలను దృఢతరం చేయాల్సి ఉంది. ఆర్థిక రంగంలో ప్రత్యక్ష పెట్టుబడులను, దేశీయ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడం, ప్రభుత్వ రంగంలో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించడం, ఒక పటిష్టమైన భద్రతా వ్యవస్థను నెలకొల్పడం, పాకిస్థాన్‌లోని రాడికల్ ఇస్లామిక్ గ్రూపులతో ఫలవంతమైన చర్చలు, జరపడం, తీవ్రవాద నిర్మూలనకు అంతర్జాతీయ ఆర్థిక సాయం నిలిపివేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా రెండు దేశాల మధ్య శాంతి, సామరస్యాలు ఏర్పడి, ద్వైపాక్షిక, వాణిజ్య అభివృద్ధి, పర్యాటక రంగ అభివృద్ధి వెరసి ఆర్థికాభివృద్ధికి మార్గం సుగుమవుతుంది.



- డాక్టర్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి
హెచ్‌ఓడీ, పొలిటికల్ సైన్స్, గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్, అనంతపురం.

ద్వంద్వ వైఖరే!

భారత్‌లో భాగమైన కాశ్మీర్‌లో కల్లోలం సృష్టించడం ద్వారా తామే ముస్లిం మతానికి పెద్దగా పాకిస్థాన్ ప్రపంచానికి చెబుతోంది. అయితే దక్షిణ చైనాలోని ఉయ్‌గుర్ ప్రాంతంలోను, ఆఫ్ఘనిస్తాన్‌లోనూ ముస్లింలను అణగదొక్కుతూ తన ద్వంద్వ వైఖరిని చాటుకుంటోంది. దక్షిణ చైనాలో ముస్లిం ప్రాబల్యం అధికంగా ఉండే ఉయ్‌గుర్‌లో ముస్లిం జనాభా ఎక్కువ. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో ముస్లిం ప్రజానీకం చైనా నుంచి స్వేచ్ఛ కావాలని డిమాండ్ చేస్తున్నారు. వీరిని అణగదొక్కేందుకు పాక్‌ను చైనా ఉపయోగించుకుంటోంది. ఇక ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా పాక్ ముస్లింలపై కపట ప్రేమనే చూపిస్తోంది. చైనాతో పాక్ చెలిమికి మరో కారణం కూడా ఉంది. గల్ఫ్ తదితర దేశాలకు తన వాణిజ్య సామ్రాజ్యాన్ని విస్తరించుకోవాలంటే ఇప్పుడు నిర్మిస్తున్న ఆరులైన్ల రహదారి పూర్తి కావాల్సిన అవసరం చైనాకు ఉంది. ఈ రహదారి పాక్ నుంచి పాక్ ఆక్రమిత కాశ్మీర్ మీదుగా నిర్మాణం పూర్తి చేసుకోవాలి. ఇక్కడ చైనా ప్రయోజనాలు నెరవేరాలంటే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో సానుకూల వాతావరణం నెలకొనాలి. కాశ్మీర్‌లో ఎన్నో ఏళ్లుగా పాక్ ప్రేరేపిత ఉగ్ర చర్యలు కొనసాగుతున్నాయి. కాశ్మీర్‌లో నిత్యం సమస్యలు సృష్టించడం ద్వారా భారత్‌కు చికాకులు కల్పించడం పాక్ లక్ష్యం. ఇదే సందర్భంలో కాశ్మీర్ సమస్యను జటిలం చేయడం ద్వారా ఆక్రమిత కాశ్మీర్‌ను ప్రత్యేక దేశంగానో లేదా తమ దేశంలో విలీనం చేసుకోవాలన్నదే పాక్ కుట్రగా భావించాలి. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఉగ్రవాద సమస్యకు కారణంగా భావిస్తున్న వర్గాలకు ఆశ్రయం ఇవ్వడంతో పాక్‌పై ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితులే తాజాగా పాక్‌కు ఆర్థిక సాయం నిలిపివేస్తూ అమెరికా నిర్ణయం తీసుకునేందుకు కూడా కారణమైందనే చెప్పాలి. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న ఆరోపణలను ఎదుర్కొంటున్న పాక్ తన వైఖరిని మార్చుకుంటున్నట్టు కన్పిస్తున్నప్పటికీ ఇది తాత్కాలికమే. పాక్ తీరులో మార్పును ఆశించడం అత్యాశే అవుతుంది.



- ప్రొఫెసర్ కె.రవి
ఏయూ, విదేశీ వ్యవహారాల విభాగం,
విశ్రాంత ఆచార్యులు



భారత్‌తో దోబూచులాట!

ఉగ్రవాద సమస్యపై భారత్‌తో పాక్ దోబూచులాడుతోంది. భారత్‌కు ఎప్పుడూ సహకరించింది లేదు. ముంబయి పేలుళ్ల వ్యవహారం, ఆ తరువాత ఎన్ని సాక్ష్యాలు చూపిస్తున్నా భారత్‌పై వ్యతిరేక శక్తుల్ని ఎగదోస్తుంది. కులభూషణ్ జాదవ్ విషయంలో అదే జరిగింది. అతనిని అక్రమంగా అరెస్టు చేసి భారత్ గూఢచారి అని భారత్ పరువును మంటగలపడానికి ప్రయత్నించింది. ఈ పరిస్థితిలో భారత్ కూడా అంతర్జాతీయ మద్దతు కూడగట్టుకోవడం చాలా అవసరం. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా పాకిస్తాన్ మమ్మల్ని మోసం చేసిందని వ్యాఖ్యానించిన విషయం విదితమే. ఉగ్రవాద చర్యలు చేస్తున్నట్టు అమెరికాకు నిరూపితమైంది. కనుక ఇలాంటి పరిస్థితిలోనే ఏకాకిని చేయాలి. ఇందుకోసం పాక్ తీరును మరింత బహిర్గతపరచాలి. దౌత్యం ద్వారానే మనం విజయం సాధించాలి. భారత్‌తో పాకిస్తాన్‌కు సంబంధాలు మెరుగ్గా లేవు. దానివల్ల మనకు వచ్చిన నష్టం లేదు. మన ధృడవైఖరి మనల్ని కాపాడుతోంది. పాక్ చుట్టూ ఉన్న దేశాలతో మనం వాణిజ్యపరంగా సహకారం అందించి పాక్‌ను ఏకాకిని చేయాలి. ఇక కాశ్మీర్ పరిస్థితిని పరిశీలిస్తే.. ఇటీవల కాలంలో కాశ్మీర్‌లో కొంత అల్లర్లు తగ్గుముఖం పట్టాయి. గతంలో అక్కడ విద్యార్థులు, ముస్లింలు సైనికులపై రాళ్లు రువ్వే కార్యక్రమం చేసి మనల్ని భయపెట్టేవారు. ఇపుడు కాశ్మీర్ ప్రాంతంలో తీవ్రవాదులను ఏరివేయడం ద్వారా ఉగ్రవాద సమస్యను బాగా అదుపులోకి తీసుకువచ్చారు. కాశ్మీర్ ప్రాంతంలో శాంతికోసం భారత్ ప్రభుత్వం ఇటీవల కమిటీని నియమించిన విషయం విదితమే. భారత్ ఇదే వైఖరి కొనసాగిస్తే సరిపోతుంది.

- డాక్టర్ డివిజి శంకరరావు
మాజీ ఎంపీ, విజయనగరం

యుద్ధానికైనా, చర్చలకైనా సిద్ధంగా ఉండాలి

దాయాది దేశం పాకిస్తాన్ తీరు మారుతుందని భావిస్తే పప్పులో కాలేసినట్లే. భారత్ నుంచి పాకిస్తాన్ మత ప్రాతిపదికన వీడిపోయి 1947 ఆగస్టు 14వ తేదీన ఆవిర్భవించింది. పాకిస్తాన్ భారత్ వ్యతిరేకత ప్రాతిపదికన మనుగడ సాగిస్తోంది. భారత్‌ను ప్రతిక్షణం ఆడిపోసుకుంటే తప్ప, ద్వేషిస్తే తప్ప పాకిస్తాన్‌లో పాలక వర్గానికి భవిష్యత్తు లేదు. భారత్‌పై కుతంత్రాలు పన్నడంలో పాకిస్తాన్, చైనా ముందుంటాయి. ఇటువంటి దేశంతో యుద్ధానికి, చర్చలకు రెండింటికీ సిద్ధంగా ఉండాలి. చర్చలు దౌత్య నీతిలో భాగం. ఆ చానల్‌ను ఎప్పటికీ వదులుకోరాదు. అదే సమయంలో పాకిస్తాన్ హామీలు, ప్రకటనలను నమ్మేందుకు వీలులేదు. పాకిస్తాన్ మూడుసార్లు భారత్‌తో యుద్ధం చేసి ఓటమి చెంది, ఈ రోజు ఉగ్రవాదాన్ని ప్రేరేపించడం ద్వారా యుద్ధం చేస్తోంది. పాకిస్తాన్‌ను అంతర్జాతీయ సమాజంలో ఏకాకిని చేసేందుకు అన్ని రకాలుగా భారత్ చేస్తున్న కృషిని యావత్తు జాతి అండగా నిలబడుతోంది. రాజకీయంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో సిద్ధాంతపరమైన తేడాలున్నా, పాకిస్తాన్ పీచమణిచే ప్రతి చర్యకు ప్రజలు, రాజకీయ పార్టీల మద్దతు ఉంటుంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌కు విముక్తి కల్పించాల్సిన బాధ్యత కేంద్రం అజెండాలో ఉంది. పాకిస్తాన్ ఇటీవల ఆ దేశం అక్రమంగా బంధించిన ఉరిశిక్ష విధించిన జాదవ్‌ను కలుసుకునేందుకు తల్లి, భార్య వెళితే అవమానించి పంపింది. మన మాజీ ప్రధాని వాజపేయి లాహోర్ పర్యటనకు వెళ్లినప్పుడు ఘనస్వాగతం పలికి ఆ తర్వాత కార్గిల్ యుద్ధం చేసి ఓటమి చెందింది. పాకిస్తాన్ సొంతంగా అస్తిత్వం లేని దేశం. మతం పునాదిగా ఆవిర్భవించిన పాకిస్తాన్, భారత్ ఉమ్మడి సంస్కృతి, చరిత్ర కలిగి ఉన్నాయి. అందుకే రెండు దేశాల ప్రజల మధ్య స్నేహం పటిష్టతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. భారత్ చొరవ తీసుకుని సంస్కృతి, చరిత్ర పటిష్టతకు చర్యలు తీసుకుంటున్న సమయంలో పాకిస్తాన్ పాలక, సైనిక వర్గం తమ ఉనికికి ప్రమాదం వస్తుందనే భయంతో కయ్యానికి కాలు దువ్వుతుంటాయి. పాకిస్తాన్ ఉగ్ర దేశమని అమెరికాతో ప్రపంచ దేశాలు ఎప్పుడో గుర్తించాయి.



- కె శివకుమార్, వైకాపా ప్రధాన కార్యదర్శి, తెలంగాణ

పాక్ మిలటరీతోనే చేటు

పాకిస్తాన్‌లో కొనసాగిన మిలటరీ ప్రభుత్వాల స్వప్రయోజనాల కారణంగానే భారత్‌తో మైత్రీ సంబంధాలు దెబ్బతింటున్నాయి. గత దశాబ్దకాలంగా మిలటరీ ప్రభుత్వాలు మిలిటెంట్ వ్యవస్థను ప్రత్యామ్నాయంగా భారత్‌పై ఉసిగొల్పుతున్నాయి. అంతర్గత అస్థిరత్వాన్ని ప్రేరేపించేందుకు తీవ్రవాద సంస్థలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరిగిందే కార్గిల్ యుద్ధం. ప్రధానంగా కాశ్మీర్ సమస్య పరిష్కారమైతే భారత్-పాకిస్తాన్‌ల మధ్య సంయమనం కుదిరినట్లేనని భావించాలి. అంతర్జాతీయంగా అభివృద్ధి చెందిన అమెరికా, పాకిస్తాన్‌కు సహకరించడంతో తరచూ కయ్యానికి కాలు దువ్వుతోంది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలు శాంతిని కోరుకుంటాయి. అయితే పాకిస్తాన్‌లో ఇందుకు భిన్నంగా మిలటరీ వ్యవస్థ రాజ్యమేలుతోంది. ఉనికిని చాటుకునేందుకు భారత్‌తో వివాదాలను రెచ్చగొడుతోంది. పాక్ ఆంతరంగిక పరిస్థితుల్లో మార్పులు వచ్చినప్పుడే ఇరుదేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొంటుంది. అంతర్జాతీయ స్థాయిలో రెండు దేశాల మధ్య సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరగాలి. అంతకుముందు సీమాంతర తీవ్రవాదాన్ని నియంత్రిస్తామని పాక్ ప్రకటించాల్సి ఉంది. అప్పటివరకు భారత్ నుంచి సర్జికల్ దాడులు, పాక్ నుంచి తీవ్రవాద దాడుల ముప్పును ఎదుర్కోవాల్సిందే. అంతిమంగా భారత్ పాలకవర్గాలు రాజకీయ కారణాలను పక్కనబెట్టి దేశ సరిహద్దు సమస్యగా భావించి పరిష్కరించుకుంటే మంచిది.



- కె.ఎస్. లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ.

పాక్ సంబంధాలు బాగాలేవు

పాకిస్తాన్‌తో భారతదేశానికి సంబంధాలు బాగాలేవు. పాకిస్తాన్ అనుసరిస్తున్న దౌత్యసంబంధాల తీరులో బాగా మార్పులు రావాలి. మన దేశానికి చెందిన జాదవ్ కుటుంబం పట్ల పాకిస్తాన్ అనుసరించిన తీరు అమానవీయం, గర్హనీయం. అలాంటి చర్యలను పాకిస్తాన్ మానుకోవాలి. దౌత్యసంబంధాల విషయంలో పాకిస్తాన్‌కు భారత్ దీటైన సమాధానం ఇవ్వాలి. జాదవ్ కుటుంబాన్ని భారత ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలి. భారత్‌లోకి పాకిస్తాన్ తీవ్రవాదుల చొరబాట్లను ఆ దేశమే అరికట్టాలి. దౌత్యసంబంధాలు బాగుంటేనే పాకిస్తాన్, భారత్ సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలు ఉండవు. తీవ్రవాదుల పట్ల పాకిస్తాన్ కఠిన చర్యలు తీసుకుని వారిని మనదేశంలోకి పంపే చర్యలను పాకిస్తాన్ మానుకోవాలి. తీవ్రవాదులకు నల్లధనం అందకుండా పాకిస్తాన్ చర్యలు చేపట్టాలి. ఈ చర్యలన్నీ తీసుకుంటేనే భారతదేశంతో పాకిస్తాన్‌కు సంబంధాలు మెరుగుపడతాయి.



- వైవి సుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంటు సభ్యుడు



'నా పేరు సూర్య'

అల్లు అర్జున్ తాజాగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య' (నా ఇల్లు ఇండియా) అనే పేరుతో వస్తున్న దేశ భక్తి చిత్రం ప్రేక్షకుల అంచనాలను మించి టీజర్ విజయవంతమైంది. కథానాయకుడు కొత్త తరహా లుక్‌తో కనిపిస్తారని, ఈ చిత్రంలోని డైలాగులు కూడా తమ అంచనాలను రెట్టింపు చేశాయని నిర్మాతలు తెలియజేస్తున్నారు. అల్లు అర్జున్‌కు జోడీగా అను ఇమ్మాన్యుయేల్ నటించిన ఈ చిత్రంలో బొమన్ ఇరానీ, యాక్షన్ కింగ్ అర్జున్ ఇతర పాత్రల్లో నటించారు. ఏప్రిల్ 27న విడుదలకు ముహూర్తం ఖరారు చేశారు.



విజయ్ సరసన..



తెలుగు, తమిళ భాషల్లోనూ పెద్ద హీరోలతో సినిమాలు చేస్తూ కెరీర్‌లో తిరుగులేని విజయపథంలోకి దూసుకుపోతోంది అందాల భామ కీర్తి సురేష్. పవన్‌కళ్యాణ్ సరసన ఆమె నటించిన 'అజ్ఞాతవాసి', సూర్యతో కలిసి చేసిన 'గ్యాంగ్' చిత్రాలు ఈ సంక్రాంతికే విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఇవే గాక, ప్రస్తుతం ఆమె మరొక క్రేజీ ప్రాజెక్టులో అవకాశం దక్కించుకుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలలో వున్న విజయ్, మురుగదాస్ చిత్రంలో కథానాయికగా కీర్తి సురేష్‌ని ఎంపిక చేశారు. గతంలో కీర్తి సురేష్ విజయ్‌తో కలిసి 'భైరవ' అనే చిత్రంలో నటించింది. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సన్ గ్రూప్ రూపొందిస్తోంది.

మూడు పూలు ఆరు కాయలు



స్మైల్ పిక్చర్స్ పతాకంపై రామస్వామి దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రానికి 'మూడు పువ్వులు ఆరు కాయలు' అనే పేరును ఖరారు చేశారు. అర్జున్ యజత్, భరత్ భండారి, రామస్వామి కథానాయకులుగా నటిస్తున్న ఈ చిత్రంలో సౌమ్యా వేణుగోపాల్, పావని, సీమాచౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ- నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి అనే కథనంతో కడుపుబ్బ నవ్వించే హాస్యరసంతోపాటుగా కంట తడి పెట్టించే సన్నివేశాలు కూడా ఈ చిత్రంలో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుతున్నామని, మంచి పాయింట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం కుటుంబమంతా కలిసి చూడదగిన విధంగా వుంటుందని ఆయన తెలిపారు. తనికెళ్ల భరణి, కృష్ణభగవాన్, పృధ్వీ, అజయ్ ఘోష్, బాలాజీ, రాకెట్ రాఘవ, ఆటో రాంప్రసాద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు:చంద్రబోస్, భాస్కరభట్ల, ఎడిటింగ్:ఉపేందర్, కెమెరా:ఎన్.మోహన్‌చంద్, సంగీతం:విష్ణు, సాయి, నిర్మాత:వబ్బిన వెంకట్రావు, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం:రామస్వామి.



చివరి షెడ్యూల్‌లో..

రామ్‌చరణ్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రంగస్థలం'. ఈ సినిమా ముగింపు దశకు చేరుకుంది. ఇప్పటివరకు హైదరాబాద్‌లో జరిగిన భారీ షెడ్యూల్‌తో ఈ సినిమా షూటింగ్ పూర్తిచేశారు. చివరి షెడ్యూల్ రాజమండ్రిలో జరపనున్నారు. ఈ షెడ్యూల్‌ను ఈ నెల 12 వరకు జరిపి టాకీ పార్ట్ మొత్తం పూర్తి చేయనున్నారు. సమంత కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం 1985 నేపథ్యంలో ఉంటుంది. ఇప్పటికే పరిశ్రమలో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ రూపొందిస్తోంది. వచ్చే నెలలో పాటలను విడుదల చేసి మార్చి 30న విడుదల చేయనున్నారు.

వైఎస్‌గా మమ్ముట్టి!



బాలీవుడ్‌లో బయోపిక్ హవా ఎక్కువ అవుతోంది. కొత్త కథలను వెతికే కంటే కొందరు గొప్ప వ్యక్తుల జీవిత కథలను తెరకెక్కించే సన్నాహాలు చేస్తున్నారు. ఈ పద్ధతి ఇప్పుడు టాలీవుడ్‌కు వచ్చింది. తెలుగులో బయోపిక్ చిత్రాలు ఎక్కువగానే తెరకెక్కుతున్నాయి. ఎన్టీఆర్, మహానటి సావిత్రి, పుల్లెల గోపీచంద్ కథలు సినిమాలుగా వస్తున్నాయి. తాజాగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవిత కథను సినిమాగా రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. సాధారణ స్థాయి నుండి ముఖ్యమంత్రిగా ఎదిగిన వై.ఎస్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకంగా వుంటుందని దర్శకుడు మహిత్ రాఘవ ఈ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నాడు. వై.ఎస్ పాత్రలో మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టిని ఎంపిక చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆయనతో చర్చలు కూడా జరుగుతున్నాయట. మరోవైపు ఈ చిత్రం కోసం అనుమతి తీసుకోవడానికి వై.ఎస్ తనయుడు జగన్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తున్నాడు దర్శకుడు. అన్నీ కుదిరాయంటే త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.



5న 'సారథి' వస్తున్నాడు

ధను క్రియేషన్స్ పతాకంపై అల్లం భువన్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'సారథి'. నూతన తారలు రేవంత్.జొహెచ్, సమ్మోహిత్, అనితా రాఘవ, తేజారెడ్డి ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 5న విడుదలకు సిద్ధమైన సందర్భంగా పాత్రికేయుల సమావేశం జరిగింది. అల్లం భువన్ మాట్లాడుతూ- తన తొలి చిత్రంగా రూపొందించిన ఈ సినిమాలో నటీనటులందరూ కష్టపడి నటించారని, మొదట తాను ఎలా తీస్తానో అని భయపడినవారు ఆ తరువాత సినిమా చూసి అభినందించారని తెలిపారు. డైలాగులు చిత్రంలో హైలెట్‌గా వుంటాయని, నిజాయితీగా వుండడమే రాజకీయ నాయకుల, పోలీసుల విధి అని సారాంశమే ఈ చిత్రంలో వుంటుందని ఆయన అన్నారు. 25 లఘు చిత్రాల్లో నటించిన తాను, తొలిసారిగా పెద్ద తెరతో పరిచయం అవుతున్నానని, ఈ చిత్రానికి సంబంధించిన పాటలను వైజాగ్‌లో విడుదల చేయగా మంచి ఆదరణ లభించిందని కథానాయకుడు రేవంత్ తెలిపారు. సినిమా ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుందని, మ్యూజిక్ హైలెట్‌గా నిలుస్తుందని కథానాయిక అనితా రాఘవ తెలిపారు. మంచి కథాంశంతో వస్తున్న ఈ చిత్రం తప్పక విజయవంతం అవుతుందని జి.సురేష్ కుమార్ తెలిపారు. భానుచందర్, మల్లాది రాఘవ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఎడిటింగ్:నందమూరి హరి, కెమెరా:టి.కె.పరంధామ, సంగీతం:వి.కిరణ్‌కుమార్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, నిర్మాత:అల్లం భువన్.

యాక్షన్‌తో 'గాయత్రి'



మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. మంచు విష్ణు, శ్రియ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను ఇటీవల విడుదల చేశారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగుతూ కుటుంబ కథా చిత్రంగా వుంటుందని దర్శకుడు మదన్ తెలియజేశారు. ఫిబ్రవరి 9న ఈ సినిమాను విడుదల చేయనున్నామని వారు తెలిపారు. శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్.తమన్, కెమెరా: సర్వేష్ మురారి, ఎడిటింగ్: ఎం.ఆర్.వర్మ, నిర్మాత: మోహన్‌బాబు.ఎం., దర్శకత్వం: మదన్ రామిగాని.



రామ్‌తో రష్మిక



త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాణంలో నటుడు రామ్ ఓ చిత్రంలో నటించనున్నారు. 'ఉన్నది ఒక్కటే జిందగీ' సినిమా తరువాత ఆయన నటిస్తున్న చిత్రం ఇదే. 'నేను లోకల్' సినిమా తరువాత నక్కిన త్రినాథరావు చేస్తున్న సినిమా కూడా ఇదే. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటించనున్నదట. ప్రస్తుతం ఆమె నిఖిల్‌తో 'కిరాక్ పార్టీ' చిత్రంతోపాటుగా విజయ్ దేవరకొండ, పరశురామ్‌ల చిత్రంలో నటిస్తోంది. ఒక్క సినిమా విడుదల కాకుండానే ఈ అమ్మడు మూడు సినిమాల్లో నటిస్తూ బిజీగా వుంది. రామ్‌తో రూపొందించనున్న ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరి రెండో వారంలో ప్రారంభం కానున్నదట.

18నుండి రెగ్యులర్ షూటింగ్



సెల్వరాఘవన్ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్ పతాకంపై సూర్య, సాయి పల్లవి జంటగా ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు రూపొందిస్తున్న ఓ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ఇటీవలే మొదలైంది. ఈ సందర్భంగా కథానాయకుడు సూర్య మాట్లాడుతూ- తాను ఇప్పటివరకు చేస్తున్న 35 చిత్రాలకు భిన్నంగా ఈ చిత్రం ఉంటుందని, దర్శకుడు చెప్పిన కథ వైవిధ్యంగా సాగుతుందని, అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకునేలా దర్శకుడు రూపొందిస్తున్నారని తెలిపారు. సూర్య లాంటి వెర్సటైల్ హీరోతో ఇలాంటి చిత్రం చేయడం సంతోషంగా వుందని, సూర్య మాత్రమే ఈ పాత్రకు యాప్ట్‌గా వుంటారని దర్శకుడు సెల్వరాఘవన్ అన్నారు. ఓ మంచి చిత్రంగా ఈ సినిమాను తమ సంస్థలో రూపొందిస్తున్నామని సూర్య, సెల్వరాఘవన్‌ల కెరియర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుందని, ఈనెల 18 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి దీపావళికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శివకుమార్, విజయన్, ఎడిటింగ్: జి.కె.ప్రసన్న, నిర్మాతలు: ఎస్.ఆర్.ప్రకాష్, ఎస్.ఆర్.ప్రభు, దర్శకత్వం: సెల్వరాఘవన్.